www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
19-12-2024
సంపుటి : 01 | సంచిక : 227 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS


డా॥ కాచం సత్యనారాయణ
CMD

## ఆటో డ్రైవర్లు ధైర్యాన్ని కోల్పోవద్దు



- మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ
- ఆటో నడుపుతూ అసెంబ్లీకి కేటీఆర్
- ఖాకీ యూనిఫాం వేసుకొని ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్ నుంచి 25 ఆటోల్లో ఎమ్మెల్యేలు
- ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి
- కార్మికులకు ఇన్సూరెన్సు కల్పించాలని డిమాండ్

**విశ్వంభర, హైదరాబాద్:** రాజకీయ నాయకులు ర్యాలీలు తీయడం సహజం. అది కార్లతో, బస్సులతో కన్వాయ్ పెట్టి ర్యాలీలు నిర్వహిస్తారు. కానీ బుధవారం అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆటోలలో ర్యాలీగా వచ్చారు. ఈ ర్యాలీ వెనుక అనేక ఆసక్తికర విషయాలు కనిపిస్తున్నాయి. ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి, ఆటో కార్మికులకు ఇన్సూరెన్సు **మిగతా2లో...**

లగచర్ల కేసులో పట్నం నరేందర్‌రెడ్డికి
## బెయిల్ మంజూరు

- ఇదే కేసులో నిందితులుగా ఉన్న మరో 24 మందికి కూడా బెయిల్
- కీలక సూత్రధారిగా ఉన్న ఏ2 సురేష్ తో పాటు మరొకరికి మాత్రం బెయిల్ నిరాకరణ



**విశ్వంభర, హైదరాబాద్:** లగచర్ల కేసులో నిందితుడి(ఏ1)గా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్‌రెడ్డికి నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నరేందర్‌రెడ్డితో పాటు ఇదే కేసులో **మిగతా2లో...**



# అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారు

**ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును తాకట్టుపెట్టారు**

- భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోయాయి
- వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి
- అదానీపై విచారణ జరగాలి
- విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి
- అదానీ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా
- తెలంగాణ కాంగ్రెస్ నేతల 'చలో రాజ్‌భవన్ పాల్గొని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి




**విశ్వంభర, హైదరాబాద్:** భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోయాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను పెంపొందించిందని చెప్పారు. అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును తాకట్టుపెట్టారని ఆక్షేపించారు. మణిపూర్ అల్లర్లు, అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ **మిగతా2లో...**

## కేరళలో మంకీపాక్స్ కలకలం

- రెండు కేసులు నమోదు
- ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడి




ప్రాణాంతక మంకీపాక్స్ వైరస్ కేసులు కలకలం రేపుతున్నాయి. కేరళలో కొత్తగా రెండు కేసులు నమోదయ్యాయి. యూఏఈ నుంచి ఇటీవల వచ్చిన ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు.

## తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదల

- జనవరి 2 నుంచి 20 వరకు పరీక్షలు
- టెట్ రెండు పేపర్లకు సుమారు 2.75 లక్షల మంది దరఖాస్తు




తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విడుదల చేశారు. సబ్జెక్టుల వారీగా షెడ్యూల్‌ను విడుదల చేశారు. జనవరి 2 నుంచి 20 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

## హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలనూ కూల్చం

- కూల్చివేతలపై కీలక ప్రకటన..
- విధివిధానాలు వివరించిన రంగనాథ్
- ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత
- మరింత నిబద్ధతతో హైడ్రా పనిచేస్తోంది

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కీలక ప్రకటన చేసింది. హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలనూ హైడ్రా కూల్చదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ''అనుమతి లేకుండా కట్టిన నివాస గృహాలు జులై 2024కి సిద్ధమై, వాటిలో నివాసం ఉంటే హైడ్రా కూల్చదు. ఎఫ్‌టీఎల్‌లో **మిగతా2లో...**



# బంగాళాఖాతంలోకి ధరణి పోర్టల్

**ప్రజాసమస్యల పరిష్కారానికే రద్దు**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేషన్లు జరగలేదు

శాసనసభలో 'భూభారతి' బిల్లును ప్రవేశపెట్టిన పొంగులేటి



**విశ్వంభర, హైదరాబాద్:** భేషజాలకు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమస్యల పరిష్కారానికే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేషన్లు జరగలేదన్నారు. శాసనసభలో 'భూభారతి' బిల్లును పొంగులేటి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ''ధరణితో అనేక మంది ఇబ్బందులు పడిన మాట వాస్తవం. ఆ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చాం.. ఇప్పుడు వేస్తున్నాం. ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నాం. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు లిఖితపూర్వకంగా సూచించిన అంశాలను పొందుపరిచాం. ముసాయిదా బిల్లును 40 రోజులు వెబ్‌సైట్‌లో ఉంచాం. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టాం. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో ఒకరోజు చర్చ కూడా నిర్వహించాం. **మిగతా2లో...**

'జమిలి'పై జేపీసీ ఏర్పాటు చేసిన కేంద్రం 10

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

## కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించిన అల్లు అరవింద్

- కుటుంబ సభ్యులతో మాట్లాడంతో పాటు బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- శ్రీతేజ్ ఆరోగ్యం విషమంగానే ఉందని చెప్పిన కిమ్స్ వైద్యులు






## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 91 | ₹ 113 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 164 | ₹ 186 |

## ముంబయిలో ఫెర్రీ ప్రమాదం



- 13 మంది మృతి
- 10 మంది పర్యాటకులు కాగా.. ముగ్గురు నేవీ సిబ్బంది
- అధికారికంగా ప్రకటించిన సీఎం
- 101 మందిని కాపాడినట్లు వెల్లడి

2

## పదేళ్లలో మీరు పెట్టిన బురద కడిగేందుకే సరిపోతోంది

- రాష్ట్రం ఏర్పడిన తర్వాత మీరేం చేశారో చెప్పాలి
- ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించాం
- రాబోయే రోజుల్లో మెస్ ఛార్జీలు, అద్దె భవనాలకు బకాయిలు లేకుండా చూస్తాం
- హరీశ్‌రావుకు మంత్రి పొన్నం కౌంటర్




## ఎవరి లాభం కోసం?

- 'మూసీ'పై అబద్ధాలు ఎందుకు..
- మండలిలో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తప్పుడు సమాధానాలు ఇస్తోంది
- ప్రజలకు స్పష్టత ఇవ్వాలి: ఎమ్మెల్సీ కవిత



# బంగాళాఖాతంలోకి 'ధరణి' పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)
18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలించి భూభారతి తీసుకొచ్చాం. ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తాం. భూ వివాదాలపై అప్పీలుకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తాం. అనుభవదారుల కాలాన్ని కూడా ఈ కొత్త బిల్లులో పొందుపరిచాం. 33 మాడ్యూల్స్‌తో ఉన్న దాన్ని 6 మాడ్యూల్స్‌తో పునఃప్రక్షాళన చేస్తున్నాం''అని పొంగులేటి తెలిపారు.

# తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదల

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యశాఖ డైరెక్టర్ విడుదల చేశారు. సబ్జెక్టుల వారీగా షెడ్యూల్‌ను విడుదల చేశారు. జనవరి 2 నుంచి 20 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం.. రెండు సెషన్లుగా 9 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈసారి టెట్ పేపర్-1, పేపర్-2లకు కలిపి సుమారు 2.75 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

# కేరళలో మంకీపాక్స్ కలకలం

**వయనాడ్:** ప్రాణాంతక మంకీపాక్స్ వైరస్ కేసులు కలకలం రేపుతున్నాయి. కేరళలో కొత్తగా రెండు కేసులు నమోదయ్యాయి. యూఏఈ నుంచి ఇటీవల వచ్చిన ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు.వయనాడ్‌కు చెందిన వ్యక్తికి తొలుత నిర్ధరణ కాగా.. తాజాగా కన్నూర్ జిల్లా వాసికి వైరస్ సోకినట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన అధికారులు.. బాధితులతో సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ వైరస్ లక్షణాలు కనిపిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలాఉంటే, రాష్ట్రంలో ఈ ఏడాది సెప్టెంబర్‌లోనూ కొన్ని ఎంపాక్స్ కేసులు నమోదైన విషయం తెలిసిందే.

# లగచర్ల కేసులో పట్నం నరేందర్‌రెడ్డికి బెయిల్ మంజూరు

(మొదటి పేజీ తరువాయి)
నిందితులుగా ఉన్న మరో 24 మందికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. పట్నం నరేందర్‌రెడ్డి రూ.50వేల పూచీకత్తు .. మిగతా రైతులకు రూ.20వేల పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసులో కీలక సూత్రధారిగా ఉన్న ఏ2 సురేష్ తో పాటు మరొకరికి మాత్రం బెయిల్ నిరాకరించింది. ప్రస్తుతం పట్నం నరేందర్ రెడ్డి చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మిగిలిన రైతులు సంగారెడ్డి జైలులో ఉన్నారు. వీరంతా గురువారం విడుదలయ్యే అవకాశం ఉంది.

# కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించిన అల్లు అరవింద్

**విశ్వంభర, హైదరాబాద్:** సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను సినీ నిర్మాత అల్లు అరవింద్ పరామర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్ గత రెండు వారాలుగా కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.శ్రీతేజ్ ఆరోగ్యం విషమంగానే ఉందని కిమ్స్ వైద్యులు చేతన్, విష్ణు తేజ్‌లు మంగళవారం రాత్రి విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో పేర్కొన్నారు. ఐసీయూలో వెంటిలేటర్‌పైనే ఉన్నాడన్నారు. మెదడుకు ఆక్సిజన్ సరిగా అందటం లేదని, బాలుడిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం ట్యూబ్ ద్వారా ఆహారం అందిస్తున్నామన్నారు.

# పదేళ్లలో మీరు పెట్టిన బురద కడిగేందుకే సరిపోతోంది

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ శాసనసభలో గురుకులాలపై చర్చ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం నడిచింది. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ''55 ఏళ్లుగా మీ ప్రభుత్వమే ఉంది కదా అని హరీశ్‌రావు అన్నారు. అన్యాయం జరిగిందనే కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మీరేం చేశారో చెప్పాలి.నేను విద్యార్థి నాయకుడిని, కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం కోసం పనిచేస్తుంది. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించాం. మేము, మా ముఖ్యమంత్రి గురుకులాలకు వెళ్లాం. మీరు పదేళ్లలో గురుకులాలకు ఒక్క సొంత భవనం ఎందుకు కట్టలేదు. రాబోయే రోజుల్లో మెస్ ఛార్జీలు, అద్దె భవనాలకు బకాయిలు లేకుండా చూస్తామని సీఎం చెప్పారు. పదేళ్లలో ఒక్క వైస్ ఛాన్సలర్ పోస్టు భర్తీ చేయలేదు, టీచర్ల నియామకాలు లేవు, ప్రమోషన్లు లేవు..ఏం చేశారు? 10 ఏళ్లలో మీరు పెట్టిన బురద కడగడానికే సమయం సరిపోతోంది. హాస్టల్‌లో చదువుకుంటున్న 8లక్షల మంది పిల్లలకు ధైర్యం కల్పించేలా సభ ఉండాలి'' అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

# ఎవరి లాభం కోసం?

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ సభ్యులు మండలిలో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తప్పుడు సమాధానాలు ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్ ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు విషయంలో మంత్రి శ్రీధర్‌బాబు సభను తప్పుదోవ పట్టించారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కవిత మాట్లాడారు. ''మూసీ ప్రాజెక్ట్ కోసం ప్రపంచ బ్యాంకు రుణం అడగలేదని శ్రీధర్‌బాబు చెబుతున్నారు. సెప్టెంబర్‌లో రుణం అడిగినట్లు సాక్ష్యాధారాలు బయటపెడుతున్నాం. డీపీఆర్ లేదని అసెంబ్లీలో చెబుతున్నారు. ప్రపంచబ్యాంకుకు సెప్టెంబర్ 19న ఇచ్చిన నివేదికలో డీపీఆర్ ఉందని పేర్కొన్నారు. అబద్ధాలు ఎందుకు? ఎవరి లాభంకోసం ఇదంతా చేస్తున్నారు? ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ప్రపంచ బ్యాంకును తెలంగాణలో అడుగుపెట్టనివ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్‌కార్పెట్ వేస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా రూ.14వేల కోట్ల సాయం అడిగారు. మూసీ ప్రాజెక్టుపై అబద్ధాలు చెబుతున్న ఈ ప్రభుత్వాన్ని వదిలి పెట్టే ప్రసక్తే లేదు'' అని కవిత అన్నారు.





# అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారు

(మొదటి పేజీ తరువాయి)
ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు.''అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి. అదానీ అవినీతిపై చర్చ, జేపీసీ వేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోదీ యత్నిస్తున్నారు. ఈ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం.

**బీఆర్ఎస్.. ప్రజల వైపా? అదానీ-ప్రధాని వైపా?**

అరెస్ట్‌ల నుంచి తప్పించుకోవడానికి బీజేపీకి బీఆర్ఎస్ లొంగిపోయింది. అందుకే అదానీకి వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. బీఆర్ఎస్.. ప్రజల వైపా? అదానీ-ప్రధాని వైపా? అనేది తేల్చి చెప్పాలి. మోదీ-కేసీఆర్ వేర్వేరు కాదు.. ఇద్దరూ నాణేనికి బొమ్మాబొరుసు. బీఆర్ఎస్ చిత్తశుద్ధి ఉంటే అదానీ అవినీతిపై జేపీసీకి డిమాండ్ చేయాలి. ఆ పార్టీ కోరితే శాసనసభలో చర్చకు అనుమతిస్తాం. అదానీ అవినీతిపై జేపీసీ కోసం సభలో ఏకగ్రీవ తీర్మానం చేద్దాం. ప్రధాని అండగా నిలబడినా.. ప్రజాకోర్టులో అదానీని శిక్షించే వరకు పోరాడుతాం'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.



# ముంబయిలో ఫెర్రీ ప్రమాదం

**ముంబయి:** ముంబయి సముద్ర తీరంలో పెను విషాదం చోటుచేసుకుంది. పర్యాటకులతో వెళ్తున్న పడవను నేవీకి చెందిన బోటు ఢీకొట్టిన ఘటనలో 13 మంది మృతిచెందారు. ఈ విషయాన్ని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటనలో 101 మందిని కాపాడినట్లు తెలిపారు. చనిపోయిన వారిలో 10 మంది పర్యాటకులు కాగా.. ముగ్గురు నేవీ సిబ్బంది ఉన్నట్లు ప్రకటించారు. 'గేట్ వే ఆఫ్ ఇండియా' నుంచి ఎలిఫెంటా గుహలకు 'నీల్‌కమల్' అనే ఫెర్రీ.. దాదాపు 100 మందికి పైగా పర్యాటకులతో బయలుదేరింది. ఈ క్రమంలో చక్కర్లు కొడుతూ వేగంగా వచ్చిన నేవీకి చెందిన ఓ స్పీడ్ బోటు దాన్ని బలంగా ఢీకొట్టింది. దాంతో ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 13కి చేరింది. అయితే, ఘటనా సమయంలో ఫెర్రీతోపాటు నేవీ బోటులో ఎంత మంది చొప్పున ఉన్నారనే విషయంపై పూర్తి స్పష్టత లేదు. ఈ మధ్యాహ్నం 3.55 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని సీఎం దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. రాత్రి 7.30గంటల సమయానికి 101 మందిని సురక్షితంగా కాపాడగా.. 13మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ ఘటనలో తీవ్రగాయాలైన వారిని నేవీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.5లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. ఈ మొత్తం ఘటనపై పోలీసులు, నేవీ దర్యాప్తు చేస్తామని సీఎం వెల్లడించారు. మరోవైపు, ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే రెస్క్యూ బృందాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. 11 నేవీ పడవలతో సహా తీర ప్రాంత దళాలకు చెందిన మూడు పడవలు, నాలుగు హెలికాప్టర్లు కూడా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. పోర్టు అధికారులు, కోస్ట్‌గార్డ్, మత్స్యకారుల సహాయక చర్యల్లో పాల్గొని 101 మందిని కాపాడాయి.

**స్పందించిన నేవీ..**

ఈ ఘటనపై భారతీయ నౌకాదళం స్పందించింది. స్పీడ్ బోటు ఇంజిన్ ట్రయల్స్ చేస్తున్న క్రమంలో సాంకేతిక లోపం తలెత్తిందని, దీంతో బోటు నియంత్రణ కోల్పోయి ఫెర్రీని ఢీకొన్నట్లు వెల్లడించింది.



# మహానగరం సిగలో మరో మణిహారం

- **28న చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం**

**విశ్వంభర, హైదరాబాద్:** చర్లపల్లి రైల్వే టెర్మినల్ మహానగరం సిగలో మరో మణిహారం కానుంది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సుమారు రూ.430 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ టెర్మినల్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 28న రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు.

**ఆధునిక సౌకర్యాలతో..**

ఈ స్టేషన్ భవనంలో ఆరు ఎస్కలేటర్లు, ఏడు లిఫ్ట్‌లు, ఆరు బుకింగ్ కౌంటర్లు, పురుషులు, మహిళలకు వేర్వేరు వెయిటింగ్ హాళ్లు, హైక్లాస్ వెయిటింగ్ ఏరియా, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఉంది. మొదటి అంతస్తులో కెఫెటేరియా, రెస్టారెంట్, రెస్ట్‌రూమ్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కొత్త డిజైన్‌లో ప్రయాణికుల రాకపోకలకు విశాలమైన స్థలం (కాన్కోర్స్), ముందువైపు ప్రకాశవంతమైన లైటింగ్‌తో ఆధునిక ఎలివేషన్‌ను తీర్చిదిద్దారు. ప్రయాణికులకు ఉచిత వైఫై సదుపాయం కల్పించనున్నారు. హైదరాబాద్ శివారులోని ఈ టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక.. పలు రైళ్లు ఇక్కడి నుంచే ప్రారంభం కానున్నాయి. తద్వారా జంటనగరాల్లోని ప్రధాన రైల్వేస్టేషన్లపై ఒత్తిడి తగ్గించాలనేది రైల్వే శాఖ లక్ష్యం.ఈ టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక నగరంలోని నాంపల్లి, కాచికూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లపై ప్రయాణికుల ఒత్తిడి గణనీయంగా తగ్గిపోనుంది. ఇక్కడి నుంచే నగరం నలుమూలలకు ప్రయాణికులు సులువుగా చేరుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే నడుస్తున్న రైళ్లకు అదనంగా కొత్తగా మరో 25 జతల రైళ్లు ఇక్కడి నుంచి పరుగుల తీయనున్నాయి. లక్షల్లో ప్రయాణికులు రాకపోకలు సాగించనున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజారవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టింది.

# ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో అక్రమాలు గుర్తించిన హైడ్రా

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలోని ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో అక్రమాలు జరిగినట్లు నీటిపారుదల శాఖ, హైడ్రా అధికారుల తనిఖీల్లో వెలుగుచూసింది. ఆక్రమణదారులకు సహకరిస్తూ ముగ్గురు నీటిపారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్ మ్యాప్‌లో మార్పులు చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు సదరు అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి హైడ్రా సిఫారసు చేసింది. ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో చోటుచేసుకున్న మార్పులను సరిదిద్దుతున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.



# హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలనూ కూల్చం

(మొదటి పేజీ తరువాయి)
అనుమతులు లేకుండా కట్టిన వాణిజ్య, వ్యాపార కట్టడాలను మాత్రం కూల్చక తప్పదు. గతంలో అనుమతులు ఇచ్చి తరువాత రద్దు చేస్తే అవి అక్రమ కట్టడాలే అవుతాయి.అనుమతులు రద్దైనా నిర్మాణాలు జరుగుతుంటే అక్రమ కట్టడాలుగానే పరిగణిస్తాం.పేదలను ముందు పెట్టి వెనుక నుంచి చక్రం తిప్పుతున్న ల్యాండ్ గ్రాబర్స్ చర్యలను హైడ్రా తీవ్రంగా పరిగణిస్తుంది. మల్లంపేట కొత్వాల్ చెరువు, అమీన్‌పూర్‌లో కూల్చివేసినవి అక్రమ కట్టడాలే. ఎఫ్‌టీఎల్ మార్కింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు హైడ్రా ప్రాధాన్యత ఇస్తుంది. 12 చెరువుల్లో కూల్చివేతలు చేపట్టాం.. చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే పనులు మొదలు పెడతాం. 5 నెలల అనుభవాల నుంచి హైడ్రా అనేక అంశాలపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్తోంది.లోటుపాట్లు ఏమైనా ఉంటే వాటిని సవరించుకొని మరింత నిబద్ధతతో హైడ్రా పనిచేస్తోంది. వివిధ సందర్భాలలో కోర్టులు ఇచ్చిన తీర్పులకు లోబడి హైడ్రా ముందుకు వెళ్తోంది. ప్రభుత్వం దిశానిర్దేశం మేరకు హైడ్రా పని చేస్తుంది. హైడ్రాను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు అధికారాలను కట్టబెట్టింది. సాంకేతికంగా కూడా మరింత బలంగా తయారవుతుంది. గత 5 నెలల్లో హైడ్రా దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది'' అని కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

# ఆటో డ్రైవర్లు ధైర్యాన్ని కోల్పోవద్దు

(మొదటి పేజీ తరువాయి)
కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆటోల్లో అసెంబ్లీకి బయలుదేరారు. ఖాకీ యూనిఫాం వేసుకొని ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్ నుంచి 25 ఆటోల్లో బయలుదేరారు ఎమ్మెల్యేలు. ఎమ్మెల్యే తలసాని ఇంటి నుంచి నడుచుకుంటూ రోడ్డు వరకు వచ్చిన ఎమ్మెల్యేలు బయట ఉన్న ఆటోల్లో ఎక్కారు. కానీ, అక్కడే ఓ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. ఆటో నడిపే డ్రైవర్లను అసెంబ్లీ లోపలికి రానివ్వరు. దీంతో ఎమ్మెల్యేలు స్వయంగా ఆటో నడుపుకుంటూ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే ఎవరికి ఆటో డ్రైవింగ్ వచ్చు అని సందేహం ఏర్పడింది.. దీంతో వెంటనే నాకు ఆటో నడపడం వచ్చు అంటూ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రంగంలోకి దిగి ఆటో హ్యాండిల్ పట్టుకున్నారు. అ తర్వాత మరో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మరో ఆటో అందుకున్నారు. ఇంకెవరున్నారు..? అనుకునేలోపే.. నేనున్నా అంటూ భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ వచ్చేశారు.. స్వయంగా కేటీఆర్ ఆటో హ్యాండిల్ పట్టుకొని ఆటో స్టార్ట్ చేశారు.. దీంతో అక్కడున్న ఎమ్మెల్యేలు షాక్ అయ్యారు... మిగతా పబ్లిక్ ఆసక్తిగా చూస్తుండగానే కేటీఆర్ కొంతమంది ఎమ్మెల్యేలను ఎక్కించుకొని రయ్యిమని బయలుదేరారు కేటీఆర్..ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ''ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు అండగా ఉండాలి. 93 మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణం. ఆటో కార్మికులు ధైర్యాన్ని కోల్పోవద్దు. బీఆర్ఎస్ అండగా ఉంటుంది. న్యాయం జరిగేవరకు పోరాడుతాం'' అని కేటీఆర్ అన్నారు. మరోవైపు.. శాసనసభలో ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది.

# యువతి ఫిర్యాదు.. యూట్యూబర్ బెహరా ప్రసాద్ అరెస్ట్

**విశ్వంభర, హైదరాబాద్:** సహచర నటిని వేధించిన కేసులో బెహరా ప్రసాద్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. మణికొండకు చెందిన బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఓ వెబ్‌సిరీస్ షూటింగ్ సమయంలో ప్రసాద్ తనకు పరిచయమయ్యాడని యువతి తెలిపింది. షూట్‌లో భాగంగా అసభ్యంగా ప్రవర్తించాడని.. నిలదీయడంతో క్షమాపణలు చెప్పాడని పేర్కొంది.కొద్ది రోజుల తర్వాత మరో వెబ్ సిరీస్‌లో కలిసి పనిచేశామని, ఆ సమయంలో అందరి ముందు అసభ్యంగా ప్రవర్తించాడని యువతి తెలిపింది. ఇదేమిటని ప్రశ్నించగా అసభ్య పదజాలంతో దూషించాడని, ఈ నెల 11న షూటింగ్ నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో యూనిట్ అందరి ముందు తనపై దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రసాద్‌ను కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి.. 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.





# ధరణి పోర్టల్ ఇకపై భూ భారతి

## ప్రతి కమతానికి భూధార్ నంబర్

### ఆబాదీ భూములకు కూడా..

### ఆన్‌లైన్‌లో పహాణీలు

### భూసమస్యల పరిష్కారానికి అప్పీలేట్స్

### పెండింగ్ సాదా బైనామాలకూ పరిష్కారం

**ధరణి స్థానంలో భూమాతను తెస్తామని గత ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇందులో భాగంగానే.. భూ సమస్యల నివారణకు తెలంగాణ ప్రభుత్వం నూతన రెవెన్యూ చట్టం తీసుకొచ్చింది. భూ దస్త్రాలు, యాజమాన్య హక్కుల చట్టం-2024 బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆర్ఓఆర్-2020 స్థానంలో కొత్తగా భూ భారతి బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. ధరణి పోర్టల్ ఇకపై భూ భారతిగా మారుతోంది. దిగుబడి రాక, అప్పులు తీర్చలేకనే రైతులు ఆత్మహత్య చేసుకుంటారనుకుంటాం. కానీ, వాటిలో ఒక కారణం.. భూ సమస్య. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఎన్నో కారణాలుండొచ్చు. వాటిలో ఒక కారణం.. భూసమస్యే. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ భూసమస్యను ఎవరూ తీర్చలేకపోతున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలంలో భూభారతి పేరుతో సర్వేకు ప్రయత్నించారు. ఆ తరువాత కేసీఆర్ హయాంలో ధరణి తీసుకొచ్చారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఇప్పుడు భూభారతి తీసుకొచ్చింది. మరి ఇప్పటికైనా భూసమస్యలు తీరేనా? ఇంతకీ ధరణితో వచ్చిన ఇబ్బందులేంటి? భూభారతి చట్టంతో దొరికే పరిష్కారాలేంటి? విశ్వంభర ప్రత్యేక కథనం..**

### అందుకే ఆర్వోఆర్ చట్టానికి అంత ప్రాధాన్యత..

అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తీసుకొస్తామని చెప్పింది. కాని, చాలా రాష్ట్రాల్లో భూమాత పేరు ఉండడంతో.. 'భూభారతి'ని తీసుకొస్తున్నట్టు ప్రకటించింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఇందులో భాగంగానే.. 'రికార్డ్స్ ఆఫ్ రైట్స్-2020' చట్టాన్ని రద్దు చేసి కొత్తగా ఆర్వోఆర్-2024 చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ ఆర్వోఆర్ గురించి సాధారణంగా చెప్పుకోవాలంటే.. భూ యజమానులకు హక్కు కల్పించడం. ఆ హక్కును రికార్డుల్లోకి ఎక్కించడం. రికార్డుల్లో పేరు ఉందంటే.. ఇక ఆ భూమికి ఢోకా లేదనే అర్థం. అందుకే, ఆర్వోఆర్ చట్టానికి అంత ప్రాధాన్యత.

### 2020 చట్టంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్న రైతులు..

ఇంతకీ కొత్త ఆర్వోఆర్ చట్టంతో సమస్యలకు పరిష్కారాలకు దొరుకుతాయా అంటే.. కచ్చితంగా దొరుకుతాయనే అంటోంది రాష్ట్ర ప్రభుత్వం. మరీ ముఖ్యంగా ఆర్వోఆర్-2020 కారణంగా కోర్టుల చుట్టూ తిరుగుతున్న రైతులు కొన్ని వేల మంది ఉన్నారు. కారణం..ఆర్వోఆర్-2020 చట్టం ప్రకారం ఏదైనా భూసమస్యను కలెక్టర్ తిరస్కరణ చేస్తే, ఇక అంతే.. సరాసరి కోర్టుకు వెళ్లాల్సిందే..! మరో ఆప్షనే లేదు.ఉదాహరణకు.. ధరణి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ జరిగితే, వెంటనే మ్యుటేషన్ కూడా జరిగిపోతుంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. పొరపాటున ఏదైనా తప్పు జరిగితే మాత్రం.. దానికి పరిష్కారం చూపే వ్యవస్థ లేదు. ఇదొక్కటనే కాదు.. చాలా సమస్యలకు పరిష్కారం చూపే వ్యవస్థలే లేవు. ఇది వరకు తహశీల్దారు దగ్గర భూసమస్య తేల్చుకునే వారు. అక్కడ కాకపోతే ఆర్డీవో దగ్గర. అక్కడా పరిష్కారం దొరక్కపోతే కలెక్టర్ దగ్గరికి వెళ్లేవారు. కాని, ఆర్వోఆర్-2020 ప్రకారం.. నేరుగా కలెక్టర్ దగ్గరికే వెళ్లాలి. అక్కడ పరిష్కారం దొరకకపోతే మాత్రం కోర్టుకే వెళ్లాల్సి ఉంటుంది.

### పెండింగ్ కేసుల పరిష్కారానికే...

తెలంగాణలో దాదాపు 3 లక్షల కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఒకసారి కోర్టుకు వెళ్లామంటే దాదాపుగా వారాలు, నెలల పాటు కోర్టుల చుట్టూ తిరగాల్సిందే. ఒక్కోసారి ఆర్డర్ కోసం ఏళ్లపాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. దీనికి తోడు కోర్టు ఫీజులు, లాయర్లకు ఫీజులు చెల్లించాలి. సాధారణ రైతుకు ఇదంతా తలకు మించిన భారం. యూజర్ ఫ్రెండ్లీ గవర్నెన్స్ ఉండాల్సిన చోట.. ఇంత జంఝాటం ఉండకూడదు. అందుకే, కొత్తగా ఆర్వోఆర్-2024 చట్టాన్ని తీసుకొచ్చామంటోంది రేవంత్ రెడ్డి సర్కార్.భూముల రిజిస్ట్రేషన్లలో గానీ, మ్యుటేషన్ విషయంలో గానీ ఏదైనా వివాదం వస్తే.. అప్పీల్ చేసుకోవచ్చు. ఆ అప్పీల్‌లో న్యాయం జరగలేదనుకుంటే.. రివిజన్‌కు వెళ్లొచ్చు. సపోజ్.. తహశీల్దారులు, ఆర్డీవోలు తీసుకునే నిర్ణయాలపై అప్పీల్ కోసం కలెక్టర్ లేదా జాయింట్ కలెక్టర్ దగ్గరికి వెళ్లొచ్చు. మరోసారి అప్పీల్ చేసుకోవాలనుకుంటే.. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్-సీసీఎల్ఏ దగ్గరికి వెళ్లొచ్చు. అప్పీల్‌లో గానీ, రివిజన్‌లో గానీ ఎవరు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. ఆ ఆదేశాలను రాతపూర్వకంగా ఇవ్వాలి. ఇవన్నీ ఆర్వోఆర్-2020 చట్టంలో లేవు.కావున, అప్పీల్, రివిజన్‌కు అవకాశం ఇస్తే.. భూసమస్యలన్నీ దాదాపుగా పరిష్కారం అవుతాయంటున్నారు నిపుణులు. అదెలా అంటే.. ఇప్పటి వరకు డేటా ఎంట్రీలో చిన్న తప్పు దొర్లినా సరే.. వాటిని సవరించకుండా నేరుగా కోర్టులోనే తేల్చుకోండంటూ తహశీల్దార్లు, కలెక్టర్లు లిఖితపూర్వకంగా రాసిచ్చేవారు. సో, రైతులకు గానీ, సామాన్యులకు గానీ కోర్టుకు వెళ్లడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.

### ఇప్పటికీ నిజాం కాలంలో చేసిన భూస్వరేనే ఆధారం..

భూసమస్యలన్నింటికీ కారణం.. భూసర్వే చేయకపోవడం. ఆ ఒక్క సర్వే చేస్తే చాలు.. దాదాపుగా 99 శాతం భూసమస్యలన్నీ తీరిపోతాయి. మరి చేయొచ్చుగా..! చెప్పడం సులభమే.. చేయడం ఎంత కష్టమో తెలుసా. భూసర్వేను పర్ఫెక్టుగా చేయాలంటే ఇప్పుడున్న టెక్నాలజీ ప్రకారం.. కనీసంలో కనీసం రెండేళ్లు పడుతుంది. పైగా అధికార యంత్రాంగాన్ని కూడా పెద్ద ఎత్తున ఉపయోగించాల్సిన అవసరం ఏర్పడుతుంది. దాదాపుగా వెయ్యి కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందుకే, భూసర్వే విషయంలో ప్రతి ప్రభుత్వం వెనకడుగు వేస్తోంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో భూభారతి పేరుతో భూసర్వే చేయాలనుకున్నారు. 2018లో చంద్రబాబు ప్రభుత్వం భూసేవ పేరుతో సర్వే చేయించాలనుకున్నారు. కానీ, అవేవీ పట్టాలెక్కలేదు. ఆశ్చర్యం ఏంటంటే.. ఇప్పటికీ నిజాం కాలంలో చేసిన భూస్వరేనే ఆధారం.నిజాం పాలనలో షెత్వార్ పేరుతో 1936లో భూసర్వే చేశారు. ఇప్పటికి 84 ఏళ్లు దాటింది. అప్పటి నుంచి ఏ ఒక్క ప్రభుత్వం కూడా భూ సర్వేను పూర్తిస్థాయిలో జరిపించిందే లేదు. తెలంగాణలో భూముల సమస్యలకు ప్రధాన కారణం.. సరిహద్దు గొడవలే. రికార్డుల్లో ఒక విస్తీర్ణం ఉంటుంది, వాస్తవంలో విస్తీర్ణంలో తేడా ఉంటుంది. ధరణిలో ఎక్కువ శాతం పరిష్కారం కాని సమస్యలన్నీ ఇవే.

#### కొత్త చట్టంతో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం..

**కొత్త చట్టం ఆర్వోఆర్-2024 ప్రకారం.. కేవలం వారం రోజుల లోపే 2 లక్షల 36 వేల పెండింగ్ దరఖాస్తులకు క్లియరెన్స్ వచ్చేస్తుందని ప్రభుత్వ అధికారులు సైతం చెబుతున్నారు. ఆర్వోఆర్-2024 చట్టం వల్ల జరిగే అతిపెద్ద ప్రయోజనం ఇదే.ఇక సాదాబైనామా దరఖాస్తుల క్లియరెన్స్ కోసం 9 లక్షల 36 వేల మంది ఎదురుచూస్తున్నారు. వీళ్లందరికీ.. మళ్లీ దరఖాస్తు చేసుకునే అవసరమే రాకుండా కొత్త చట్టం ప్రకారం పరిష్కారం చూపబోతున్నారు. అంతేకాదు.. సాదాబైనామాల విషయంలో ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోతే.. మళ్లీ అప్లికేషన్లను స్వీకరించే వెసులుబాటు కొత్త చట్టంలో కల్పించారు. పైగా ఈ సాదాబైనామాలపై నిర్ణయాధికారాలన్నీ ఇప్పటి వరకు కలెక్టర్ల దగ్గరే ఉండేవి. కొత్త చట్టం ద్వారా సాదాబైనామాల పరిష్కార అధికారాలు ఆర్డీవోలకు అందబోతున్నాయి. ధరణి వచ్చాక చాలా సమస్యలు పుట్టుకొచ్చాయి. పోర్టల్‌లో నమోదు చేసిన భూమి విస్తీర్ణానికి, అసలు భూ విస్తీర్ణానికి చాలా తేడా కనిపించింది. ఎప్పుడో భూమి అమ్మేసిన వారికి తిరిగీ వాళ్ల భూమి వాళ్లకే వచ్చింది. డబ్బులిచ్చి కొనుక్కుని, రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేసుకున్న వారి భూమి మాయం అయింది. ఇక సర్వే నెంబర్లలోనూ ధరణిలో లోపాలు కనిపించాయి. కొన్ని సర్వే నెంబర్లు అయితే.. ఏకంగా మాయం అయ్యాయి. ప్రభుత్వ భూములు, ప్రైవేట్ ఆస్తుల వివరాల నమోదులో కూడా చాలా తేడాలు కనిపించాయి. వీటన్నింటికీ కొత్త చట్టంతో పరిష్కారం లభించబోతోంది.**

### భూసర్వే చేస్తేనే సమస్యల పరిష్కారం అవుతాయంటున్న నిపుణులు..

భూభారతి పేరుతో కొత్త పోర్టల్ తీసుకొచ్చినా సరే.. సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే కచ్చితంగా భూసర్వే చేయాలన్నది నిపుణుల మాట. ప్రస్తుతం భూరికార్డులన్నీ అస్తవ్యస్థంగా ఉండడం వల్లే.. ప్రతి గ్రామంలో వందల్లో భూసమస్యలున్నాయి. 9 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారు. నిషేదిత జాబితాలోని లక్షలాది ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల సమస్యలు తీర్చలేకపోతున్నారు. సర్వే చేయని కారణంగానే 10 లక్షలకు పైగా కౌలుదారుల గుర్తింపు జరగడం లేదు. వేల మంది ఆదివాసీలు, గిరిజనులకు పోడుభూముల పట్టాలు దక్కడం లేదు. ప్రస్తుత భూ సమస్యలకు అసలైన పరిష్కారం భూసర్వేనే అనేది ఓ వాదన.

### నిబంధనలు లేకనే ధరణి ఫెయిల్..

ధరణి విషయంలో జరిగిన అతిపెద్ద తప్పిదం.. నిబంధనలను తయారు చేయకపోవడం. సమగ్రమైన చట్టం తీసుకొచ్చామని చెప్పిన గత ప్రభుత్వం.. ఇప్పటి వరకు రూల్స్ ఫ్రేమ్ చేయలేదు. దాని కారణంగానే ఎన్నో తప్పులు జరిగాయి. ప్రస్తుతం భూభారతి చట్టానికి కూడా ఇంకా రూల్స్ ఫ్రేమ్ చేయలేదు. కాకపోతే.. మూడే మూడు నెలల్లో రూల్స్ తయారుచేస్తామని చెబుతున్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.ఇప్పటికే ధరణి విషయంలో జరిగిన తప్పులను భూభారతిలో సరిదిద్దే ప్రయత్నం జరిగిందంటోంది రేవంత్ ప్రభుత్వం. ధరణి అర్ధంకాక, అందులోని సాంకేతిక సవాళ్ల కారణంగా మధ్యవర్తులపై ఆధారపడాల్సి వచ్చింది. ఫలితంగా సామాన్యులకు ఖర్చులు పెరిగాయి, రైతులను దోపిడీ చేశారు. ధరణి అనేది డిజిటల్ ప్లాట్‌ఫామ్ అయినా సరే.. రిజిస్ట్రేషన్, టైటిల్ డీడ్స్, యాజమాన్య బదిలీల విషయంలో అధికారులకు అడ్డంకులు వచ్చేవి. ముఖ్యంగా ధరణిలో 33 ఆప్షన్స్ ఉండేవి. కాని, ఎన్ని ఆప్షన్స్ ఉన్నా చాలా సమస్యలకు పరిష్కారం మాత్రం దొరకలేదు.

### 33 ఆప్షన్లకు బదులు ఆరు ఆప్షన్లు..

భూభారతి చట్టంలో 33 ఆప్షన్స్ బదులు ఆరు ఆప్షన్స్ మాత్రమే తీసుకొచ్చారు. ఇక మాన్యువల్‌గా పహాణీలో 32 కాలమ్స్ ఉండేవి. ధరణిలో ఆ 32 కాలమ్‌స్‌ను ఒకే కాలమ్‌గా చేశారు. ఇప్పుడు దాన్నే 11 కాలమ్‌స్‌గా చేస్తున్నారు. ధరణి వచ్చాక ప్రైవసీ పేరుతో కొన్ని వివరాలను బయటపెట్టే అవకాశం లేకుండా చేసింది. కాని, భూభారతిలో ఆ అవకాశమే లేదు. ఎవరైనా, ఎక్కడి నుంచైనా భూముల వివరాలు చూసుకోవచ్చు.

### చట్టబద్ధమైన మార్గాల్లో యాజమాన్య హక్కులు వస్తే పాస్ పుస్తకాలు పొందే అవకాశం..

భూమి విక్రయం, బహుమతి, తనఖా, మార్పిడి, వారసత్వం, సివిల్ లేదా రెవెన్యూ కోర్ట్ ఆర్డర్, లోక్ అదాలత్ అవార్డు, అసైన్‌మెంట్ పట్టా, ఓఆర్సీ, 38ఈ, 13బీ, సేల్ సర్టిఫికేట్‌తో పాటు ఇతర చట్టద్దమైన పద్ధతుల ద్వారా హక్కులను పొందిన యజమానుల హక్కులను కొత్త చట్టంలో నమోదు చేస్తారు. ఆర్వోఆర్-2020 చట్టంలో వీటికి అవకాశం లేకపోవడంతో ఈ మార్పు తీసుకొచ్చారు. ఉదాహరణకు 13బీ, 38ఈ, ఓఆర్‌సీ, లావుని పట్టా వంటి మార్గాల్లో భూమి వచ్చినప్పుడు.. పాస్ పుస్తకాలు పొందే అవకాశం పాత చట్టంలో లేదు. ఇప్పుడు వీరందరికీ పాస్ పుస్తకాలు ఇచ్చే అవకాశం కొత్త చట్టం కల్పిస్తోంది. వీటిని ఆర్డీవో లేదా సబ్-కలెక్టర్ విచారించి మ్యుటేషన్ చేస్తారు.

### మ్యుటేషన్ చేసేముందు విచారణ..

ఇక భూమి అమ్మకం, బహుమతి, తనఖా, మార్పిడి సమయంలో తహశీల్దార్ ఆటో మ్యుటేషన్ చేస్తారు. వీటిలో మోసం జరిగినప్పుడు మ్యుటేషన్‌ను నిలిపివేసే అధికారాలు తహశీల్దార్‌కు ఉంటాయి. వారసత్వం విషయంలో విచారణ జరిపి నిర్దేశించిన సమయంలో మాత్రమే తహశీల్దార్ మ్యుటేషన్ చేస్తారు. ఎందుకంటే.. ధరణిలో ఎలాంటి విచారణ లేకుండానే మ్యుటేషన్ చేసేవారు. దీనికారణంగా కుటుంబాలలో భూవివాదాలు వచ్చాయి. అందుకే, ఈ మార్పు చేశారు. ఇక రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు మినహా ఇతర కేసుల్లో మ్యుటేషన్ చేసే ముందు తప్పనిసరిగా విచారణ జరుగుతుంది.

### గ్రామకంఠాలను ముున్ముందు ఆర్వోఆర్ లో..

ఆబాది భూములు.. అంటే గ్రామకంఠాలను ముున్ముందు ఆర్వోఆర్ లో నమోదు చేస్తారు.ఈ ఆబాదీ, వ్యవసాయేతర భూములను స్థానిక సంస్థలు మ్యుటేషన్ చేస్తాయి. భవిష్యత్తులో పట్టాదారు పాస్ పుస్తకం, టైటిల్ డీడ్‌కు అదనంగా భూధార్ కార్డ్ కూడా జారీ చేస్తారు. 2014 జూన్ 2వ తేదీ లోపు.. అంటే తెలంగాణ ఏర్పాటు ముందు వరకు పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను రెగ్యులరైజ్ చేసేందుకు కొత్త చట్టంలో అవకాశం ఏర్పడింది. ఇకపై భూరికార్డుల సవరణ కోసం సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు. యాజమాన్య వివాదాలు, పంపకాల కేసుల విషయంలో మాత్రమే సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడుతుంది. RoR ఆధారంగా పహాణీలో నమోదు చేయాల్సి ఉంటుంది. అంటే.. ఆర్వోఆర్-2020 చట్టంలో ఉన్నట్టుగా గ్రామ రికార్డులను ఆర్వోఆర్ కు లింక్ చేసే అవకాశం లేదు.

మొత్తానికి, ఈ కొత్త చట్టం తీసుకురావడానికి పెద్ద కసరత్తే జరిపింది ప్రభుత్వం. మేధావులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకుంది. బీఆర్ఎస్ నుంచి మాజీమంత్రి హరీష్‌రావు, మాజీ ఎంపీ వినోద్ అభిప్రాయాలను కూడా తీసుకుని కొత్త చట్టం రూపొందించారు. ఈ కొత్త చట్టం సక్సెస్ అవుతుందా లేదా అనేది మరో మూడు నెలల తరువాత.. చట్టం అమల్లోకి వచ్చాక రైతులు ఇచ్చే అభిప్రాయం ఆధారంగానే ఉంటుంది. కావున, వేచిచూడాలి మరి.

- పోతుగంటి వెంకటరమణగుప్త
బ్యూరో చీఫ్ (వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రిక)

#### బేషజాలకు పోయి తాము ధరణిని మార్చడం లేదుః పొంగులేటి



భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన రెవెన్యూ చట్టం తీసుకువస్తోంది. భూ దస్త్రాలు, యాజమాన్య హక్కుల చట్టం-2024 పేరుతో నే అసెంబ్లీలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బిల్లును ప్రవేశపెట్టారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆర్వోఆర్-2020ను రద్దు చేసి దాని స్థానంలో భూభారతి పేరుతో తీసుకొచ్చిన బిల్లును మంత్రి సభ ముందు ఉంచారు. భూమి పేదరికాన్ని దూరం చేసి ఆత్మగౌరవంతో జీవించేలా చేస్తుందని.. గ్రామాల్లో భూమి ప్రధాన జీవన ఆధారమని పొంగులేటి అన్నారు. కష్టజీవులను కంటికి రెప్పలా చూసుకునే బాధ్యత ప్రభుత్వాలదని చెప్పారు.1971లో తెచ్చిన ఆర్‌వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు మనుగడలో ఉందన్నారు. గతంలో తెచ్చిన ధరణి పోర్టల్‌తో కొత్త సమస్యలు తలెత్తాయన్నారు. ధరణితో అనేక మంది ఇబ్బందులు పడ్డ మాట వాస్తవమని సభలో వెల్లడించారు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చామని.. ఇప్పుడు ఆపని చేస్తున్నట్లు చెప్పారు. ధరణి స్థానంలో భూభారతిని తీసుకువస్తున్నామని తెలిపారు. 18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలు పరిశీలించి భూభారతి తెచ్చామన్నారు. గతంలో అర్ధరాత్రి ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చారని విమర్శించారు. ధరణి పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేషన్లు జరగలేదన్నారు. బేషజాలకు పోయి తాము ధరణిని మార్చడం లేదని.. ప్రజా సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్ రద్దు చేస్తున్నట్లు పొంగులేటి వెల్లడించారు. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టామన్నారు. మనుషులకు ఆధార్ ఎలాగో.. భూములకు భూదార్ అలా ఉంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయంలో ధరణి పేరతో పేదల భూములు దోచుకున్నారని పొంగులేటి ఆరోపించారు. కొత్త చట్టం అమల్లోకి వచ్చాక ఆ భూములను వెనక్కి తీసుకుంటామన్నారు. వాటిని భూములు లేని నిరు పేదలకు ఇస్తామని స్పష్టం చేశారు. భూమి రిజిస్ట్రేషన్ వేళ మ్యుటేషన్ అవకాశాన్ని గతంలో కల్పించారని.. వారసత్వ భూములు కుటుంబానికి వర్తింపు చట్టంలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. వారసత్వ ఆస్తులపై అప్పీల్ అథారిటీకి వెళ్లే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. పరిశీలించి మ్యుటేషన్ చేసే అధికారం ఆర్డీవోకు కొత్త చట్టం కల్పిస్తుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

#### భూభారతిలో ప్రధానమైనది.. భూధార్ నెంబర్

ఇక భూభారతిలో ప్రధానమైనది.. భూధార్. ప్రతి ఒక్కరికీ ఆధార్ ఎలా ఉందో.. అలా భూధార్ నెంబర్ కూడా ఇవ్వబోతున్నారు. ప్రతి ఒక్క కమతానికి ఒక భూధార్ నెంబర్‌ను కేటాయిస్తారు. ఆ నెంబర్‌తో వ్యక్తుల భూములు, వాటి విస్తీర్ణం, క్రయవిక్రయాలన్నీ రికార్డుల్లోకి వస్తాయంటున్నారు.భూభారతి,ఆర్వోఆర్-2024 చట్టంతో కలిగే ప్రయోజనాలేంటి అని అడిగితే.. భూమి ఉన్న ప్రతి రైతుకు కొత్త చట్టంతో పాస్ పుస్తకాలు వస్తాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత వెంటనే మ్యుటేషన్ అవడంతో పాటు పాస్ పుస్తకం జారీ చేస్తారు. సరిహద్దు వివాదాలు, డబుల్ రిజిస్ట్రేషన్లకు అవకాశం లేకుండా పాస్ పుస్తకంలో మ్యాప్ కూడా ఉంటుంది. అంటే.. మ్యుటేషన్‌కు మ్యాప్‌ని తప్పనిసరి చేశారు. భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలోనే రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుంది. ప్రత్యేకంగా ట్రిబునల్స్ కూడా ఏర్పాటు చేస్తారు. పేద రైతులకు ఉచితంగా న్యాయ సహాయం అందించబోతున్నారు. కొత్త రెవెన్యూ చట్టంతో గ్రామానికో రెవెన్యూ అధికారితో రెవెన్యూ సేవలన్నీ అందుబాటులోకి రానున్నాయి. ఇకపై డిజిటల్ ల్యాండ్ రికార్డులను సరిదిద్దడానికి ఇందులో అవకాశం ఉంది. ఇదొక్కటి లేకనే లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో పార్ట్-బీ కింద 18 లక్షల ఎకరాలను చేర్చారు. దీనివల్ల వేల మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేసులపై నిర్ణయం తీసుకునేందుకు కొత్త చట్టంలో వీలు కల్పించారు. భవిష్యత్తులో భూముల రీ-సర్వే జరిగితే.. కొత్త ఆర్వోఆర్ సిద్ధం చేయడానికి వీలుగా నిబంధన చేర్చారు.

# కులాల లెక్క తేల్చాల్సిందే



**ఈమధ్య ఎక్కడ బీసీ సదస్సు జరిగినా బి.పీ.మండల్ ను తలచు కోవడం , రాష్ట్రం లో నింపిన 43 వేల ఉద్యోగాల్లో బీసీ ల కంటే తక్కువ మార్కులు వచ్చిన ఎంతోమంది ఈ డబ్ల్యూఎస్ అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు.ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన జరపాలని జనాభా దామాషా ప్రకారం మేమెంతో మాకంత వాటా అని ప్రభుత్వాలకు కొన్ని ప్రశ్నలు సంధించారు. అగ్రవర్ణ జనాభా తేల్చకుండా 10% రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారు? చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయరు? మండల్ సిఫారసులను అమలు చేస్తూ ప్రైవేట్ రంగాల్లో ఓ బి సి రిజర్వేషన్లు తప్పకుండా ఎందుకు కల్పించరు?జనాభా ప్రాతిపదికన ఓబీసీ కుల గణన ఎందుకు జరిపించరు?బీ సీ వేదికలు అన్నీ వేసిన ప్రశ్నలు చూస్తే మరొకసారి ఓబిసి కుల గణన నినాదం వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ప్రధాన డిమాండ్ గా మారే అవకాశంఉన్నది**

ప్రాంతీయ, జాతీయ పార్టీలు అన్నీ కూడా 56% ఉన్న బీ సీ లకు ఎన్ని ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయిస్తున్నారు అనేది ప్రధాన చర్చనీయాంశం గా మారుతుంది. ఈ సందర్భంగా "ఓబిసి కులం లెక్క తేల్చాల్సిందే" అని ప్రశ్నించే వారి సంఖ్య ఎక్కువయింది. బ్రిటీష్ పాలన లో కూడా జరిగిన ఈ ఓ బీ సీ కులగణన ఎందుకు ఆగిపోయింది. కులగణన చేయాల్సిన అవసరం ఏమిటి? ఒకసారి చర్చించే ప్రయత్నం చేద్దాం. కులం ప్రస్తావన లేకుండా భారతదేశ సమాజాన్ని గురించి మాట్లాడడం, విశ్లేషించడం, వివరించడం, ఒక వ్యక్తీకరణ చేయడం అనేది అవివేకం, అసంబద్ధం కూడా. కులం పునాదుల మీద ఏర్పడ్డ సమాజాన్ని అర్థం చేసుకోకుండా, నిచ్చెన మెట్ల కులాల గురించి ఆలోచన చేయకుండా, కుల నిర్మూలన సాధ్యం కాదు అని చెప్పిన బాబాసాహెబ్ అంబేద్కర్ మాటలను గుర్తు చేసుకోవడం ఈ వ్యాస సందర్భం.

కులాన్ని ఈ ప్రపంచంలో దేనితో పోల్చి చెప్పలేము ఆఫ్రికన్ బానిసల తో కానీ అమెరికాలోని బ్లాక్స్ తో గాని , తెలంగాణా లోని వెట్టిచాకిరి తో కానీ, ప్రపంచంలో అణచి వేయబడుతున్న ప్రతి జాతి దేనికదే దాని మూలాలను వెతుక్కోవాల్సిందే. అలాగే మనం కుల వ్యవస్థను సమాజంలో భాగంగానే చూడాల్సి ఉంటుంది. కులం జాతి లాంటిది కాదు, వర్గం లాంటిది కాదు , కులం కులమే. దానితో పోల్చదగ్గది ఏది ఈ ప్రపంచంలో లేదని అంబేద్కర్ భావన.

భారతీయ తొలి తరం మార్క్సిస్ట్ అయిన ఎం ఎన్ రాయ్ ప్రకారం "కుల సమస్య పరిష్కరించడానికి బుద్ధుడు చాలడు, పూలే చాలడు, అంబేద్కర్ కూడా చాలడు, మార్క్స్ కావాలి" అని అంటాడు. కులం, వర్గంలో అంతర్భాగమైన ఒక విభాగం. వర్గ పోరాటం ఫలించినప్పుడు కులం సమస్య పరిష్కరించబడుతుంది, అంతేగాని ప్రత్యేకంగా కుల నిర్మూలన పోరాటాలు, కుల సంఘాలు అవసరం లేదని చెప్పాడు. మన దేశంలో మార్క్సిస్టులుఇప్పటికీ ఇదే విషయం చెబుతున్నారు. కానీ కులం వల్ల తనకు జరిగిన అవమానాలు, సామాజిక వివక్ష, అంటరానితనం, మనసుకు అయిన గాయాలు అనుభవించినవాళ్లు చెప్పిందే నిజమని నమ్మక తప్పదు.

ఏది ఏమైనప్పటికీ ఈ.డబ్ల్యు. ఎస్ అమలవుతున్న తర్వాత ప్రతి ఒక్క ఓ బి సి విద్యార్థి బి. పి. మండల్ ను గుర్తు చేసుకుంటున్నారు. కారణం ఓబీసీ కుల గణన. మండల్ ఉద్యమం తర్వాత దేశంలో ఇప్పటి వరకు అంత పెద్ద ఎత్తున రిజర్వేషన్ల గురించి మరే పోరాటం జరగలేదు. కానీ 2011 జనగణన జరుగుతున్న సందర్భంలో కులగణన చేయాలని అన్ని రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున మేధావులు గొంతు విప్పడం జరిగింది అయినప్పటికీ సెన్సెస్ జరిగి పోయింది, లెక్కలు తేలాయి, జనాభా ఎంతో తెలిసింది కానీ కులం ప్రాతిపదికన ఎవరు ఎంత మంది ఉన్నారు అనే అంశం తేలలేదు.

2021 లో జరగాల్సిన జనాభా లెక్కలు కరోనా కారణంగా నో మరే ఇతర కారణాల వల్ల నో ఆగిపోయాయి, అన్న విషయం మనకు తెలిసిందే. ఇప్పుడు ఎన్నికల సంవత్సరం కాబట్టి ఓబిసి కులగణన మళ్ళీ తెరమీదకి వచ్చింది ఇది కేంద్ర ప్రభుత్వానికి సవాలు గా మారింది. ఓబీసీలందరూ కులగణన చేయాల్సిందే అని దేశవ్యాప్తంగా పట్టుబడుతున్నారు. .

**కుల గణన పూర్వ పరాలు...**

గియాజుద్దీన్ తుగ్లక్ కొడుకు అయినటువంటి జునా ఖాన్ (మహమ్మద్ బీన్ తుగ్లక్) 1325 నుంచి 1351 వరకు ఢిల్లీని పరిపాలించిన కాలంలో పరిపాలనా సౌలభ్యం కొరకు ఢిల్లీ పట్టణంలో మొట్టమొదటిసారిగా జనాభా లెక్కలు (సెన్సెస్ )చేపట్టిన సుల్తాన్ గాచరిత్ర మనకు మహ్మద్ బిన్ తుగ్లక్ పేరు చెప్తుంతుంది. ఈ జనాభా లెక్కల ఆధారంగా ఆహార పదార్థాలు, నిత్యవసర సరుకులు, జీవన విధానం, ప్రజా అవసరాలు, సంక్షేమం, రెవెన్యూ అన్నింటిని అంచనా వేసి పరిపాలన కొనసాగించాడుతుగ్లక్. మహా మేధావి, గొప్ప లెక్సికో గ్రాఫర్ (డిక్షనరీరైటర్) గా జునాఖాన్ ను చెప్పవచ్చు. తర్వాతి కాలంలో చెప్పుకోవాల్సిన వారు 1902-08 మధ్య కాలంలో కొల్లాపూర్ ,(మహారాష్ట్ర) సంస్థానాధీశుడు ఛత్రపతి సాహు మహారాజ్ రిజర్వేషన్లు తన ఆస్థానంలో విద్య ,ఉద్యోగ రంగాల్లో శూద్రులకు ,అతిశూద్రులకు, రిజర్వేషన్ కల్పించిన మొదటి వ్యక్తిసాహు మహారాజ్. 1902 లో రిజర్వేషన్ విధానాన్ని అమలుచేసి బ్రాహ్మణుల నుంచి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నాడు. అయినా ధైర్యంతో దళితులు ఓబీసీల వైపు నిలబడ్డాడు. ఆయన ఈ రిజర్వేషన్ విధానాన్ని ముందుకు తీసుకు రావడానికి ముందు తన రాజ్యంలో అమలు చేసి చూపించాడు . పాఠశాలల్లో , గుడులలో, న్యాయస్థానాలలో, పోలీస్ స్టేషన్ లలో, కోర్టు గుమస్తాలలో , అందరూ బ్రాహ్మణులే అయినప్పుడు కింది కులాలకు ఏమాత్రం న్యాయం జరగదని , కాబట్టి వీళ్ళు ఆ స్థానాలను చేరుకోవాలంటే రిజర్వేషన్ ఒకటే మార్గం అని బ్రిటిష్ ప్రభుత్వానికి సిఫారసు చేశాడు.

**బ్రిటిష్ పాలనలో కుల, జనాభా గణన:** బ్రిటిష్ వాళ్ళు భారతదేశాన్ని సుమారుగా 200 సంవత్సరాలు పరిపాలించారు. వీరు మన దేశ సంపదను దోచుకోవడం, వ్యాపారాలు చేయడం , రెవెన్యూ మొదలగు వాటిపై ఎక్కువ దృష్టి పెట్టారు. కానీ 1857 తిరుగుబాటు తర్వాత అసలు భారతదేశంలో ఏం జరుగుతుంది అనే విషయంవారికి అర్థం అయింది. యుద్ధంలో పాల్గొన్నది ఎక్కువమంది శూద్రులు(బీసీ), అతిశూద్రులు. (ఎస్ సి) . ఇక్కడ భూమితో పాటు కులం , మతం అనేవి మాత్రమే ఇందులో పనిచేస్తున్నవి అని బ్రిటిష్ అధ్యయన శాస్త్రజ్ఞులు పరిశోధన చేశారు. వీరు అందరూ అవిద్య, అభివృద్ధి లేమితో ఉన్నారని గమనించారు. అదే జనాభా గణన , కులగణన ల కు దారితీసింది.

1857 తర్వాత జిల్లా మాన్యువల్ తయారుచేసి



తమ అధీనంలో ఉన్న ప్రాంతాల్లో (బ్రిటిష్ ఇండియా) ప్రత్యేక శ్రద్ధతో దేశ జనాభా లెక్కలు ఆడ, మగ, పిల్లలు, వృద్ధులు ,కులం, మతం అన్ని లెక్కలు వేశారు. ఈ సెన్సెస్ చేయడంలో సభ్యులు విలియం హంటర్ హెర్బర్ట్ రెస్లే ఎడ్గార్ థర్ స్టన్ ఇండియా లో మొదటి సారి కులగణన చేపట్టిన బ్రిటిష్ అధికారులు. 1871-72 నుండి వరుసగా ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి 60 సంవత్సరాలు అనగా 1931 వరకు ఈ కుల జనాభా గణన చేపట్టారు. 1891, 1901, 1911 జనాభా లెక్కల లో కులగణనలో చాలా మంది తమ కులాలను మార్చుకున్నారని క్షత్రియ వర్గంలోకి మార్చమని అర్జీ పెట్టుకొన్నారని రిస్లే చెప్పాడు. ఆ తర్వాత వచ్చిన కమ్యునల్ జి. ఓ. అమలు కాకపోవడం ఫలితం గా 1941 నుంచి కులాన్ని జనాభా గణన లో చేర్చకుండా ఆపివేశారు. కమ్యునల్ జీ. ఓ అమలుచేయవొద్దని గాంధీజీ బలంగా వాదించారు.

**బ్రిటిష్ వారి కులగణనలో తేలిన అంశాలు..**

- నిరక్షరాస్యత
- స్వేచ్ఛ లేకపోవడం
- వెట్టి చాకిరి
- కులం పుట్టుక, హోదా
- పవిత్రత , అపవిత్రత
- అంటరానితనం
- సమాజ విభజన
- కులవృత్తులు
- రాజకీయంగా విద్యాపరంగా సామాజికంగా వెనుకబాటు
- కుల బహిష్కరణలు
- కుల వృత్తి చేయాలనడం
- జెండర్ వివక్షత మొదలైనవి..

కమ్యునల్ (జి.ఓ.)అవార్డు అంటే : బ్రాహ్మణేతరులు కూడా దేశ సంబంధమైన న్యాయ, రక్షణ, విద్య ,పబ్లిక్ సర్వీస్, పొలిటికల్ అన్ని రంగాల్లో బీసీలు, ఎస్సీలు మైనారిటీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్, కులాల ఆధారంగా ఉండాలని ముఖ్యంగా ఎస్సి, బీ సీ లకు ప్రత్యేక నియోజక వర్గాలు ఉండాలని ప్రతిపాదించినదే కమ్యూనల్ అవార్డు 1921 సెప్టెంబర్ 16 న అప్పటి బ్రిటన్ ప్రధాని మెక్ డొనాల్డ్ ప్రభుత్వం తీసుకొచ్చింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దీనిని పూర్తిగా స్వాగతించాడు...... కానీ గాంధీజీ మాత్రం భారతదేశాన్ని కులాల పేరుతో విడదీస్తున్నారని జాతీయ వాదాన్ని, సమైక్యతను దెబ్బతీస్తున్నారని ఇది భారతదేశానికి చాలా ప్రమాదకరమని నిరసిస్తూ, ఎరవాడ జైలులో 1932 సెప్టెంబర్ 20 న ఆమరణ నిరాహార దీక్షకు దిగాడు. బిసి, ఎస్సిలకు ప్రత్యేక నియోజకవర్గాల రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ నిరసన కు దిగాడు .తన ప్రాణాలు పోయే అవకాశం ఉందని దేశవ్యాప్త ఆందోళనలు జరుగుతాయని అప్పటి బ్రిటిష్ ప్రధాని రాంసే మెక్ డోనాల్డ్ కు కమ్యునల్ జీ ఓ అమలు చేయొద్దని చెప్పాడు , మహాత్మా గాంధీ. సెప్టెంబర్ 24, 1932 న మహాత్మా గాంధీ ఆరోగ్యం క్షీణిస్తుందని అతడు చనిపోయే అవకాశం ఉందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మానవతా దృక్పథంతో పూనా ఒప్పందంపై సంతకం చేశారు. ఇందులో ఓబీసీ రిజర్వేషన్ల లో రాజకీయ పరంగా బీసీ నియోజకవర్గాలు ఉండవని , ఎస్సీ నియోజక వర్గాల రిజర్వేషన్లు (నామమాత్రం)ఉంటాయని సవరించడం జరిగింది. అప్పుడు గాంధీజీ నిరాహార దీక్ష ను విరమించుకున్నాడు. నాటినుండి ఓబీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ రిజర్వేషన్ స్థానాలు నేటికీ లేవు. దాని కోసమే మళ్ళీ ఈ కులగ గణన. అందుకే ప్రత్యేక నియోజక వర్గం,రిజర్వేషన్లు ఎన్నికల ఎజెండాగా ఓబీసీల ఆత్మగౌరవ సమస్యగా మారింది.

బ్రిటిష్ వాళ్ళు జరిపిన కులగణన తో విద్య ఉద్యోగ రంగాల్లో కులం ప్రస్తావన మొదలైంది. విద్య ఉద్యోగ రంగాల లో అధిక భాగం బ్రాహ్మణులు ఉన్నారని బయటపడింది.కాకా కాలేల్కర్ కమిషన్ స్వాతంత్ర్యానంతరం కులగణన జరపాలని చేసిన ఉద్యమానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 1953లో మొట్టమొదటి వెనుకబడిన తరగతుల కమిషన్ కాకా కాలేల్కకర్ కమిషన్ ను నియమించింది. ఈ కమిషన్ సర్వేలు నిర్వహించి ప్రజల స్థితి గతులను పరిగణన లోకి తీసుకొని కొన్ని సూచనలు చేసింది.

**కాకా కాలేల్కర్ కమిషన్ ఇచ్చిన సూచనలు..**

- 2399 వెనుకబడిన తరగతుల (కులాల) గుర్తింపు.
- వీటిలో 837 అత్యంత వెనుకబడిన తరగతులుగా విశ్లేషించడం.,
- ప్రతి కులంలో ఉన్న స్త్రీలు వెనుకబడిన వర్గంగా గుర్తించడం....
- 1961 లో కులాల వారీగా జనాభా లెక్కల్లో నమోదు చేయడం...
- ఓబీసీలకు 25 శాతం నుండి 40% వరకు వారి స్థితిగతులను బట్టి రిజర్వేషన్ ఇవ్వడం..
- జనగణన పత్రాలలో ప్రత్యేకంగా కులం నమోదు చేసే విధంగా ఉండాలి.
- ఓబీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి...
- జనగణన కార్యాలయాలు ఆర్థిక శాస్త్రవేత్తలతోనే కాకుండా సామాజిక ఎత్నాలజిస్టుల తో ఉండాలి.

ఇవి కొన్ని ముఖ్యమైనవి... అటు తర్వాత వచ్చిందే బి మండల్ కమీషన్. 1990 లో మండల్ కమిషన్ నివేదిక అమలు కావడంతో ఓ బి సి లలో చైతన్యం పెరిగింది . అన్ని రకాల ప్రైవేట్ సంస్థలు మాత్రం మండల్ సూచించిన 25% రిజర్వేషన్ అమలు చేయలేదు. 1991 నుండి నేటి వరకు ఓబీసీ కులగణన చేయాలని పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి.

**బీహార్ లో మొదలైన ఓబీసీ కులగణన..**

బీహార్ ఒక అడుగు ముందుకు వేసి రెండు విడతల కులగణన లో భాగంగా మొదటి విడతను విజయవంతం గా పూర్తి చేసింది. ఇందులో కులాలు, వృత్తులు, ఉపకులాలు ,ఆర్థిక పరిస్థతులపై సర్వే జరిపింది. రెండో విడత కూడా పూర్తిచేసి నివేదిక వెల్లడించాలని నితీశ్ కుమార్, తేజస్వి యాదవ్ నేతృత్వం లోని ప్రభుత్వం నిర్ణయించింది . కానీ కులగలను కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందని దానికి రాష్ట్రం తో సంబంధం లేదని హైకోర్టు లో వేసిన పిటిషన్ ల కారణంగా పాట్నా హైకోర్ట్ ఈ ప్రక్రియ కేంద్రం పరిధి లో అంశము అని, దీనిని తక్షణమే నిలిపి వేయాలని, ఇప్పటి వరకూ జరిపిన సర్వే వివరాలు ఏవీ వెల్లడించ కూడదు అని స్టే విధించింది. కోర్టు తీర్పు ను గౌరవిస్తూ బీహార్ ప్రభుత్వం దాన్ని నిలిపివేసింది . తదుపరి మళ్లీ కొనసాగించి వివరాలు వెల్లడించింది.అయినప్పటికీ అన్ని పార్టీలు చిత్తశుద్ధితో కుల గణన చేయాల్సిందే అని ఓబీసీలు పట్టబడుతున్నారు.

**తెలంగాణ ప్రభుత్వ సమగ్ర కుటుంబ సర్వే...**

తెరాస ప్రస్తుత బీ ఆర్ ఎస్ తెలంగాణలో మొదటి సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు 2014 ఆగష్టు నెలలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి మొత్తం దేశ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలందరి నీ సొంత గ్రామాలకు రప్పించి మొత్తం ఒకే రోజున పూర్తి అయ్యేలా సర్వే చేయించి వివరాలు దగ్గర పెట్టుకుంది. అందులో

**కుటుంబ సభ్యుల వివరాలు**

- భూమి
- వాహనాలు
- పశువులు(ఆవులు, బర్లు)
- మేకలు, గొర్రెలు
- కోళ్లు
- ఉద్యోగాలు
- పూర్తి చిరునామా ఇంటికి, మనుషులకు సంబంధించిన మొత్తం వివరాలు తెలంగాణా ఉద్యోగుల సహాయం తో సేకరించారు. ఇప్పుడు ఇస్తున్న, గొర్లు, బర్లు, వలలు, దళిత బంధు, ఆసరా పెన్షన్లు, శాదిముభారక్ లు అన్ని సంక్షేమ పథకాలు... ఈ సర్వే ఆధారంగానే ఇస్తున్నారనే వాదనలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

**కులగణన వొద్దు అనే వారి వాదన...**

కులాల పేరుతో జాతీయ సమైక్యతను దెబ్బతీయడం మంచిది కాదు. భారతీయ సంస్కృతిలో భాగమైన కులాలను రాజకీయంగా వాడుకోవద్దు. సమాజం లో కులతత్వం పెరిగి అశాంతి నెలకొంటుంది. అందుకే కులగణన ను వ్యతిరేకిస్తున్నాం అనే జాతీయ స్థాయి నాయకులు, కాంగ్రెస్, బిజేపి ల లో కూడా ఉన్నారు.. అంతర్గతం గా అగ్రకులాలు తమ అధికారాన్ని కోల్పోయే అవకాశం ఉంది అందుకే వాళ్ళు ఒప్పుకోరు అనేది ఓబీసీ ల వాదన.

చివరగా భారత దేశంలో జనాభా ప్రాతిపదికన మేము ఎంతమంది ఉన్నామో మాకు అంత వాటా అని రాజ్యాంగపరంగా మాకు రావాల్సిన అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను రిజర్వేషన్లుగా బీసీల జనాభా శాతాన్ని బట్టి నిర్ణయించాలి. అంటే కుల గణన జరగాలి. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ తరుణంలోనే ఓబీసీ లు కుల గణన కు డిమాండ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



-డాక్టర్ మెంతబోయిన సైదులు
-9010910956

# భాగ్యనగరంలో పుస్తకాల పండుగ

- నేటి నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్
- 330కు పైగా స్టాళ్లు.. 10 రోజులు సందడి
- ప్రతి రోజూ సాయంత్రం సాహితీ చర్చలు
- ప్రాంగణానికి దాశరథి పేరు

పుస్తక ప్రియులు ప్రతి సంవత్సరం ఎంతోగానో ఎదురుచూసే హైదరాబాద్ బుక్ ఫెయిర్ గురువారం ప్రారంభం కానుంది. ఎన్టీఆర్ స్టేడియంలో నేటి నుంచి 29వ తేదీ వరకు 37వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన జరనుంది.నూతన సంవత్సరానికి ముందే నగరాన్ని అలరించే పుస్తకాల పండుగ గురువారం నగరం ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభం కానుంది. పదిరోజుల పాటు ఈ ఉత్సవం జరిగే ప్రాంగణానికి హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కమిటీ ఈ ఏడాది మహాకవి దాశరథి కృష్ణమాచార్య పేరును ప్రకటించింది. జ్యోతిరావుపులే జీవిత చరిత్రను తెలుగులోకి తొలిసారిగా అనువదించిన రచయిత్రి, ప్రసిద్ధ విమర్శకురాలు బోయి విజయభారతి పేరును బుక్‌ఫెయిర్ ప్రధాన వేదికకు పెడుతున్నారు. ఈ ఏడాది పుస్తకావిష్కరణలకు ప్రత్యేక వేదికను ఏర్పాటుచేశారు. దానికి తోపుడుబండి సాదిక్అలీ పేరు, మీడియా పాయింట్‌కు ఉప్పల నరసింహం, రచయిత్రుల స్టాళ్లకు గుస్సాడి కళాకారుడు కనకరాజు పేర్లు పెడుతున్నట్లు ప్రకటించారు. ఈ పుస్తక మహోత్సవంలో 200కుపైగా నిర్వాహకులు, 330కుపైగా స్టాళ్లను ఏర్పాటు చేవారు. అందులో హార్పర్ కాలిన్స్ ఇండియా, సేజ్, పెంగ్విన్ తదితర ఆంగ్ల ప్రచురణలు, మున్షీరాం మనోహర్‌లాల్, కేంద్ర సాంస్కృతిక అకాడమీ, సీపీ బ్రౌన్ అకాడమీలాంటి జాతీయ ప్రచురణ సంస్థలుండడం విశేషం. హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, వీక్షణం, ఎమెస్కో, నవయుగ, నవ తెలంగాణ, నవచేతన, తెలంగాణ పబ్లికేషన్స్, బాలగోపాల్ రచనలు, విశ్వనాథ సాహిత్య పీఠం, స్కైబాబ ముస్లిం మైనార్టీ ప్రచురణలు, భూమి బుక్ ట్రస్ట్, మంచిపుస్తకం, అన్వీక్షికి, ఛాయా.. ఇలా తెలుగులో ప్రత్యేకమైన ప్రచురణ సంస్థల స్టాళ్లన్నీ అందుబాటులో ఉండనున్నాయి. పుస్తకాలపై పది శాతం రాయితీ ఇవ్వనున్నాయి. బుక్ ఫెయిర్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న 210కి పైగా ప్రచురణకర్తలు, పంపిణీదారులు తమ పుస్తకాలను ప్రదర్శించనున్నారు. తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్, తమిళం, సంస్కృతం, ఉర్దూ, మరాఠీ, కన్నడ భాషాకు సంబంధించిన పుస్తకాలు ఈ బుక్ ఫెయిర్‌లో లభ్యమవుతాయని వివరించారు. పుస్తక ప్రదర్శనలో స్టాల్ ఏర్పాటు చేయాలనుకునేవారు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని బుక్ ఫెయిర్ సోసైటీ సూచించింది. గతంలో పుస్తక ప్రదర్శన కేవలం.. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకే ఉండేదని.. ఈసారి మాత్రం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈసారి పుస్తక ప్రదర్శనలో కేంద్ర సాహిత్య అకాడమీ కూడా భాగస్వామ్యమవుతున్నట్టు సమాచారం.

**బాలోత్సవ్...**

ఈ ప్రదర్శనలో భాగంగా 9 రోజుల పాటు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6గంటల వరకు పిల్లల కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. రంగస్థల నిపుణుడు శాంతారావు ఆధ్వర్యంలో పిల్లలకు డ్రామా వర్క్‌షాప్, స్టోరీ టెల్లింగ్, క్రాఫ్ట్‌వర్క్ శిక్షణ శిబిరాలు, వినూత్న వస్త్రాలంకరణ, బృంద నృత్య, సంగీత ప్రదర్శనలు,



చిత్రలేఖనం, కథారచన పోటీలను నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటల నుంచి వివిధ అంశాలపై సాహిత్య చర్చాగోష్ఠులు, కవితా పఠనాలు నిర్వహించనున్నారు. కాగా.. ప్లాస్టిక్ రహితంగా పుస్తక ప్రదర్శన నిర్వహించాలన్న లక్ష్యంతో పుస్తక స్టాళ్ల నిర్వాహకులకు వస్త్ర సంచులు ప్రత్యేక రాయితీకి ఇవ్వనున్నారు.

# దుమ్ము రేగుతోంది!

- రహదారులు గుంతలమయం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు మండలం లోని ఇంద్రేశం నుండి దౌల్తాబాద్ వెళ్లే రోడ్డు మధ్యలో గుంతల మయంగా దర్శనమిస్తూ ప్రమాదాలకు నిలయంగా మారింది. వర్షాకాలంలో వరుసగా కురిసిన వర్షాలకు రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా మారడంతో పాటు రోడ్డుపై దుమ్ము లేవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. రోడ్డుపై లేసిన దుమ్ము పీల్చడంతో ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారి ఇక్కడి రహదారులపై ప్రయాణిస్తే.. వాహనాలు షెడ్డుకు, మనుషులు ఆస్పత్రికి వెళ్లాల్సిందేనని వాపోయారు. పటాన్ చేరు నియోజక వర్గాన్ని తెలంగాణ లో మీనీ ఇండియా చెప్పుకుంటారు. ఈ నియోజకవర్గంలో అన్ని రాష్ట్రాల ప్రజలు నివాసం ఉంటున్నారని, కానీ ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్లే వాహనదారుల కష్టాలు మాత్రం అధికారులు రాజకీయ నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. పటాన్ చేరు నుండి పెద్ద కంజర్ల వెళ్లే మార్గంలో అనునిత్యం ప్రయాణించే రాజకీయ నాయకులు,అధికారులు రోడ్లపై పడిన గుంతలను లేచే దుమ్ము పట్ల కనీసం చర్యలకు నోచుకోలేదు. పటాన్ చేరు నుండి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ రోడ్డయితే గుంతలతో ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి.. ఈ రోడ్డుపై ప్రయాణమంటే ప్రాణాల మీద ఆశలు వదిలేసుకోవడమేనని ప్రజలు వాపోతున్నారు. కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలతో గుంతలు, రోడ్లపై మట్టి పేరుకుపోయింది. ఇప్పుడు వర్షాలు తగ్గడంతో రోడ్లపై వాహనాల రాకపోకలతో భారీగా దుమ్ము లేవడంతో వాహనదారులు



ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వెళ్తున్న వాహనం కనబడనంతగా దుమ్ము లేస్తోంది. ఎండ కాలంలో మట్టి రోడ్లపై వెళ్తే ఎంత దుమ్ము లేస్తుందో అదే విధంగా ఇప్పుడు తారు రోడ్లపై లేస్తున్న డస్ట్‌తో వాహనదారులు.. రహదారిపై క్రషర్ బారి ఓవర్ లోడ్ వాహనాల రాకపోకలతో తీవ్రంగా దుమ్ము లేస్తోంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండి పడుతున్నారు. ఇకనైనా సంబంధిత జిల్లా అధికారులు చొరవ తీసుకొని సంబంధిత రోడ్లను వేచి దుమ్ము పట్ల తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**విశ్వంబర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామనికి చెందిన శంకరయ్యకు రూ 60 వేల రూపాయలు, ఓర్సు పద్మకు 13 వేల రూపాయలను సీఎం సహాయ నిధి నుండి చెక్కుల మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారులకు బుధవారం ఆయన నివాసంలో చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో షఫీ, రాములు, సత్యం, బుచ్చయ్య ఉన్నారు.

## ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండలం లోని ఆదర్శపాఠశాల ఉపాధ్యాయులు పీఎంటీఏ యూనియన్ పిలుపు మేరకు, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల సాధనకై, జీఓ పద్దు ద్వారా తమకు వేతనాలు అందజేయాలని కోరుతూ బుధవారం మండల ఎమ్మార్వో, ఎంఈ ఓ, ఎంపీడీవోలకు వినతి పత్రం అందచేయట%శీ% జరిగింది. జీఓ పద్దు సాధనకై, పీఎంటీఏ తలపెట్టిన నిరసన కార్యక్రమం 5 వ రోజుకు చేరుకుంది. ఆర్థిక శాఖలో జీఓ సంబంధించిన ఫైల్ పెండింగ్ లో ఉన్న కారణంగా, ప్రభుత్వం త్వరగా స్పందించి, వెంటనే జీఓ విడుదల చేయాలని, లేనిచో నిరసనలు కొనసాగుతాయని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మల్లికంటి వెంకటేశ్వర్లు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం



**విశ్వంభర, కడ్తాల్:** ఆకలితో ఉన్న వారికి సమయానికి భోజనం పెట్టడం చాలా పుణ్య ఫలం అని లయన్ పీడీజీ జి. చెన్నకిషన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తండ్రి వెంకట్రాజెడ్డి వర్ధంతి సందర్భంగా కడ్తాల్ లో అన్నప్రసాద వితరణ చేశారు. లయన్ సభ్యులు వారి కుటుంబ సభ్యుల పేరు మీద ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ లయన్స్ ప్రెసిడెంట్ కండె సత్యం, లయన్ సభ్యులు గోవర్ధన్ రెడ్డి, వేణుగోపాల్, గూదే రాజేందర్, జల్కం రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బషీర్ పార్థివ దేహానికి నివాళులు



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల్ బీజేపీ మైనారిటీ మోర్చా సీనియర్ నాయకులు బషీర్ అనారోగ్య కారణంగా మరణించడంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ బషీర్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బషీర్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు సుదర్శన్ యాదవ్, బీజేవైఎం మండల అధ్యక్షులు వనంపల్లి శ్రవణ్, బీజేపీ సీనియర్ నాయకులు ప్రకాష్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఫరీద్, బీజేపీ మండల అధికార ప్రతినిధి ఎల్లంపల్లి మల్లేష్, యువమోర్చా నాయకులు నరేష్, చింటూ పాల్గొన్నారు.

# విద్యార్థిని మిస్సింగ్

- మలక్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- 45 రోజులు గడిచినా పట్టించుకోని పోలీసులు
- స్టేషన్ ముందు పడిగాపులు కాస్తున్న తల్లిదండ్రులు

**విశ్వంభర, మలక్ పేట్:** డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సౌమ్య మిస్సింగ్ అయిన ఘటన మలక్ పేట్ పరిధిలో చోటు చేసుకుంది. ఇక వివరాల్లోకి వెళ్తే కోటి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ లో రెండవ సంవత్సరం చదువుతుంది. అక్టోబర్ 31న ఎల్బీనగర్ లోని చింతల్ కుంటలో తన మేనమామ ప్రహ్లాదు కు ఫోన్ చేసి సాయంత్రం ఇంటికి వస్తానని తెలిపింది. 6 గంటలకు ఒకసారి ఫోన్ చేసి వస్తున్నానని చెప్పి మలక్ పేట్ లోని బీసీ హాస్టల్ నుండి బయలు దేరింది. ఎంతకీ రాకపోవడంతో తన మేనమామ అమ్మాయి స్నేహితులకు, బంధువులకు ఫోన్ చేసి ఆరా తీశారు. ఎక్కడ లేకపోవడంతో మరుసటి రోజు తల్లి దండ్రులు అలివేలు, ఆంజనేయులు గ్రామం నుండి వచ్చి హాస్టల్ కు సంబంధించిన వివరాలు అడగగా 31 వ తేదీన సాయంత్రమే వెళ్లిందని చెప్పారని అన్నారు. నవంబర్ 1వ తేదీన మలక్ పేట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఒకరిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో వాటి వివరాలను పోలీసులు నమోదు చేసుకున్నారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు అనుమానం ఉన్న వ్యక్తి కుటుంబ సభ్యులను విచారణ చేయకుండా దాదాపు 48 రోజులు



కాలయాపన చేశారని తల్లిదండ్రులు వాపోయారు. 45 రోజులు గడిచినా తన బిడ్డ ఆచూకీ తెలపకుండా ఎలాంటి సమాచారం అందించకుండా ఉండడం వల్ల తమ బిడ్డ బ్రతికి ఉందా ..? లేదా, అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అని కంటతడి పెట్టుకున్నారు. పోలీసులు సరైన సమాధానం చెప్పకుండా మమ్మల్ని స్టేషన్ చుట్టూ తిప్పుంచుకుంటున్నారని వాపోయారు. తాము గ్రామంలో కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నామని, మాకు న్యాయం చేయండి అంటూ తల్లి దండ్రులు మరోసారి పోలీస్ స్టేషన్ వద్ద పడిగాపులు కాస్తున్నారు.

# నిరుపేదలకు దుప్పట్లు, చీరలు అందజేత

**విశ్వంభర, చండూరు:** ప్రతినెల 1వ తేదీన గాంధీజీ ఫౌండేషన్ 22 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందిస్తూ వస్తుంది. ఆ కార్యక్రమంలో భాగంగా నవంబర్ ఒకటవ తేదీన ముఖ్య అతిథిగా పాల్గొన్న చండూర్ ఎస్సై వెంకన్న గౌడ్ నిరుపేదలను, వారి స్థితిగతులను చూసి చలించిపోయాడు. గత 15 రోజులుగా విపరీతమైన చలి ఉండడంతో నిరుపేదలకు ఇవ్వమని దుప్పట్లను, చీరలను గాంధీజీ ఫౌండేషన్‌కు పంపించారు. బుధవారం స్థానిక గాంధీజీ విద్యాసంస్థలలో గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు వారికి దుప్పట్లను, చీరలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దయార్థ హృదయంతో ఎస్సై వెంకన్న గౌడ్ పేదలకు దుప్పట్లు, చీరలు పంపడం ఆయన సేవా గుణానికి నిదర్శనమని అన్నారు. దుప్పట్లు, చీరలను అందుకున్న



నిరుపేదలు ఎస్సై కుటుంబం కలకాలం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని కోరుకున్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రుల స్కానింగ్ సెంటర్లను తనిఖీ డీఎంహెచ్ఓ

**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. మురళిధర్ ఆదేశానుసారం, బుధవారం మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం నేతృత్వంలో మహబూబాబాద్ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులైన ధరణి, మేడ్ విజన్, నిక్మా హెల్త్ కేర్ సెంటర్, తేజస్వి నర్సింగ్ హోమ్, మైత్రి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులలో స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ మాట్లాడుతూ, మేనేజ్మెంట్ వారు అంధించే సేవలకు తీసుకునే రుసుములకు సంబంధించిన ధరల పట్టికను అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలని, ఆసుపత్రు లో సిబ్బంది యొక్క వివరాలను, వారి యొక్క అర్హత సర్టిఫికెట్స్ ను అందుబాటులో వుంచాలని, ఒకవేళ సిబ్బంధిని గాని, డాక్టర్ లను కానీ మార్చినట్లైతే, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయమునకు అట్టి వివరములు ముందు గానే తెలియ పరచాలని, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్ష నేరమని, శిక్షార్హులవుతారని



పేర్కొంటూ, ప్రతి నెల ఐదవ తేదీ లోపు పీసీపీఎన్డీటీఎఫ్ దరఖాస్తులు జిల్లా కార్యాలయానికి పంపించాలని అన్నారు. ఈ తనికీలలో హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ





**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల పరిధిలోని రాంనుంతల పెద్దతండ గ్రామంలో బాణావత్ సురేష్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సోమ, నాగేందర్, రామ్ చందర్, అప్పి గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పడిపూజ, అభిషేకం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్వాములు పాతకోట శ్రీశైలం, వంశీ, నరేష్, మాజీ సర్పంచ్ సోనా శ్రీను నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**విశ్వంభర, తల కొండపల్లి:** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో అయ్యప్ప స్వాముల మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాముల పడిపూజ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ విచ్చేసి మండల పార్టీ అధ్యక్షుడు తో కలిసి అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. గ్రామంలో అయ్యప్ప పడిపూజ పెద్ద ఎత్తున జరగడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం, వెల్జాల్ మాజీ ఎంపీటీసీ జి శ్రీనివాస్ మూర్తి, జగ్గారెడ్డి జక్కు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సమ్మ, రాఘవులు సుధాకర్ రెడ్డి, సాకలి సత్తయ్య, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలకంఠం, తుమ్మ నరసింహ, బోల యాదగిరి, నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**విశ్వాంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని సంగారెడ్డిపేట గ్రామానికి చెందిన విశ్రాంత విఆర్ఓ శని గారి మల్లయ్య గాంధీ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసుకొని ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకొని పరామర్శించారు. శంకరంపేట్(ఆ) మండలంలోని బుజరాన్ పల్లి గ్రామానికి చెందిన రాజయ్య గారి జగన్నాథరావు భార్య పుష్పలత ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో బుజరాన్ పల్లి లోని అతని గృహానికి వెళ్లి వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయనతోపాటు మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ మాజీ రైతుబంధు సురేష్ గౌడ్ మాజీ వైస్ ఎంపీపీ రమేష్, మాజీ సర్పంచులు గజవాడ నరసింహులు, కిషన్ సెట్, మాజీ కోఆప్షన్ యాదుళ్ళ, నాయకులు వెంకట్ రెడ్డి, సంగారెడ్డిపేట మాజీ సర్పంచ్ లక్ష్మీ రమేష్, మాజీ ఉపసర్పంచ్ సంగ్రామ్, నాయకులు లోక కిషన్, కురుమ దుర్గయ్య, శనిగరి గోపాల్, గ్రామ పార్టీ అధ్యక్షులు శనిగరి సాయిలు శనిగరి సామెల్, మంగలి రాములు పాల్గొన్నారు.

## సకాలంలో పాడి రైతులకు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** ప్రభుత్వ విజయ డైరీకి పాలు పోస్తున్న పాడి రైతులకు అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులతో పాటు మనోవేదనకు గులవుతున్నామని రైతులు వాపోయారు. పెద్ద శంకరంపేట లోని ప్రభుత్వ విజయ డైరీ పాల కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలవిక్రయదారులు రైతుల వద్ద పాలను సేకరించి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విజయ డైరీ కి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు పాలను విక్రయిస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నారు.. ఆగస్టు బిల్లు చెల్లించి సెప్టెంబర్ బిల్లు చెల్లించలేదని, ఇలా ఒక నెల బిల్లు చెల్లించి ఇంకో నెల బిల్లు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్య మధ్యలో రాణి బిల్లులు తిరిగి వస్తాయో రావోనని పాడి రైతులు మనోవేదన చెందుతున్నారు.ఈ విషయమై మెదక్ జిల్లా డీడీ కి చరవాణి ద్వారా పాడి రైతులు వివరణ కోరగా బిల్స్ వచ్చినప్పుడు తీసుకోవాలని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగా నెలనెలకు పేమెంట్లు ఇవ్వాలని తద్వారా పాల సేకరణ దారులకు రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ విషయమై స్థానిక డైరీ అధికారిని వివరణ కోరగా ప్రభుత్వం నుండి డబ్బులు వచ్చిన వెంటనే వీరికి చెల్లిస్తున్నామని బకాయిల విషయంలో పై అధికారుల నిర్ణయమే తమ నిర్ణయం అని ఆయన పేర్కొన్నారు.

## ఏఐసిసి నేషనల్ కోఆర్డినేటర్‌ను కలిసిన మమ్మద్ అహ్మద్ పాషా



**విశ్వంభర, హైదరాబాద్:** ఏఐసిసి నేషనల్ కోఆర్డినేటర్ మహమ్మద్ ఖాలిక్ ఉర్ రహ్మాన్, ఏడవ నిజాం ముని మనవడు, పెద్దపల్లి మహమ్మద్ బేగ్ మనవడు మీర్జా మోహిద్ బేగ్ ను జూబ్లీ హిల్స్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వక కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం మమ్మద్ ఖాలిక్ ఉర్ రహ్మాన్, మీర్జా మోహిద్ బేగ్ లను తెలంగాణ లోని మైనార్టీలో స్థితిగతులపై చర్చించారు. మైనార్టీల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారని మమ్మద్ అహ్మద్ పాషా తెలిపారు.

## విహార, విజ్ఞాన యాత్రకు బయలుదేరిన కేజీవీబీ విద్యార్థులు



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట మండలం ఇమాంపేట కేజీవీబీ బాలికల పాఠశాల విద్యార్థులకు విజ్ఞాన, విహార యాత్రకు బయలుదేరారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి సూచనలతో టూరిజం శాఖ బస్సులు ఏర్పాటు చేయడంతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో యాత్రకు నాలుగు బస్సుల్లో బయలుదేరారు. రామప్ప టెంపుల్, లక్నవరం, భద్రకాళి టెంపుల్, మరియు వేయి స్తంభాల గుడిని సందర్శించనున్నారు.

## యువత స్వయం ఉపాధితో ఎదగాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం మంగళ పల్లి చెన్నకేశవ కాలనీలో దండుగుల రాములు నూతన కిరణ షాపు ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక నాయకులు మురళితో కలిసి మున్సిపాలిటీ బీ ఆర్ ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ కిరణ షాపు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు స్వయం శక్తితో అభివృద్ధిలోకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ రమేష్ నాయక్, కటామోని వెంకటేష్, దండగుల నరేందర్, వరికుప్పల కళ్యాణ్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ జీవిత చరిత్ర నాటకాన్ని విజయవంతం చేయాలి

**మాస్ చైర్మన్ పాత్లవత్ ఘాట్యా నాయక్**



**విశ్వంభర, దోమ:** బంజరుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్, మరియమ్మ జీవిత చరిత్రను దోమ మండల పరిధిలోని దిర్సంపల్లి తండా వాసులు నాటక రూపంలో ఈనెల 19, 20వ తేదీల్లో రాత్రి 7 గంటల నుండి ప్రదర్శన ప్రారంభం అవుతుందని మాస్ చైర్మన్ పాత్లవత్ ఘాట్యా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నాటకానికి బంజారా జాతి ముద్దుబిడ్డలు, సేవాలాల్ అభిమానులు, కుల మతాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్యానాయక్, కిషన్ నాయక్, దివ్య నాయక్, గోపాల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, పాండు నాయక్, ధర్మానాయక్, రాములు నాయక్, జన్య నాయక్, భీమ్లా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్



**విశ్వంభర, కుత్బుల్లాపూర్ :** నియోజక వర్గ పరిధిలోని దుండిగల్ మున్సిపాలిటీ బోరంపేటలో ఎస్ కే 8 ఎస్ కూల్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన 8 మంది పాల్గొన్నారు. శైలజ నాయుడు ఫౌండర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి మా కోచ్ రాజు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు. తమ అకాడమీలో స్కెటింగ్, క్రికెట్ బాక్స్ క్రికెట్, కరాట్టే మరియు ఆర్చరీ వీటిలో శిక్షణ ఇవ్వబడునని తెలిపారు. స్కేటింగ్ లో వందమంది విద్యార్థులు రోజువారి ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు. 62 నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ లో మా అకాడమీలో చెందిన విద్యార్థులు, వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 5000 మంది విద్యార్థులు పాల్గొన్నారు, రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## డోలక్ మధుకు నేషనల్ కళా రత్న అవార్డు




**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి:** మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన చిలుముల మధుబాబు కు బహుజన సాహిత్య అకాడమీ 17వ నేషనల్ కాన్ఫరెన్స్ న్యూఢిల్లీ లో జరిగినటువంటి నేషనల్ అవార్డుల ప్రదానోత్సవం లో భాగంగా చిలుముల మధుబాబు ప్రతిభని గుర్తించి కళారంగంలో బెస్ట్ డొలకిస్ట్ నేషనల్ కళారత్న అవార్డు అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఒక మారుమూల నిరుపేద కుటుంబంలో జన్మించిన మధుబాబు కళారంగంలో తనదైన శీలిలో ముద్రను వేసి అంచెలంచెలుగా ఎదుగుతూ అనేక సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ విషయం తెలిసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాసులు మధుబాబును అభినందించారు.

## నేత్రదానం.. మహాదానం



**విశ్వంభర, నెల్లికుదురు:** మా నాన్న స్వర్గీయ వెనిశెట్టి సత్యనారాయణ మాకు ఆదర్శమని అందుకే శరీర అవయవ నేత్ర దానాలకు సంబంధించిన సదాశయ ఫౌండేషన్‌కు దంపతులు నేత్రదానం చేశామని డిపిఎం నలిని-డా.ఎన్ వేణుమాధవ్ లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామానికి చెందిన డా.వేణుమాధవ్ ఎంజీఎం రిటైర్డ్ ల్యాబ్ టెక్నీషియన్, నలిని డిపిఎంగా పనిచేస్తున్నారు. సదాశయ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు నచ్చి ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు(వ్యవస్థాపకులు)టి.శ్రవణ్ కుమార్ చేతుల మీదుగా బుధవారం వేణుమాధవ్ దంపతులు సభ్యత్వం తీసుకున్నారు. సదాశయ జల్లా అధ్యక్షులుగా డా.వేణుమాధవ్‌ను నియమించారు. దీంతో మరింత బాధ్యత పెరిగిందని, తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై డా.వేణుమాధవ్ కృతజ్ఞతలు తెలిపారు.

## సుద్దాల అశోక్ తేజను కలిసిన కప్పల రవి కుమార్



**విశ్వంభర, రామన్నపేట:** మండల కేంద్రానికి చెందిన, సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు అయిన కప్పల రవి కుమార్ గౌడ్, ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజను వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. సర్దార్ సర్వాయి పాపన్న ప్రతీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ జరిగినా, గీత కార్మికుల పక్షాన పాల్గొనాలని కోరడం జరిగిందనీ తెలిపారు.

# ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ

**జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు**



**విశ్వంభర, వరంగల్ :** జిల్లాలోని కాపుల కనపర్తి, గవిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నెక్కొండ, అలంకానిపేట లను వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవలను, సమయపాలనను పరిశీలించారు. సాధారణంగా చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలు ముక్కు కారడము,అస్తమా,శ్వాస కోస వ్యాధులు,హార్ట్ ఎటాక్స్,చర్మ సంబంధిత వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని, ప్రజలకు తగు సూచనలు చేయాలని సూచించారు. చిన్న పిల్లలకు,వృద్ధులకు షెటర్స్, గ్లౌజెస్, దుప్పట్లు నిండుగా కప్పుకొని చలికి గురి కాకుండా ఉండాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు అందించాలని వైద్యులను కోరారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని సూచించారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని కోరారు.

# ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

**షాద్ నగర్ ఏసీపీ రంగస్వామి**




**విశ్వంభర, ఆమనగల్లు:** షాద్ నగర్ ఏసీపీ రంగస్వామి బుధవారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసులు యొక్క వివరాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, క్రైమ్ రేటు ను మరింత తగ్గించేందుకు కృషి చేయాలని, కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు తగు న్యాయం జరిగేలా పనిచేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి అని తెలిపారు. మండలంలో దొంగతనాల కట్టడిపై దృష్టి పెట్టాలి. సాయంత్రం వేళల్లో రోడ్డుపై విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ లు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐ వెంకటేష్, తలకొండపల్లి ఎస్ఐ శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన శివకుమార్



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవ బృందం అధ్యక్షుడు శివ కుమార్ బుధవారం ఢిల్లీలో సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తో మర్యాదపూర్వకంగా కలిసి ఒకటే దేశం ఒకటే ఎన్నిక పై చర్చించారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు జరగడం వలన కలిగే లాభాల పై తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక యువకుడిగా మాట్లాడటం జరిగింది. అందుకు కిషన్ రెడ్డి ఒకటే దేశం – ఒకటే ఎన్నిక పై అంగీకారం తెలిపారు. శివ కుమార్ మాట్లాడుతూ దేశం మొత్తంలో వివిధ రాష్ట్రాల నుంచి సేవ రంగంలో కృషి చేస్తున్న యువత అంత కలిసి "సంవిధాన్ సపోర్ట్ " అనే బృందంగా కలిసి దేశం మొత్తం లో ఉన్న పార్లమెంట్ సభ్యులను పార్టీలకు అతీతంగా కలిసి ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. శివ కుమార్ రైతులకి అలాగే సమాజంలో స్వామివివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు వివరించడంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభినందించారు. సంవిధాన సపోర్ట్ సభ్యుడు మౌళి కిషోర్ పాల్గొన్నారు.

# పేద ప్రజలకు సొంతిల్లు ప్రభుత్వ లక్ష్యం



**విశ్వంభర, ఆమనగల్లు:** కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కృష్ణ నాయక్ అన్నారు. బుధవారం అమనగల్లు మున్సిపాలిటీ 6వ వార్డు గుబ్బంగుట్ట కాలనీలో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులపై అధికారులు సర్వేలో పాల్గొన్ని మాట్లాడుతూ పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు పూసలి సత్యం, మద్దూరి శ్రీనివాసులు, పుల్లయ్య, వడ్డే తిరుపతయ్య, సుకన్య, ఇందిరమ్మ, పుట్ట మంగమ్మ, మున్సిపల్ సిబ్బంది సాయిరాం, మనీషా పాల్గొన్నారు.

# మానవ మేథకు కృత్రిమ మేథ సాటిరాదు

**ఆతిథ్య ఉపన్యాసంలో స్పష్టీకరించిన బఫెలో విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వేణు గోవిందరాజు**



**విశ్వంభర, సంగారెడ్డి :** లక్షల సంవత్సరాల పరిణామ ప్రక్రియల ద్వారా రూపొందించబడిన లక్షణం, సందర్భాన్ని బట్టి క్రియాశీలంగా వ్యవహరించే ప్రత్యేక సామర్థ్యాన్ని మానవులు కలిగి ఉన్నారని, దీనికి విరుద్ధంగా డేటాసెట్ లపై కృత్రిమ మేథ ఆధారపడి అనుకరించే సామర్థ్యానికి పరిమితమవుతోందని అమెరికాలోని బఫెలో విశ్వవిద్యాలయ పరిశోధన, ఆర్థికాభివృద్ధి విశిష్ట ఆచార్యుడు డాక్టర్ వేణు గోవిందరాజు అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'కృత్రిమ మేథ వికాసం: మానవ భాషా కమ్యూనికేషన్ పై దృక్కోణం' అనే అంశంపై బుధవారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు. చెక్ లిస్టులు, పరీక్షలు, పరిశీలనలతో కృత్రిమ మేథ మనకు సాయపడుతున్నప్పుడు, మానవ ఆలోచన యొక్క సంక్లిష్టతను ప్రతిబింబించడంలో సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. కృత్రిమ మేథ రంగంలో నిపుణుడైన ఆయన, ముఖ్యంగా మానవ భాషా కమ్యూనికేషన్ రంగంలో తన లోతైన అవగాహనను అందించారు. చేతి వ్రాత గుర్తింపులో డాక్టర్ వేణు మార్గదర్శక పని, అమెరికా పోస్టల్ సర్వీస్ ఉపయోగించే మొదటి చేతివ్రాత చిరునామా వివరణ వ్యవస్థ అభివృద్ధికి దారితీసింది. దాదాపు వంద మిలియన్ డాలర్ల ప్రాయోజిత ప్రాజెక్టులకు ఆయన నాయకత్వం వహించడంతో పాటు ఆరు పేటెంట్లు, 460 పరిశోధక పత్రాలను ప్రచురించి, పలు ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ఎస్సై రమేష్ బాబు**



**విశ్వంభర, నెల్లికుదురు:** పోలీసుల పేరుతో ఫైబర్ నేరగాళ్లు ఘరానా మోసాలకు పాల్పడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చిర్ర రమేష్ బాబు బుధవారం మండల ప్రజలను హెచ్చరించారు. తాను ఎ ఎస్సై నంటూ సైబర్ నేరగాళ్లు జిల్లాలోని నరసింహుల పేట,గూడూరు లలో కొందరికి ఫోన్ చేసి ఎస్ఐ కూతురు హాస్పిటల్ లో ఉందని, డబ్బులవసరమని అర్జెంటుగా ఫోన్ పే చేయండి ని,తాను క్యాష్ ఇస్తానని మోసం చేసిన విషయం గుర్తు చేశారు. ఎవరైనా పోలీసులమని ఫోన్ చేసి డబ్బులడుగుతే ఫోన్ పే చేసి మోసపోవద్దన్నారు. వెంటనే 1930 ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

# తుమ్మలపల్లిలో ఇంటింటి సర్వే



**విశ్వంభర, వికారాబాద్ :** మర్పల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఇందిరమ్మ ఇండ్లు పథకం పేద వారి సొంత ఇంటి కళ నెరవేర్చబోతుంది. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుల అధ్యర్యంలో సమావేశం జరిపి ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి ఇండ్లు లేని వారి వివరాలు ఇంటిస్థలం తో పాటు పలు అంశాల పై పక్కాగా పరిశీలన చేసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించాలని తుమ్మలపలి గ్రామం లో రవి జూనియర్ అసిస్టెంట్ అధ్యక్షతన కమిటీ సభ్యులు చర్చించి, ఇందిరమ్మ ఇండ్ల గురించి యాప్ లో అప్డేట్ చేసారు. ఈ కార్యక్రమం లో సభ్యులు పసుల సురేష్ , బోయిని స్వాతి , దొడ్ల అరుణ, దూదేకుల జిలాని , ఆకుల బిచప్ప , తుమ్మలపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నే పాండు , రాజు పటేల్, కర్ని సాయిబాబా, పసుల ప్రేమాకుమార్,బోయిని శ్రీనివాస్, దొడ్ల రమేష్, బేగరి రాచయ్య, మన్నే నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరస్థుల వలలో చిక్కి డబ్బులు పోగొట్టుకోవద్దు

**జిల్లా ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి**




**విశ్వంభర, మహబూబాబాద్:** ఇటీవల మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మరియు గూడూరు మండల కేంద్రల్లో సైబర్ నేరగాళ్ల ఘరానా మోసాలు బయటపడ్డాయి. ఏఎస్ఐ నంటూ ఫోన్ చేసి డబ్బులు ఫోన్ పే చేయించుకున్న సైబర్ నేరగాళ్లు. పోలీస్ స్టేషన్ నుండి ఏఎస్ఐ ని మాట్లాడుతున్నానని మాటలు కలిపి, ఎస్సై కూతురు హాస్పటల్ లో ఉందని, ఆరోగ్యం బాగాలేదని ట్రీట్మెంట్ కు డబ్బులు కావాలని, క్యాష్ ఇస్తానని ఫోన్ పే చేయాలని సైబర్ నేరగాళ్ళు కోరారు. కొద్దిసేపటి తరువాత ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని రావడంతో తాను మోసపోయానని తెలిసి పోలీసులను ఆశ్రయించారు. కావున ప్రజలు ఎవరు కూడా పోలీసులని ఫోన్ చేసి డబ్బులు పంపమంటే పంపి మోసపోవద్దు. సైబర్ నేరస్థుల వలలో చిక్కి డబ్బులు పోగొట్టుకోవద్దు. ఎవరైనా ఈ విధంగా ఫోన్ చేసినట్లయితే వెంటనే 1930 ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

## ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి



**విశ్వంభర, కడ్తాల్ :** ఉప్పల చారిటబుల్ ట్రస్టు, కామినేని హాస్పిటల్ సౌజన్యంతో ముద్విన్ గ్రామంలో విజయవంతంగా మూడో రోజు కొనసాగుతున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం. నిరుపేదల కోసం గ్రామ గ్రామాన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందని డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బుధవారం కడ్తాల మండలంలోని ముద్విన్ గ్రామంలో మూడు రోజులపాటు కొనసాగుతున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని మాడుగుల పిఎసిఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, మాజీ జెడ్పిటిసి జరుపుల దశరథ్ నాయక్ లతో కలిసి ఆయన సందర్శించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 330 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరాన్ని డాక్టర్ అఖిల్, డాక్టర్ అనిల్, భావన కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముద్విన్ మాజీ ఉపసర్పంచ్ వినోద్, బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రాజు,జంగయ్య,అర్థం వాసుదేవ్,అర్థం చంద్రయ్య, అర్థం యాదయ్య, వేముల రమేష్, అర్థం శ్రీను, అర్థం ప్రకాష్, బుచ్చిబాబు,ఆశ వర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.

## గూడూరులో ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వే



**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం, బొద్దుగొండ గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం సర్వేను, అయోధ్యపురం, దామరచర్ల ,గూడూరు లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఆశ్రమ హై స్కూల్, టీటీడబ్ల్యూ ఆర్ఎస్జెసి లలో మధ్యాహ్న భోజనం తనిఖీ, పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం సిబ్బంది సర్వే నిర్వహించాలని, పక్క సమాచారం సేకరించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు, జిల్లా వ్యాప్తంగా వేగంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారుల వివరాలు సేకరించి ఇందిరమ్మ కమిటీ సభ్యులు భాగస్వాములను చేస్తూ నిబంధనల ప్రకారం ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సర్వే చేస్తున్నామన్నారు. ఆశ్రమ హై స్కూల్, టీటీడబ్ల్యూ ఆర్ఎస్జెసి లలో మధ్యాహ్న భోజనం తనిఖీ, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైట్ మెనూ షెడ్యూల్ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని, వసతి గృహంలో పరిసరాలను ఎప్పటికప్పుడు సానిటేషన్ చేపించాలని స్టడీ రూమ్, మరుగుదొడ్లు, క్లాస్ రూమ్స్ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## మూగ జీవాలకు ఉచిత టీకాలు



**విశ్వంభర, రామన్నపేట:** కొత్తగూడెం గ్రామంలో 18 -12 -2024 రోజున పశు సంవర్ధక శాఖ సబ్-సెంటర్, మునిపంపుల నుండి జూనియర్ వెటరినరీ అధికారి సయ్యద్ అన్వర్ అలీ కొత్తగూడెం గ్రామంలో గొర్రెలు, మేకలకు కలిపి మొత్తం 1042 జీవాలకు పుర్రు వ్యాధి రాకుండా పిపీఅర్ టీకాలు ఉచితంగా చేశారు. అలాగే గొర్రెలు, మేకలకు ఫ్లాక్ రిజిస్ట్రేషన్ చేసి వాటి చెవులకు ట్యాగులు వేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వెటరినరీ అధికారి సయ్యద్ అన్వర్ అలీ, పంచాయతీ సెక్రటరీ ఉయ్యాల పావని, మాజీ సర్పంచ్ చిల్లర కైలాసం, యాదవులు మహేష్, నరేష్, సురేష్, నీల ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

**ఎంఈఓ రాందాస్**



**విశ్వంభర, నెల్లికుదురు :** కబడ్డీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రాందాస్ క్రీడాకారులకు సూచించారు. మండలంలోని ఆలేరు జడ్పీహెచ్ఎస్ లో మానుకోట జిల్లా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన16 మంది బాలురు,16 బాలికల కబడ్డీ క్రీడాకారుల శిక్షణను ఎంఈఓ క్యాంపు కన్వీనర్ బీసు యాకన్నతో కలిసి బుధవారం ప్రారంభించారు. శిక్షణ అనంతరం రాష్ట్రస్థాయి కాబట్టి పోటీలలో సంబంధిత క్రీడాకారులు పాల్గొంటారని కన్వీనర్ బీసు యాకన్న తెలిపారు. కార్యక్రమంలో సంద వీరన్న, గంధసిరి శ్రీనివాస్, తోట యాకాంబరం, గుమ్మల సురేందర్, స్థానిక పిడి ఇమామ్, టీచర్ నవీన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## లింగమంతుల స్వామి జాతర ఏర్పాట్లకు

# ప్రణాళికలు సిద్ధం చేయాలి

**సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**





**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట 5 వార్డు దురాజ్ పల్లిలోని శ్రీ లింగమంతుల స్వామి దేవాలయాన్ని బుధవారం ఉదయం ఆదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ మాట్లాడుతూ ఫిబ్రవరి 2025 సంవత్సరంలో జరుగు శ్రీ లింగమంతుల స్వామి జాతర ఫిబ్రవరి 2 తారీఖు దిష్టి పూజ నిర్వహిస్తారని, ఫిబ్రవరి 16, 17, 18, 19 ,20, తేదీలలో జాతర నిర్వహించబడుతుందని కలెక్టర్ తెలిపారు. జాతర ఏర్పాట్ల కొరకు ప్రతి కార్యక్రమానికి ఒక ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయాలని, అధికారులు జాతర సజావుగా నిర్వహించడానికి కావలసిన పనుల అంచనా విలువలను సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. జాతర జరుగు అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ఉండాలని ,పర్యవేక్షణకు ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్ గుడి పైన క్రింద ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ పబ్లిక్ ఎటస్టెషన్ సిస్టం ఏర్పాటు చేయాలని చెప్పారు. జాతరలో పనిచేసే సిబ్బంది అందరికీ పాసులు ఉండాలని కలెక్టర్ తెలిపారు. వాలంటీర్స్ అందరికీ పోలీస్ అప్రూవల్ కార్డ్స్ ఉండాలని తెలిపారు. దేవాలయం వద్ద ప్రోటోకాల్ కొరకు ఒక అధికారిని నియమించాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ప్రత్యేక అధికారులు వచ్చినప్పుడు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కొరకు ఒక అధికారి నియమించాలని తెలిపారు. డ్రింకింగ్ వాటర్ నిరంతరంగా ప్రజలకు అందేలా ఏర్పాట్లు ఉండాలని డ్రింకింగ్ వాటర్ వద్ద సోప్ పీట్స్ సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ పరంగా టెంపుల్ ఏరియా , చుట్టూ ఉన్న భూములకు సంబంధించిన మ్యాప్ ను సిద్ధం చేయాలని తెలిపారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో పార్కింగ్, ప్రదేశాలు ఎగ్జిబిషన్ ప్రదేశాలు భోజనాలు చేయు ప్రదేశాలను గూగుల్ స్కెచ్ తయారుచేసి అందించాలని తెలిపారు. గుడి పైన ఏర్పాట్లను దేవాదాయ శాఖ ,గుడి కింద ప్రాంతాలను మున్సిపల్ అధికారులు ఏర్పట్లు పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు ఆర్ అండ్ బి అధికారులు గుడి పక్కన గల కోనేరుకు, గుడి చుట్టూ ఉన్న రహదారులకు బారికేట్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దేవాలయం పైన జాతర చుట్టుపక్కల రహదారులకు సుందరీకరణ చేయాలని, కోనేరు వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రాంతాలలో సెక్యూర్ లైటింగ్ ఉండాలని తెలిపారు. ప్రాంతాలవారీగా , ప్రదేశాల వారీగా ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. జాతర జరుగు సమయంలో ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుటకు పారిశుధ్య కార్మికులు పైన దేవాదాయ శాఖ వారు, గుడికి క్రింద మున్సిపల్ మరియు ఎంపీడీవోలు చూడాలన్నారు. జాతర కు వచ్చు అన్ని రహదారులను పంచాయతీరాజ్ శాఖ అధికారులు పరిశీలించి సిద్ధం చేయాలన్నారు. దేవాలయం వద్ద గుడి పైన హెల్త్ క్యాంప్ గుడి క్రింద భాగంలో కూడా ఒక హెల్త్ క్యాంపు ఏర్పాటు , ఎపడమిక్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు తెలిపారు. దేవాలయానికి, పరిసర ప్రాంతానికి మంచి రంగులు వేయాలని అలాగే గుడి పైన జాతర గుర్తుగా బెలూన్ ప్రదర్శించాలన్నారు. గుడి పైన చలవ పందిళ్లు ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులకు కలెక్టర్ తెలిపారు. శ్రీ లింగమంతుల స్వామి జాతర విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకిడ్బందీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏ సులోచన, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఐదవ వార్డు కౌన్సిలర్ భాష, డీఎస్పీ రవి, ఈవో కుశలయ్య, ఆలయ పూజారులు శ్రీశైలం ,శ్రీను , తాహసిల్దార్ కృష్ణయ్య, ఆర్ ఐ శ్రీధర్, మిషన్ భగీరథ అధికారులు ఇంట్రా శ్రీనివాస్ ,గ్రిడ్ అధికారి అరుణాకర్ రెడ్డి, ఎంపీడీఓలు, అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.

## ధనుర్మాసం సంకష్టహర చతుర్థి వేడుకలు

**హాజరైన మున్సిపల్ చైర్మన్, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ**



**విశ్వంభర, షాద్ నగర్:** మున్సిపాలిటీలో ధనుర్మాసం సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకొని బుధవారం షాద్ నగర్ పట్టణం 20వ వార్డు వినాయక గంజ్ లోని గణేష్ దేవాలయంలో సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ చైర్మన్ కొందూటి నరేందర్,విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి బండారి రమేష్ లతో కలసి గణనాథుడికి,శివుడికి పూజలు చేశారు .ఈ కార్యక్రమంలో మలగారి సత్యనారాయణ,శ్రీనివాస్ రెడ్డి,శేఖర్ రెడ్డి దంపతులు,గజవాడ నర్సింలు,అంతటి శ్రీనివాస్ గౌడ్,శ్రీధర్,ఆలయ ట్రస్ట్ సభ్యులు ఓం ప్రకాష్,మహావీర్,సురేందర్,సుదీప్ దంపతులు,షుగన్ చందు దంపతులు, పి గోపాల్,కత్తి శేకరప్ప,మాజీ మార్కెట్ చైర్పర్సన్ ఎలుగమని యాదయ్య,టిఆర్ఎస్ నాయకులు యుగేందర్ ,కో ఆప్షన్ సభ్యులు కిషోర్,అబిలాస్,డాక్ట గణేష్,డాక్టర్ రవికుమార్,కరుణాకర్, పులగారి సంతోష్,ఆలయ పూజారి రాజన్ పండిత్ శుక్లా,మహిళలు,భక్తులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన నూకం గాలయ్య లక్ష్మమ్మ దంపతుల పెద్ద కుమారుడు గత మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయాలు అవడంతో విషయాన్ని తెలుసుకున్న మాతృదేవోభవ అనాధాశ్రమ నిర్వాహకులు గట్టు గిరి వెంటనే స్పందించి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి సహాయంగా పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లవేళలా మా సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న మాకు సంప్రదించగలరని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతల సత్యనారాయణ, ఉప్పారమోని పెద్ద యాదయ్య, ఉప్పారమోని చిరంజీవి, చింతల బుగ్గయ్య, చెక్క కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ 2024ను ప్రారంభించిన ఉప్పల



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఉప్పల్ లోని ఎలైట్ గారేజ్లో నిర్వహించిన మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ సెలక్షన్స్ లో పోటీలను మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు , టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ సీఎం కప్ 2024ను ప్రారంభించడం సంతోషం అని గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. మతాలకు అతీతంగా అందరూ కలిసే చోటు క్రీడామైదానం ఒక్కటే. యువత వ్యసనాల జోలికి పోకుండా క్రీడలవైపు మళ్లాలి. విశ్వ క్రీడల్లో మెడల్స్ సాధించాలి. మీకు అవసరమైన సహకారాన్ని ప్రజా ప్రభుత్వం అందిస్తుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి డీ వైఎస్ ఓ గోపాల్ , బ్యాడ్మింటన్ కోశాధికారి హర్ష యాదవ్ , క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట బిజెపి కార్పొరేటర్ల నిరసన



**విశ్వంభర, సరూర్ నగర్ :** గత 6 నెలల నుండి ఎల్బినగర్ జోన్ లోని అన్ని డివిజన్ లలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకపోవడంపై జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద బుధవారం బీజేపీ కార్పొరేటర్ లు కమిషనర్ లోపలికి వెళ్లకుండా అడ్డుకుని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఒక్కో డివిజన్ కు 50 వేల మంది ఓటర్లు ఉన్నారని అభివృద్ధి విషయంలో నిధులు విడుదల చేయకపోవడం వలన ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నట్లు తెలిపారు. అత్యధికంగా పన్నులు కడుతున్నా ప్రజల సమస్యలు తీర్చలేక పోతున్నట్లు వాపోయారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఓల్డ్ సిటీ కి అధికనిధులు కేటాయించి మాకు మొండి చేయి చూపిస్తుందని ఆరోపించారు. బిజెపి కార్పొరేటర్లమని మాకు నిధులు కేటాయించడం లేదన్నారు. మా సమస్యలపై జోనల్ కమిషనర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ మాట్లాడుతూ నా పరిధిలో ఉన్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. నిధులు విడుదల అంశంపై జిహెచ్ఎంసి కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్తానని హామీ ఇచ్చారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహా రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రంగా నర్సింహా గుప్తా, పవన్ కుమార్, ఆకుల శ్రీవాణి, చింతల అరుణ , మొద్దు లచ్చి రెడ్డి, కళ్లెం నవజీవన్ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డుపై డబ్బుల కట్టలు విసిరేసిన యువకుడిపై కేసు నమోదు



**విశ్వంభర, ఘట్కేసర్ :** కొందరు రీల్స్ పిచ్చితో ఏదైనా చేస్తున్నారు. యువత రీల్స్ పిచ్చితో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అలాంటి ఘటన మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పరిధిలోని ఓ ఆర్ఆర్ వద్ద జరిగింది. ఓ యువకుడు రూ.20 వేలు రోడ్డు పక్కన విసిరేసి, వీడియో చూసినవారు ఎవరైనా వచ్చి తీసుకోవచ్చని ఎగ్జిట్ నెంబర్ 9 దగ్గర వేసాను ఎవరైనా వచ్చి తీసుకెళ్లండి అని ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేశాడు. ఈ వీడియో వైరల్ గా మారి ఘట్కేసర్ పోలీసులకు తెలియడంతో యువకుడిపై కేసు నమోదు చేశారు.

## ఎస్సారెస్పీ నీటిని వెంటనే విడుదల చేయాలి



**విశ్వంభర, నాగారం:** ఎస్సారెస్పీ నీటిని వెంటనే విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం నాయకులు కడెం కుమార్, దేవరకొండ యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నాగారం మండల కేంద్రంలోజరిగిన సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసంగి పొలం చేసుకోవడానికి రైతులు ఎదురుచూస్తున్నారని అధికారులు తక్షణమే స్పందించి ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు అందించాలని కోరారు. ప్రజా పాలన పేరుతో ప్రభుత్వంఅర్హులైన పేదలందరికీసంక్షేమ పథకాలు అమలు చేయడం హర్షనీయమన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీ స్కీం లను వెంటనే అమలు చేయాలని కోరారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఒప్పందం ప్రకారం హమాలీ రేట్లను పెంచాలి




**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్లతో జరిగిన హమాలీ రేట్ల పెంపు అంగీకారం అక్టోబర్ 4, 2024న జరిగిన ఒప్పందం ప్రకారం హమాలీ రేట్లను పెంచి బకాయి హమాలీ రేట్లను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్రాజ్ డిమాండ్ చేశారు. నేడు రాష్ట్రంలోని వివిధ గోడౌన్లలో పనిచేస్తున్న హమాలీలు వందలాది కార్మికులు సివిల్ సప్లయిస్ భవన్ ముట్టడిరచి దిగ్బంధం చేశారు. పెద్ద ఎత్తున హమాలీ కార్మికులు పాల్గొని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హమాలీ రేట్లను పెంచాలని కోరారు. గత కొన్నేండ్లుగా ఎఐటియుసి సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ పోరాటాల ఫలితంగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్తో జరిగిన ఒప్పందం ప్రకారం ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి జనవరి నెల నుండి హమాలీ రేట్లు, హమాలీ కార్మికుల సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఉన్న జి.ఓ.ను ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి అమలు చేయకుండా సంవత్సరం గడిచిపోతున్నా అధికారులలో కనీస స్పందన లేదని ఆయన విమర్శించారు.

## వసతి గృహాలను నిత్యం తనిఖీలు నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



విశ్వంభర, మహబూబాబాద్: జిల్లాలోని వసతి గృహాలు పాఠశాలలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, మండల ప్రత్యేక అధికారులు నిత్యం వసతి గృహాలు పాఠశాలలు తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని అన్ని వసతి గృహాల సంక్షేమ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది సంబంధిత అధికారులతో కలిసి పాఠశాలలు ,వసతి గృహాల అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని వసతి గృహాలలో పాఠశాలలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, అదనపు మరుగుదొడ్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్స్, చిన్న చిన్న మైనర్ రిపేర్, డ్రైనేజ్ సిస్టం, త్రాగునీరు ఆర్వో ప్లాంట్స్, విద్యుత్ సౌకర్యాలు, డోర్స్, విండోస్ రిపేర్లు, అంతర్గత పనులు, తదితర పనులు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. డైట్ మెనూ చాట్ ప్రకారం రుచికరమైన ఆహారం షెడ్యూల్ ప్రకారం పిల్లలకు అందించాలని, సానిటేషన్ పక్కాగా నిర్వహించాలని, పిల్లలకు మానసిక నైపుణ్యత మీద అవగాహన కల్పించాలని, ప్రతి విద్యా సంస్థలో సైకాలజిస్ట్ చే క్లాసులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు,డిసిఓ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డిహెచ్ఓ మరియన్న, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ వీరభద్రమ్, డిటిడబ్ల్యుఓ సైద నాయక్, డిఎఓ విజయనిర్మల, ఆర్ అండ్ బి ఈఈ భీమ్లా నాయక్, డి.ఈ అరుణ్ కుమార్, సిపిఓ సుబ్బారావు, డిపిఓ హరిప్రసాద్, డిఎఫ్ఓ వీరన్న, డిసిఓ ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, డిసిఓ లు, ఆర్సిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## ముక్తి వనం పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి జిల్లా:** మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ముక్తివనం పార్కును జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకులకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని అటవీశాఖ అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిరివంచ ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ముక్తివనం పార్క్ గురించి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముక్తి వనం పార్కు అభివృద్ధి చేయడం వల్ల పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. కాళేశ్వర దేవస్థానానికి అతి సమీపంలో ఉన్నందున పార్కు అభివృద్ధి వల్ల ఈ ప్రాంతం యొక్క ప్రాధాన్యత మరింత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, తహశీల్దార్ కృష్ణ, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం జిల్లా కమిటీ సభ్యులుగా వనం ఉపేందర్ ఎన్నిక



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన యాదాద్రి భువనగిరి జిల్లా సీపీఎం 3వ మహాసభలలో రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామానికి చెందిన వనం ఉపేందర్ ను రెండోసారి జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు ఉపేందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు 6 గ్యారెంటీలను ప్రకటించినా, ఇప్పటికి అమలు చేయడంలేదని, వికలాంగులకు 6000 పింఛన్, ఉచిత బస్ పాస్ సౌకర్యం వికలాంగ నిరుద్యోగులకు బ్యాక్ లాగ్ పోస్టులను బర్తీ చేస్తామని, ప్రజలకు విద్య, వైద్యం, ఉద్యోగం అమలు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని అన్నారు. భవిష్యత్తులో బలమైన ప్రజా ఉద్యమాలను నిర్వహించడం కోసం కృషి చేస్తామని, అదే విధంగా యాదాద్రి జిల్లా వ్యాప్తంగా పేరుకు పోయిన సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో అనేక పోరాటాలను నిర్వహిస్తామని చెప్పారు. బాల్యం నుంచి ప్రజా సంఘాలు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సీఐటీయూ, వికలాంగుల సంఘాలలో పనిచేస్తూ మంచి కార్యకర్తగా ప్రజల మధ్య ఉండి పార్టీ పిలుపు మేరకు ప్రజాపోరాటాలలో పాల్గొంటున్నట్టు తెలిపారు. మళ్ళీ రెండోసారి జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర, జిల్లా కమిటీకి అభినందనలు తెలిపారు.

## నూతన గృహప్రవేశానికి హాజరైన సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** దుబ్బచర్ల గ్రామంలో అన్ రెడ్డి సువర్ణ రామి రెడ్డి మాజీ ఎంపీటీసీ నూతన గృహప్రవేశానికి హాజరై సత్యనారాయణ స్వామివారి తీర్థప్రసాదాలు తీసుకుని వారికుటుంబ సబ్యులకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దుబ్బచెర్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న రామాలయం పరిశీలించారు. వారితో పాటు పి.ఎ.సి.ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్, మాజీ జడ్పీ చైర్మన్ అనిత రెడ్డి. మాజీ సర్పంచ్ లు,మాజీ ఎంపీటీసీ లు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశ్వంభర V3 NEWS

# మాజీ సర్పంచులను ఆదుకోండి

- శాసనమండలి చైర్మన్ గుత్తాకు వినతి
- సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ గ్రామ పంచాయతీలలో పెండింగ్ లో ఉన్న బిల్లుల విషయమై తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారిని శాసన మండలిలో ఎమ్మెల్సీ కవిత గారు, నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో 2019 – 2024 కాలవ్యవధిలో సర్పంచులుగా కొనసాగి రాష్ట్రవ్యాప్తంగా సొంత గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ సూచనలు మరియు ఆదేశాల మేరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, గ్రామపంచాయతీలలో వీధిలైట్ల నిర్వహణ, అంతర్గత మురుగు కాలువల ఏర్పాటు, పల్లె ప్రకృతి వనం, రైతు వేదిక, వైకుంఠధామం, మనఊరు – మనబడి, పల్లెప్రగతి, మిషన్ భగీరథ లాంటి పనులు చేసావని. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతీకి కనీసం 5 లక్షల నుండి 50 లక్షల వరకు బిల్లులు బకాయిలో ఉన్నట్లు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లామని ఇప్పటికీ మా యొక్క పెండింగ్ బిల్లులు అందక 12,769 సర్పంచులు అవస్థలు పడుతున్నారని గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు అప్పులు చేసి ఖర్చుపెట్టిన సర్పంచులు బిల్లులు అందక ఆత్మహత్యలు చేసుకున్నారని ఇట్టి విషయమై అధికారులకు,ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యంగా ఉందని చైర్మన్ కి వివరించినట్లు సంఘం నేతలు తెలిపారు. దేశానికి పట్టుకొమ్మలైన గ్రామపంచాయతీ సర్పంచుల యొక్క పెండింగ్ బిల్లులు మొత్తం వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించడం జరిగిందని, చైర్మన్ సానుకూలంగా స్పందించి గ్రామపంచాయతీలలో పెండింగులో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేసే విధంగా ప్రభుత్వానికి సిఫారసు చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహా రెడ్డి తెలిపారు. ఈ రోజు శాసనమండలిలో సర్పంచుల బిల్లుల చెల్లింపు పై మాట్లాడిన ఎమ్మెల్సీ కవిత, నవీన్ రెడ్డి సర్పంచుల సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు నేతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సముద్రాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ ఆశ్రమంలో అన్నదానం



**విశ్వంభర, రామన్నపేట:** నీర్నెముల గ్రామానికి చెందిన ఆలకుంట్ల రాజు–మాధవి దంపతులు వారి తండ్రి ఆలకుంట్ల యాదగిరి పదవ వర్ధంతి సందర్భంగా చౌటుప్పల్‌లోని అమ్మానాన్న అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేసారు. ఈ సందర్భంగా ఆలకుంట్ల రాజు మాట్లాడుతూ, తన తండ్రి ఎన్నో కష్టాలను ఓర్చుకుని తనను ఉన్నతమైన చదువులు చదివించి మంచి మార్గంలో నడిపి ఒక ప్రయోజకుడ్ని చేసినారని, జీవితంలో తండ్రి యొక్క విలువ చాలా గొప్పది అని, తన తండ్రి తమ నుండి దూరమై నేటికి పది సంవత్సరాలు అయినా, ఆయనను గుర్తు చేసుకుంటూ అమ్మానాన్న అనాథాశ్రమంలో అన్నదానం చేయడం చాలా గొప్ప విషయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు నోముల చిరంజీవి, నోముల మల్లేష్, పెరమాండ్ల నవీన్, నోముల విష్ణు, నోముల నరసింహ, చిప్పలపల్లి జితేందర్, ఆలకుంట్ల రాజు–మాధవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన దశరథ్ నాయక్



**విశ్వంభర, కడ్తాల్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ కల్వకుంట్ల తారక రామారావును లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో కడ్తాల్ మండలంలో పర్యటించేందుకు సమయం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కడ్తాల్ మండలంలో జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముద్విన్ గ్రామంలో నిరుపేదరాలికి నిర్మించిన నూతన ఇంటిని ప్రారంభించేందుకు రావాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేటీఆర్ త్వరలోనే కడ్తాల్ మండలంలో పర్యటిస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

## సీఎం క్రీడా కప్ పోటీల ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్



**విశ్వంభర, మహబూబాబాద్:** పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 19 నుండి 21 వరకు మూడు రోజులపాటు జరగనున్న జిల్లా స్థాయి ముఖ్యమంత్రి క్రీడా కప్ పోటీల ఏర్పాట్లను అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీరబ్రహ్మాచారి, సంబధిత అధికారులతో కలిసి స్టేడియంను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పరిశీలించారు. ఆయన వెంట మహబూబాబాద్ ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా క్రీడల అధికారిని జ్యోతి, మున్సిపల్ కమిషనర్ రవీందర్, డి ఇ ఉపేందర్, మహబూబాబాద్ తహసీల్దార్ భగవాన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## సిపిఐ పార్టీది వీరుల త్యాగాల చరిత్ర



**విశ్వంభర, రామన్నపేట:** స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో అనేక మంది ప్రాణ త్యాగాలు చేసిన వీర చరిత్ర గల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం జరిగిన సమావేశ కార్యక్రమంలో మాట్లాడుతూ, సిపిఐ పార్టీ 100 వసంతాల ఉత్సవాల ప్రారంభం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ఎన్.జి కాలేజి గ్రౌండ్లో జరిగే బహిరంగ సభకు నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, పార్టీ సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, ఉట్కూరి భగవంతం, గంగాపురం వెంకటయ్య, రచ్చ యాదగిరి, ఐలాపురం నరసింహ తదితర నాయకులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ప్రోత్సాహం



**విశ్వంభర, వరంగల్ :** తెలంగాణ సీఎం కప్ సందర్భముగా హన్మకొండ జిల్లా స్థాయి బ్యాడ్మెంటన్ షటిల్ క్రీడా పోటీలు జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం లో ఘనంగా జరిగాయి. హన్మకొండ జిల్లా స్థాయి ప్రథమ ద్వితీయ స్థానాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడారుల ఆటల ప్రారంభ అథిదిగా తెలంగాణ బ్యాడ్మెంటన్ సంఘ అధ్యక్షులు (టి,బి,ఏ), ఏఐసిసి సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరై క్రీడారుల పరిచయం చేసుకొని వారికి అభినందనలు తెలియపరిచారు. హన్మకొండ జిల్లాస్థాయిలో జరుగు క్రీడల్లో గ్రామ, మండల స్థాయిలో జరిగిన సియం కప్ క్రీడల్లో గెలుపొందిన ప్రథమ ద్వితీయ క్రీడాకారులు మ్నొత్తం 39 మంది స్త్రీ పురుషుల అండర్ 15, అండర్ 19 వయస్సు గలవారు సింగిల్,డబుల్ మిక్సుడ్ డబుల్ క్యాటగిరీలలో ఎంపికైన వారితో క్రీడలను హన్మకొండ జేయన్‌యస్ లో నిర్వహించి రాష్ట్ర స్థాయి లో పాల్గొనుటకు విజేతలైన జట్లను ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మెంటన్ షటిల్ కోచ్ కూరపాటి రమేశ్ ఆధ్వర్యంలో , జిల్లా యువజన క్రీడల అధికారి గుగులోతు అశోక్ సారధ్యంలో విజయవంతంగా నిర్వహించారు. వివిద మండలాల నుండి పెద్ద ఎత్తున క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 21న రాష్ట్ర 2వ న్యాయ విద్యార్థుల సదస్సు




**విశ్వంభర, హైదరాబాద్:** అఖిల భారత న్యాయవాదుల సంఘం , భారత న్యాయ విద్యార్థుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 21 న జరిగే రాష్ట్ర 2వ న్యాయ విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలనీ ఏఐఎల్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి మరియు భారత న్యాయ విద్యార్థుల సమాఖ్య కన్వీనర్ హైదర్ అలీ న్యాయ విద్యార్థులకి పిలుపినిచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో బుధవారం, ఉభయ సంఘలా ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేసారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ, యువ ప్రతిభను పెంపొందించాలని, న్యాయవిద్యార్థులు ఎదురుకుంటున్న సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగం ప్రమాదం లో ఉందని, రాజ్యాంగ విలువలని,లౌకికత్తాత్వాన్ని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంను కాపాడుకోవాల్సిన రోజులొచ్చాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్బంగా ఈ నెల 21న పౌరసమాజం రాజ్యాంగం –న్యాయ విద్యార్థుల పాత్ర అనే అంశం పై,బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం లో న్యాయ విద్యార్థుల రాష్ట్ర సదస్సు ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## 'చలో రాజ్ భవన్'లో భాస్కర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చలో రాజ్ భవన్ కార్యక్రమంలో నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్ భవన్ వరకు భారీ ఎత్తున తరలి వెళ్లిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి. ఏఐసీసీ ఇంచార్జ్టీపీసీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ సంఘీభావం



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ఆటో కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి కేటీఆర్ స్వయంగా ఆటో నడుపుతూ ర్యాలీగా అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు. కార్యక్రమంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి , ఎమ్మెల్యేలు ఉన్నారు.

## అసెంబ్లీలో ఇనుగుర్తిపై ప్రస్తావన

మండల మహిళా కాంగ్రెస్ కవిత హర్షం



**విశ్వంభర, ఇనుగుర్తి:** ఇనుగుర్తి మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డా. మురళి నాయక్ అసెంబ్లీలో కోరడం పట్ల మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఒర్రె కవిత హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ప్రజా పోరాటాల ఫలితంగా ఏర్పాటు చేసిన ఇనుగుర్తి మండలాన్ని గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇనుగుర్తి అభివృద్ధి మండల ప్రజల సౌకర్యార్థం కోసం తహసిల్దార్,ఎంపీడీవో,పోలీస్ స్టేషన్ కార్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలని శాసనసభలో సంబంధిత మంత్రులను ఎమ్మెల్యే కోరడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా మురళి నాయక్ కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# నడిగూడెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

- పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**విశ్వంభర, సూర్యాపేట:** పోలీస్ స్టేషన్ తనిఖీలో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ బుధవారం నడిగూడెం పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఎస్పీ కి మునగాల సీఐ రామకృష్ణా రెడ్డి, స్టేషన్ సిబ్బంది స్వాగతం తెలిపినారు. ముందుగా స్టేషన్ అవరనంలో మొక్కలు నాటారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. జిల్లాకు ఇటీవల వచ్చిన నూతన పోలీసు సిబ్బందిని జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లకు కేటాయించడం జరిగినదని అన్నారు. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి పోలీసు సేవలు అందించాలని సూచించారు. అనంతరం స్టేషన్ రికార్డ్స్, పరిసరాలు పరిశీలించి తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ మ్యాప్ ను, గ్రామాల హద్దులను, కేసు ఫైల్స్ ను, కోర్టు వ్యవహారాలు, రిసెప్షన్, కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పరిశీలించారు. ఎన్ఫోర్స్మెంట్ గురించి సమీక్షించారు, రౌడి షిటర్స్, సస్పెక్ట్ పై నిఘా ఉంచాలి ఆదేశించారు. కేసులు, పిర్యాదులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికపపుడు పరిష్కరించాలి అన్నారు. పోలీస్ స్టేషన్ ను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి విషయమును రికార్డుల యందు నమోదు చేయాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే వారిని మర్యాద పూర్వకముగా చూసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు క్షుణ్ణంగా చేయాలి, కొత్త వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలి అన్నారు. సామాజిక అంశాలు దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నివారణ, బాలకార్మిక వ్యవస్థ, సీసీ కెమెరాల ఏర్పాటు మొదలగు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి అన్నారు. ఎస్పీ వెంట మునగాల సీఐ రామకృష్ణా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, మండల ఎస్ఐ అజయ్, డీసీఆర్బీ ఎస్ఐ యాకూబ్, ఎస్పీ సీసీ సందీప్, డీసీఆర్బీ సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి ఉన్నారు.

# వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవు

ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆర్కే పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ లోని కూరగాయల మార్కెట్ ముందు ఫుడ్ పాత్ పై ఏర్పాటుచేసిన పండ్లు కూరగాయల బండ్లను తొలగించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫుట్ పాత్ పై ఎలాంటి పండ్లు కూరగాయల బండ్లను ఏర్పాటు చేస్తే తొలగిస్తామన్నారు. ఫుట్ పాత్ పై అలా బండను ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. సరూర్నగర్ స్టేడియం ముందు కూడా ఉదయం సమయంలో కూరగాయలు విక్రయిస్తున్నారని, మన విక్రయించడం వల్ల వాహనదారులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, వాటిని కూడా ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదన ఇన్స్పెక్టర్ నాగరాజు, ట్రాఫిక్ ఎస్ఐ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదంలో సహకార వ్యవస్థ

చైర్మన్ మోహన్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** సహకార వ్యవస్థ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని తెలంగాణ సహకార్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మనాల మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సహకార యూనియన్ సర్వసభ –సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ సహకార వ్యవస్థ ప్రమాదం లో ఉందని సంఘాలతో కలిసి బలోపేతం లక్ష్యంగా ముందుకుసాగుతామని చెప్పారు. సహకార వ్యవస్థకు ఎంతో చరిత ఉందని, 1925 సంవ్సతరం నుంచే ఈ వ్యవస్థ ఉందని తెలిపారు. సహకార యూనియన్ సహకార సంఘాల యొక్క ఉన్నతి కోసం పాటుపడే సంస్థ అని పేర్కొన్నారు. ఈ సంస్థ ద్వారా సహకార చట్టాలను, సహకార సంఘాల్లో చేసుకునే వ్యాపారాల పై అవగాహ కల్పించే కార్యక్రమాన్ని ముందు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సహకారం యూనియన్ ఎండీ అన్నపూర్ణ, నేషనల్ బ్యాంక్ – ఫెడరేషన్ చైర్మన్ కే.రవీందర్ రావు, మార్కెఫెడ్ చైర్మన ఎం.గంగారెడ్డి, అయిల్ఫెడ్ చైర్మన జె.రాఘవరెడ్డి, నల్గొండ జిల్లా కో– ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, అదిలాబాద్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఇ. బోజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫిలిం డెవలప్మెంట్ చైర్మన్‌గా బుధవారం మాసబ్ ట్యాంక్‌లోని ఐపీఆర్ ఓ కార్యాలయంలో బాధ్యతలు తీసుకుంటున్న దిల్ రాజ్, ఐఎన్పిఆర్ కమిషనర్ డాక్టర్ హరీష్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. – విశ్వంభర, హైదరాబాద్

# సీఎం రేవంత్ రెడ్డిని చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుంది

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు**



**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి రోడ్ల మీద చేస్తున్న సర్కస్ ఫీట్లు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు.మొదటి రోజు శాసనసభకు అదానీ, రేవంత్ అక్రమ సంబంధం మీద నిరసనగా టీషర్ట్స్ వేసుకొని వస్తే అడ్డుకున్నారు. తమను సభా ప్రాంగణంలోకి కూడా అడుగు పెట్టనివ్వలేదు. ఈ రోజు రాజ్ భవన్ వద్ద అదానీ అవినీతి గురించి మాట్లాడినట్లు రేవంత్ సర్కస్ చేసిండు. అక్కడికి వెళ్లి కూడా కేసీఆర్ గురించి, బీఆర్ఎస్ గురించే మాట్లాడిండు తప్ప, అదానీ అవినీతి గురించి మాట్లాడింది తక్కువ. మీ పోరాటం అదానీ మీద అయితే మొదటి రోజు మమ్మల్ని ఎందుకు అసెంబ్లీ రాకుండా అడ్డుకున్నావు. నిరసన తెలిపే అవకాశం కూడా ఎందుకు ఇవ్వలేదు. మేము అడుగుతున్నా ఎందుకు అసెంబ్లీలో చర్చ పెట్టడం లేదు అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు. దావోస్ వెళ్లి అదానీతో రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్లు చేసుకున్నవు. నీకు నిజంగా అదానీ అవినీతి మీద పోరాటం చేయాలనుకుంటే ముందు వెంటనే అగ్రిమెంట్లు రద్దు చేయ్. నీ మాటల్లో నిజాయితీ ఉంటే, వంద కోట్లు వాపస్ ఇచ్చినట్లు రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్ రద్దు చేసుకోవాలి. అగ్రిమెంట్లు రద్దు చేసి నీ చిత్తుశుద్ధిని నిరూపించుకో రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు సవాల్ చేశారు. రామన్నపేటలో డ్రైపోర్టు కోసం ల్యాండ్ ఇస్తే సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చావు. అదానీ కోసం పోలీసులను పెట్టి అరెస్టులు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశావు. పోలీసు పహారా మధ్య పబ్లిక్ హియరింగ్ చేశావు. అదానీకి ఏజెంట్‌గా కొమ్ముకాస్తున్నావు. ప్రజల కోరిక మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. డైవర్షన్ పాలిటిక్స్, సర్కస్ ఫీట్లు తప్ప ఇంకే లేదు. మీ డబుల్ స్టాండర్డ్‌కు నిదర్శనం మీ చిత్తశుద్ధి లేని పోరాటం అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అదానీ దేశ పరువు తీసిండు అని రేవంత్ రాజ్ భవన్ వద్ద అన్నడు. మరి నువ్వు దావోస్ వెళ్లి ఒప్పందాలు చేసుకొని తెలంగాణ పరువు తీశావు. అదానీకి రెడ్ కార్పెట్ వేసి రాష్ట్ర పరువు తీశావు. ఢిల్లీలో పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ పరువును తీశావు.అదానీ, రేవంత్ అక్రమ సంబంధం మీద రేపు అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. నీకు ఆ ధైర్యమే లేదు. అంతర్గతంగా ఒప్పందం మీకు ఉంది. సీఎం రాజ్ భవన్ వద్ద ట్రాఫిక్ జాం చేసిండు. ధర్నాలో పాల్గొన్న అందరి మీద నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కేసులు నమోదు చేయాలి. ధైర్యం ఉంటే, చట్టం అందరికి సమానం అయితే వారి మీద కేసులు పెట్టండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## బుక్ ఫెయిర్ ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాద్ :** పుస్తక పఠనం భావితరాలకు ఆదర్శమని తేజోమదనానికి నిదర్శనమని హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకూబ్ షేక్, అన్నారు. హైదరాబాద్ బుక్ ఫేర్ 37వ సంవత్సరం నేటి నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బుక్ ఫెయిర్ సెక్రెటరీ ఆర్ శ్రీనివాస్ తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. హైదరాబాద్ బుక్ ఫేర్ 37 సంవత్సరాలుగా పుస్తకాలను విస్తృతంగా సమాజంలోకి తీసుకెళుతూ తద్వారా అద్భుతమైన సమాజాన్ని నిర్మించడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. పుస్తకాలను అచ్చు వేయడం అమ్మడం అంటే మిగిలిన అన్ని రంగాల కంటే ఎక్కువగా సమాజ హితం కోరుకునేది అని తెలిపారు. అందువలన ప్రతి ఒక్కరు పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని చిన్న నుంచి పెద్ద వరకు ప్రతి ఒక్కరు పుస్తక జ్ఞానాన్ని అవలంబించుకోవాలన్నారు. ఈ హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో బాల సాహిత్యం నుంచి ఢిల్లీ సాహిత్యం వరకు ఎన్నో పుస్తకాలు అద్భుతమైనటువంటి పునజీవనాన్ని ఇస్తున్నాయని అందుకు ఈ బుక్ ఫెయిర్ దోహదపడుతుందని తెలిపారు. ఇటువంటి బృహత్తరమైన కార్యక్రమానికి అనేక మంది మేధావులు రాష్ట్ర ప్రభుత్వం అండదండలు ఉన్నాయన్నారు. ప్రజల్లోకి మంచి సందేశం తీసుకెళ్లడమే మా ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. 35 సంవత్సరాలుగా అనేక డిగ్రీ కాలేజీలో తెలుగు బోధించిన కవి ని బుక్ ఫెయిర్ అధ్యక్షులుగా నియమించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ బుక్ ఫెయిర్ లో పిల్లలకు పెద్దలకు భాషా ప్రేమికులకు అన్ని రకాల చరిత్రలకు సంబంధించిన పుస్తకాలు లభిస్తాయని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ప్రత్యేక స్టాల్స్ ను ఏర్పాటు చేశామన్నారు. సమాజ హితం కోసం ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరూ మదుకు రావాలని విరివిగా ఈ బుక్ ఫెయిర్ లో భాగస్వామ్యం అవుతూ విస్తృతంగా ప్రచారం చేస్తూ విద్యార్థులను పుస్తకాల వైపు ఆకర్షితులయ్యే విధంగా చేయాలని పుస్తక ప్రాధాన్యత ఔన్నత్యాన్ని వివరించడం మార్గ నిర్దేశం చేయడం చేయాలన్నారు.

## సర్వేల్ గురుకుల పాఠశాలలో కలకలం

**రాగి జావా మీద పడి విద్యార్థికి గాయాలు**



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** మండలం లోని సర్వేల్ గ్రామంలోని సర్వేలు గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిపై రాగిజావ గిన్నె కాలు పై పడడంతో పొక్కులతో తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గత మూడు రోజుల క్రితమే సర్వేలు గురుకులాన్ని జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు జరిగిన పాఠశాల యాజమాన్యం బాధ్యత అని చెప్పి వెళ్లి రెండు రోజులు కాలేదు ఇంతలోనే ఇలాంటి పరిస్థితి నెలకొవడం ఏంటని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు, విద్యార్థులకు పాఠాలు బోధించాలి కానీ ఇలాంటి పనులు చెప్పడం ఏంటని వాపోతున్నారు, తక్షణమే పాఠశాల యజమాన్యంపై ప్రిన్సిపాల్ ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థికి ఇంకా ఏదైనా సమస్య ఎదురైతే ఎవరు బాధ్యత వహిస్తారని కుటుంబ సభ్యులు ఆవేదనకు గురయ్యారు. తక్షణమే గురుకుల పాఠశాల మీద అధికారులు, జిల్లా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఉస్మానియా మెడికల్ కాలేజ్‌పై విద్యాశాఖ టీం విజయం



**విశ్వంభర, బషీర్ బాగ్ :** టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్లో ఉస్మానియా మెడికల్ కాలేజ్ కోటి క్రికెట్ టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో జిల్లా విద్యా శాఖ హైదరాబాద్ క్రికెట్ జట్టు విజయం సాధించింది. విద్యాశాఖ టీం స్కోర్ 10 ఓవర్స్ లో 162 రన్స్, ఉస్మానియా మెడికల్ కాలేజ్ టీం 10 ఓవర్స్ లో 157 రన్స్ చేసింది. 5 రన్స్ తో తేడాతో విద్యాశాఖ టీం విజయం సాధించినట్లు విద్యాశాఖ హైదరాబాద్ టీం కెప్టెన్ కే.ఆర్ రాజ్ కుమార్ తెలిపారు.11వ స్పోర్ట్స్ మీట్ 2025 బుధవారం జరిగింది. టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ప్రెసిడెంట్ జగదీష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ ల మద్దతుతో స్పోర్ట్స్ మీట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, అకీల్, అజరుల్లా ఖాన్, మొహ్సిన్, మహమ్మద్ అజర్, ఇంతియాజ్, ఈ సందర్భంగా ఇర్ఫాన్, అమీర్, ఫెరస్, అంజి, వికమ్, ప్రకాష్, కరుణాకర్, యోగి టీమ్ ప్లేయర్స్ టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ ప్రెసిడెంట్ ఎస్.విక్రమ్ కుమార్, ఉపాధ్యక్షుడుకె. శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఖాలీద్ అహ్మద్, పబ్లిక్ సెక్రటరీ వైదిక్ శాస్త్ర శ్రీధర్, ముఖీద్, టీజీవోస్ యూనియన్ హైదరాబాద్ బి.కృష్ణ యాదవ్, టీఎన్జీవోస్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్, క్రికెట్ టీమ్ కెప్టెన్ కే.ఆర్ రాజ్‌కుమార్, టీమ్ సభ్యులు బాబులూ, చంద్ర శేఖర్ రెడ్డి, పద్మ, సంధ్యారాణి, వనజ, అనిల్, షమీ, పరమేష్, దామోదలర్‌లకు అభినందనలు తెలియజేశారు.

## పీపీ యూనిట్‌ను తనిఖీ చేసిన జిల్లా ఇమ్మునైజేషన్ ఆఫీసర్



**విశ్వంభర, షాద్ నగర్ :** బుధవారం మధ్యాహ్నం రంగారెడ్డి జిల్లా ఇమ్మునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ షెభా, షాద్ నగర్ పి.పి యూనిట్ సెంటర్ ని అకస్మాత్తుగా సందర్శించారు. పీ.పీ యూనిట్లో నీ ఐస్ లయన్డ్ రిఫ్రిజిరేటర్ (ఐ ఎల్ ఆర్) వెరిఫై చేశారు, రిఫ్రిజిరేటర్ లోని అన్ని రకాల వ్యాక్సిన్ లను క్రమ పద్ధతిలో పెట్టారా లేదా అని పరిశీలించారు. వ్యాక్సిన్ స్టాక్ పొసిషన్ ని పరిశీలించారు. టెంపరేచర్ రికార్డ్ బుక్ ని వెరిఫై చేశారు. ఐ ఎల్ ఆర్ ను ఉదయము మరియు సాయంత్రము టెంపరేచర్ ను కచ్చితంగా రికార్డు చేయాలని స్టాఫ్ నర్స్ కి తెలియజేశారు. తరువాత డీ ఫ్రీజర్ లోని ఐస్ పాక్స్ లను ఫ్రోజనుడై ఐస్ అయ్యే విధంగా చూడాలని స్టాఫ్ నర్స్ కి తెలియజేశారు. వ్యాక్సిన్ లో కోసము వచ్చిన గర్భవతులను మరియు పిల్లలను ఎవరిని కూడా వ్యాక్సిన్ వేయకుండా తిరిగి పంపవద్దని ఏ ఎన్ ఎం ని మరియు ఆశలను హెచ్చరించారు.బుధవారం ఎంతమందికి వ్యాక్సిన్ ఇచ్చారు అని ఏఎన్ఎం అడగగా! 47 మందికి వ్యాక్సిన్ ఇవ్వడం జరిగింది అని స్వప్న ఏఎన్ఎం సమాధానం ఇచ్చారు. ఇచ్చిన వ్యాక్సిన్ లను ఎప్పటికప్పుడు ఆన్లైన్ యూ విన్లో అప్డేషన్ చేయాలని తెలియజేశారు.

## ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న వారికి సహకరించాలని వినతి



**విశ్వంభర, బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 63/26 మరియు 63/38 సర్వే నెంబర్లు గల భూమి న్యాయస్థానం పరిధిలో ఉన్నందున స్థానిక అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరుతూ బోడుప్పల్ గౌతమ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు, ఆర్డీవో కు, బోడుప్పల్ కార్పొరేషన్ కమిషనర్ కు బుధవారం వారి వారి కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు గౌతమ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం వారు మాట్లాడుతూ తెలిసి తెలియక విక్రయాలు చేసి ఇంటి నిర్మాణాలు చేసుకున్న ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వారికి న్యాయం చేయాలని ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు ఎండి.గఫర్, అధ్యక్షులు భూపతి సారయ్య, ప్రధాన కార్యదర్శి ఈ. ముత్యాలు,వెంకటేష్, రవికుమార్ తదితరులు అధికారులను కలిసి సర్వేనెంబర్ లో ఉన్నటువంటి స్థాల వివాదం రిట్ పిటిషన్ నెంబర్ 1156/2023 ప్రకారం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో పెండింగ్లో ఉందని వివరించారు. సదురు సర్వే నెంబర్ లోని స్థలంలో చట్ట ప్రకారం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్న వారు దాదాపు 306 మంది సభ్యులు ఉన్న తమ కాలనీ వాసులకు అధికార యంత్రాంగం తరచూ ఇబ్బందులకు గురి చేస్తూ ఆందోళన పెడుతున్నరు అని తెలిపారు. కేసు కోర్టులో ఉన్నందున ఆర్డీవో తహసిల్దారు ఈ వ్యవహారంతో జోక్యం చేసుకోకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కు మిగతా అధికారులకు వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

## దేశ ప్రజలు బీజేపీని ఆశీర్వదిస్తున్నారు

**గౌతమ్ రావు**



**విశ్వంభర , హైదరాబాద్:** దేశ ప్రజలు ఇవాళ బీజేపీని ఆశీర్వదిస్తున్నారని, ఆ దిశగా పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు మరింత కృషి చేయాలని బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులుగౌతమ్ రావు అన్నారు . భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చెయ్యడమే లక్ష్యంగా మనం పని చెయ్యాలని కార్యకర్తలకు పలు సూచనలు చేసారు. అనంతరం బీజేపీ నగర కార్యాలయంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు అధ్యక్షతన జిల్లా వర్క్ షాప్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలోని ప్రతి బూత్ లో పార్టీ బలమైన శక్తిగా అవతరించాలని ఆయన కోరారు. సిద్ధాంతాల ఆధారంగా బీజేపీ పని చేస్తున్నందుకే దేశ ప్రజలు ఇవాళ బీజేపీని ఆశీర్వదిస్తున్నారని గౌతమ్ రావు స్పష్టం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు , రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఇచ్చిన గడవులోపే బూత్ కమిటీలను పూర్తి చెయ్యాలని ఆయన వ్యాఖ్యానించారు. జిల్లాలో అత్యధిక సంఖ్యలో క్రియాశీల సభ్యులు అవతరించాలని ఆయన అన్నారు.

## ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

**జస్టిస్ చంద్రకుమార్**



**విశ్వంభర, హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు అమలు అంశంపై పి.డి.ఎస్.యూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షోయబ్ హాల్ నందు పి.డి.ఎస్.యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ కి ముఖ్య వక్తలుగా జస్టిస్ చంద్రకుమార్ గారు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం పి.ఓ.డబ్ల్యు జాతీయ కాంగ్రెస్ సంధ్య, రైతు స్వరాజ వేదిక కనగంటి రవి హాజరై మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంశంపై పాలకవర్గాలు రెండు ప్రధానమైన సమూహాల మధ్య వైరుధ్యాన్ని పెంచి పోషించే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ అంటే మాదిగ, మాల సామాజిక వర్గాల సమస్యగా చూస్తున్నారని కానీ ఇది మిగిలిన 57 ఉపకులాల సమస్య అనే విషయాన్ని మరుస్తున్నారని తెలియజేశారు. తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన విధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లుపై ముసాయిదాను ప్రవేశపెట్టి అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రపతి ఆమోదంతో పార్లమెంటులో చట్టం చేసి అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న ఉద్యోగ ప్రకటనలో ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



**విశ్వంభర, మీర్ పేట్ :** విద్యాటౌన్ కాలనిలో సమస్యలు లేకుండా పరిష్కరిస్తున్నట్లు టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ 20వ డివిజన్ లోని శ్రీ విద్యాటౌన్ కాలనిలో సిసి రోడ్డు నిర్మాణం పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి, నాయకులు పన్నాల రాజేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సమరసింహ రెడ్డి, మనోహర్, గోపాల్, మిట్టు కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ కార్మికుల కేటగిరి మార్పు చేయకుంటే ఉద్యమమే



**విశ్వంభర, హైదరాబాద్ :** వాటర్‌వర్క్స్ లో పని చేసే ఔట్ సోర్సింగ్ కార్మికుల గత జి ఓ మార్చిన సందర్భంగా మిగిలిపోయిన వారందరిని కేటగిరి మార్చి జీవితాలు పెంచాలని , ఇతర సమస్యలు పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షుడు నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. నేడు హెచ్ ఎండబ్ల్యుఎస్ఎస్బి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశం బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు నారాయణ గారు మాట్లాడుతు వాటర్‌వర్క్స్ లో పనీ చేసే ఔట్ సోర్సింగ్ కార్మికులు చాలీ, చాలనీ వేతనాలు 13,500/-లతో హైదరాబాద్ నగరంలో బ్రతకడం చాలా కష్టం కనుకనే గత 2023 ఆగస్టు లో జి, ఓ 60 ధ్వారా వేతనాలు పెంచిన సందర్భంగా కేతగిరి 2 లో చేర్చాల్సిన కార్మికులను కేటగిరి 1 లో చేర్చడం ద్వారా ప్రతి కార్మికునికి నెలకు 4000/- నష్టపోతున్నారు. కనుక అధికారుల తప్పిధాన్ని సరిదిద్ది కేటగిరి మార్చి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థుల మేధో వికాసానికి ప్రతిభా పరీక్షలు



**విశ్వంభర, నకిరేకల్:** విద్యార్థుల మేధో వికాసానికి ప్రతిభా పరీక్షలు ఎంతగానో దోహదం చేస్తాయని నకిరేకల్ మండల విద్యాధికారి మేక నాగయ్య అన్నారు. బుధవారం తాటికల్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ విద్యార్థులకు అకాడమిక్ సపోర్ట్ ఇవ్వడానికి సబ్జెక్టు ఫోరమ్స్ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. విద్యార్థులు ప్రతిభా పరీక్షలో రాణించి జిల్లా రాష్ట్రస్థాయిలో పాల్గొని ప్రతిభ కనపరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు లొట్లపల్లి కోటయ్య, ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అందెల



**విశ్వంభర, మీర్ పెట్ :** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ 31వ డివిజన్ బాలాజీ నగర్ లో ముదిగొండ లక్ష్మి ఇంట్లో విద్యుత్ షాక్ తో ఇల్లు దగ్ధం అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాముల యాదవ్ సంఘటన స్థలానికి చేరుకొని దగ్ధమైన ఇల్లును సందర్శించారు. అనంతరం శ్రీరాములు బాధిత లక్ష్మీ ని పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా నాయకులు, బడంగ్ పేట్ గ్రామ మాజీ సర్పంచ్ నడికుడ యాదగిరి, బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు శ్రవణ్ కుమార్ యాదవ్, రాజ్ కుమార్, సతీష్ స్థానికులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం



## యూఎన్‌వోలో ప్రసంగించనున్న శ్రీశ్రీ రవిశంకర్

**బెంగ ళూరు:** డిసెంబర్ 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవం గా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 21న మొట్టమొదటి ధ్యాన దినోత్సవం జరగనుంది. ప్రఖ్యాత ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ ఆ రోజున ఐరాస నుంచి ధ్యాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. మనిషి శారీరక, మానసిక ఆరోగ్యంలో గుణాత్మకమైన మార్పును తెచ్చి.. తద్వారా ప్రపంచ శాంతి, సామరస్యాలను నెలకొల్పేందుకు ధ్యానం ఎంత అవసరమో ప్రపంచం గుర్తించినట్లయిందన్నారు. మరోవైపు, న్యూయార్క్‌లోని ఐరాసలో ఉన్న భారత శాశ్వత మిషన్ ప్రథమ ధ్యాన దినోత్సవాన్ని సమితి ప్రధాన కార్యాలయంలో ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమంలో గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ కీలకోపన్యాసం అనంతరం ప్రపంచ శాంతి, సామరస్యం కోసం ధ్యానం చేయించనున్నారు. ఈ కార్యక్రమం ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఐరాస ద్వారా ధ్యానానికి గుర్తింపు రావడం ఓ ప్రధాన ఘట్టమని గురుదేవ్ అన్నారు. 'ధ్యానం ఆత్మను పరిపోషిస్తుంది. మనస్సుకు ప్రశాంతతను చేకూర్చి.. నేటి ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారం అందించగలదు' అన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించడంలో, సంఘర్షణలకు పరిష్కారం చూపడంలో చేస్తున్న కృషిపై గురుదేవ్ ఐరాసలోని ఉన్నతస్థాయి వ్యక్తులు, దౌత్యవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులు, ప్రపంచ ప్రముఖులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

**ప్రపంచ ధ్యాన దినోత్సవం ఎందుకు ముఖ్యం?**

ఐరాస సాధారణ సభ ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడమంటే.. నేటి ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే సామర్థ్యం ధ్యానానికి ఉందని నిశ్చయంగా గుర్తించడమే. జీవితంలో పెరుగుతున్న ఒత్తిడి, హింస, సమాజంలో క్షీణిస్తున్న విశ్వాసం, పరస్పర సంబంధాలు ఇవన్నీ ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలు. వీటికి ధ్యానం సమగ్రమైన పరిష్కారాన్ని చూపగలదు. ధ్యానానికి గల అద్భుత ప్రయోజనాలను ప్రపంచవ్యాప్తం చేసేందుకు గత 43 ఏళ్లు గురుదేవ్ తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన కృషి ఫలితంగా ఈరోజు 180 దేశాలకు ధ్యానం వ్యాపించింది. మనసుకు స్పష్టతను చేకూర్చి భావావేశాల ఆటుపోట్లను తట్టుకునే శక్తిని ఇవ్వటం ద్వారా ధ్యానం సామాజిక సామరస్యాన్ని పెంపొందించగలదని గురుదేవ్ ప్రగాఢ విశ్వాసం. ధ్యానానికి ఉన్న ఈ పరివర్తనా శక్తిపై గురుదేవులకు గల నమ్మకమే ఆయన ప్రపంచవ్యాప్తంగా అనేక సంఘర్షణలలో చేపట్టిన శాంతి ప్రయత్నాలలో స్పష్టంగా కనిపిస్తుంది. గురుదేవ్ శ్రీలంక, ఇరాక్, వెనిజువెలా, కొలంబియా వంటి సంఘర్షణాత్మక ప్రాంతాలలో శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహించారు. కొలంబియాలోని ఫార్క్ దళాలకు, ప్రభుత్వానికి మధ్య సాగిన 52ఏళ్ల సుదీర్ఘ సంఘర్షణను అంతమొందించటంలో కీలక పాత్ర పోషించిన ఘనత ఆయనది. విభిన్న సమాజాల మధ్య చర్చలను, పరస్పర సానుకూల అవగాహనను పెంపొందించేందుకు గురుదేవ్ అనుసరించే ముఖ్య విధానం ధ్యానం. అత్యంత కఠిన పరిస్థితులలో సైతం ధ్యానం అనేది స్పష్టతను, కారుణ్యభావాన్ని, ఇచ్చిపుచ్చుకునే మనస్తత్వాన్ని ఎలా పెంపొందిస్తుందో ఇది మనకు సుస్పష్టంగా చూపుతుంది. ధ్యానం మనస్సును ప్రశాంతంగా ఉంచడమే కాకుండా, ఒక ఉన్నతమైన విశాలదృక్పథాన్ని కూడా అందిస్తుంది. మనసులో పాతుకుపోయిన భేదభావాలను అధిగమించి శాశ్వతమైన శాంతివైపు పురోగమించేందుకు ఆ నాయకులకు, సంఘాలకు ఊతగా నిలుస్తుందని గురుదేవ్ దృఢంగా చెబుతుంటారు. భౌగోళిక రాజకీయ వైరుధ్యాల నుంచి వ్యక్తిగత సంక్షోభాల వరకు, జాతీయత, సంస్కృతి, విశ్వాసాల సరిహద్దులను అధిగమించి, సార్వత్రిక పరిష్కారాన్ని ధ్యానం అందిస్తుంది. బాహ్యంగా చేసే పనులతో అంతర్గతమైన శాంతిని సమన్వయం చేయడం ద్వారా, ధ్యానం ప్రపంచ శాంతికోసం జరిగే ప్రయత్నాలకు దీపస్తంభంగా పనిచేస్తుంది.

# 'జమిలి'పై జేపీసీ ఏర్పాటు చేసిన కేంద్రం

### 31మంది ఎంపీల పేర్లతో జాబితా!



**దిల్లీ:** జమిలి ఎన్నికల బిల్లుల్ని జేపీసీకి పంపేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. ఈ బిల్లుల పరిశీలనకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసింది. పలు పార్టీలకు చెందిన మొత్తం 31మంది ఎంపీలతో జేపీసీ ఏర్పాటుకు జాబితాను తయారు చేసింది. ఇందులో 21 మంది లోక్‌సభ ఎంపీలు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. జేపీసీ ప్రతిపాదనకు సంబంధించిన తీర్మానాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.

**జేపీసీలో సభ్యులు వీరే..!**

జేపీసీ ఏర్పాటుకు సంబంధించి గురువారం సభలో ప్రవేశ పెట్టే జాబితాలో 21 మంది లోక్‌సభ సభ్యులను జాబితాలో పేర్కొంది. వీరిలో పీపీ చౌదరి, సీఎం రమేశ్, బాన్సురీ స్వరాజ్, పురుషోత్తమ్ రూపాలా, అనురాగ్ ఠాకూర్, విష్ణు దయాళ్‌రామ్, భర్తృహరి మహ్తాబ్, సంబిత్ పాత్రా, అనిల్ బలూనీ, విష్ణుదత్ శర్మ, ప్రియాంకా గాంధీ వాద్రా, మనీష్ తివారీ, సుఖదేవ్ భగత్, ధర్మేంద్ర యాదవ్, కల్యాణ్ బెనర్జీ, టీఎం సెల్వ గణపతి, జీఎం హరీశ్ బాలయోగి, సుప్రియా సూలే, శ్రీకాంత్ శిందే, చందన్ చౌహాన్, వల్లభనేని బాలశౌరి ఉన్నారు. వీరితో పాటు రాజ్యసభ నుంచి 10 మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు. రాజ్యసభ సభ్యుల పేర్లను ఎంపిక చేసిన అనంతరం కమిటీ ఛైర్మన్ పేరును ఖరారు చేయనున్నారు. మరోవైపు, జేపీసీ ఛైర్మన్‌గా కేంద్ర మాజీ సహాయమంత్రి పీపీ చౌదరి ఉండే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ బరిలో అనురాగ్ ఠాకూర్ పేరు కూడా వినబడుతోంది. నిబంధనల ప్రకారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. జేపీసీలో 21మంది లోక్‌సభ సభ్యులకు గాను 14మంది ఎన్డీయే నుంచి ఉండగా.. వీరిలో 10మంది భాజపాకు చెందినవారే ఉన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల చివరివారంలో ఈ కమిటీ నివేదిక సమర్పించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దేశంలో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఓటింగ్ ప్రక్రియ ద్వారా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ బిల్లును సభ ముందుకు తీసుకొచ్చారు. 90 నిమిషాల చర్చ అనంతరం ఓటింగ్ జరగ్గా బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 269 మంది, వ్యతిరేకంగా 198 మంది ఓటేశారు. దీంతో బిల్లును ప్రవేశపెట్టడానికి స్పీకర్ ఓం బిర్లా ఆమోద ముద్ర వేశారు. అయితే ఈ బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా కేంద్రం నియంతృత్వంగా వ్యవహరించిందని ప్రతిపక్షాలు ధ్వజమెత్తగా.. కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున సంయుక్త పార్లమెంటరీ కమిటీకి (జేపీసీ) పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అధికార పక్షం మాత్రం ఈ బిల్లు రాజ్యాంగ మూల స్వరూపానికి ఏమాత్రం భిన్నంగా లేదని స్పష్టం చేస్తూనే.. అన్ని పక్షాలూ దీనిపై విస్తృత చర్చ కోరుతున్నందున జేపీసీకి పంపడానికి తమకేమీ అభ్యంతరం లేదని పేర్కొన్న విషయం తెలిసిందే.




## అమిత్‌షాను కేబినెట్ నుంచి తొలగించాలి: ఖర్గే డిమాండ్

**దిల్లీ:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఆయన్ను అవమానించడమేనంటూ విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తంచేస్తున్నాయి. ఈ వ్యవహారంపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీపై విమర్శలు చేశారు. అమిత్ షాను కేబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ''వారికి రాజ్యాంగంపై నమ్మకం లేదు. వారు మనుస్మృతి గురించి మాట్లాడుతుంటారు. అమిత్‌షాకు మద్దతుగా పీఎం మోదీ ఆరు పోస్టులు పెట్టారు. అందులో అంత అవసరం ఏముంది? ఎవరైనా అంబేడ్కర్ గురించి తప్పుగా మాట్లాడితే.. అలాంటి వ్యక్తిని కేబినెట్ నుంచి తొలగించాలి. కానీ వారిద్దరు స్నేహితులు. ఒకరి పాపాలకు మరొకరు మద్దతు ఇస్తున్నారు'' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా దేశానికి క్షమాపణలు చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే.. అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ మిత్ర పక్షం డీఎంకే స్పందించింది. ఆ పార్టీ అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ''ఎక్కువ పాపాలు చేసేవారు మాత్రమే పుణ్యం గురించి ఆలోచించాలి. దేశం, ప్రజలు, రాజ్యాంగ పరిరక్షణ గురించి ఆలోచించేవారు అంబేడ్కర్ పేరు మాత్రమే ఉచ్చరిస్తారు'' అని అన్నారు.కాగా.. అమిత్ షాకు వ్యతిరేకంగా విమర్శలు వస్తోన్న వేళ ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా వరుస పోస్టులు పెట్టారు. అంబేడ్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు షెడ్యూల్ కులాలు, తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసిందో ప్రజలంతా చూశారని పేర్కొన్నారు. ''మనం ఇలా ఉండటానికి అంబేడ్కరే కారణం.

## కాంగ్రెస్ అంబేడ్కర్ వ్యతిరేకి.. నా వ్యాఖ్యల్ని వక్రీకరించింది: అమిత్ షా



**దిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌కు వ్యతిరేకమని, రాజ్యసభలో నిన్న తాను చేసిన వ్యాఖ్యల్ని వక్రీకరించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. కాంగ్రెస్ దేశంలో అవాస్తవాలను వ్యాప్తి-చేస్తోందని ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశం సహించదంటూ కాంగ్రెస్ సహా పలు విపక్షాలు మండిపడుతున్న వేళ ఆయన దిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా తాను మాట్లాడలేదని.. పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించిన తీరును ఖండిస్తున్నట్లు అమిత్ షా చెప్పారు.'కాంగ్రెస్ అంబేడ్కర్ వ్యతిరేకి, రిజర్వేషన్ల వ్యతిరేకి, రాజ్యాంగ వ్యతిరేక పార్టీ. కాంగ్రెస్ ఏనాడూ అంబేడ్కర్ స్మారకాన్ని నిర్మించలేదు. భాజపా ప్రభుత్వం అంబేడ్కర్‌ను ఎంతో గౌరవించింది. కాంగ్రెస్ పార్టీ నా వ్యాఖ్యల్ని వక్రీకరించింది. నేను ఎన్నడూ అంబేడ్కర్‌ని అవమానించని పార్టీ నుంచి వచ్చా. ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టంగా ఉన్న నా ప్రసంగం రాజ్యసభ రికార్డుల్లో ఉంది. కలలో కూడా అంబేడ్కర్ ఆలోచలను అవమానించలేని పార్టీ, సిద్ధాంతం నుంచి వచ్చా. రాజ్యసభలో నా పూర్తి ప్రసంగాన్ని ప్రజలకు మీడియా చూపించాలి. నేను రాజీనామా చేస్తే ఖర్గే జీ సంతోషపడతారంటే.. అలాగే చేస్తాను. కానీ మరో 15 ఏళ్లు వారు ప్రతిపక్షంలోనే ఉండాలి. నా రాజీనామా దాన్ని మార్చలేదు'' అని అమిత్ షా అన్నారు.

## విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలనే కసి సీఎంలో కనిపిస్తోంది



### ఎమ్మెల్యే కూనంనేని

**విశ్వంభర,హైదరాబాద్:** ఏ ప్రభుత్వానికైనా విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉంటుందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యాలయాలను బాగు చేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మొదట్లో ఉండేదని.. ఆ తరువాత ఆయన అంచనాలు మారిపోయాయన్నారు. విద్యాలయాలు, వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనపై అసెంబ్లీలో జరిగిన స్వల్పకాల చర్చలో పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. ''విద్యా రంగాన్ని ప్రక్షాళన చేయాలనే కసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో కనిపిస్తోంది. స్కిల్స్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు నిర్ణయాలతో ఆ విషయం స్పష్టం అవుతోంది. అయితే, ముఖ్యమంత్రి ఒక్కరికే ఆ తపన ఉంటే సరిపోదు. పైనుంచి కింది స్థాయి వరకు ఆచరించాలి. ప్రభుత్వ విధానాల వల్ల ఉపాధ్యాయులు సంతోషంగా లేరు. పాఠశాల విద్యకు సంబంధించి 20వేల వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్వ శిక్షా అభియాన్ వాళ్లకు కనీస వేతనం అమలు చేయడం లేదు'' అని కూనంనేని పేర్కొన్నారు. ''ప్రజలు తమ ఏడాది సంపాదనలో విద్య, వైద్యానికే 90శాతం ఖర్చు చేస్తున్నారు. పేదవాళ్లు మరింత పేదవాళ్లవుతున్నారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలలను గత ప్రభుత్వం పదేళ్లపాటు నిర్లక్ష్యం చేసింది. నాణ్యమైన విద్యను అందించకపోగా బర్రెలు, గొర్రెలు కాసేలా ప్రేరేపించారు. పేదవాడు విద్యకు దూరం కావాలని కేసీఆర్ ప్రభుత్వం కుట్ర చేసింది'' - ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్

''ఏడాది కాలంలో వెయ్యి మంది గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. 40 మంది విద్యార్థులు చనిపోయారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ పెరిగిపోతున్నాయి'' - బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్





## విజయ్ దేవరకొండ సినిమా అంటే ఇష్టం : గుకేశ్

**క్రీడావిభాగం :** ఇటీవల భారత యువ ప్లేయర్ డి గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. అతి పిన్న వయసులోనే (18 ఏళ్లు) ఈ ఘనతను సాధించిన ఆటగాడిగా రికార్డుకు ఎక్కాడు. దీంతో అతడిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అతడు తన ఇష్టాయిష్టాలు, అభిరుచుల గురించి మాట్లాడాడు. ఇందులో భాగంగా వీలు కుదిరినప్పుడు తాను సినిమాలు చూస్తుంటానని చెప్పాడు. తనకు ఇష్టమైన చిత్రాల గురించి తెలిపాడు.

"అప్పుడప్పుడు సినిమాలు చూస్తుంటాను. ఇష్టమైన మూవీస్ చాలానే ఉన్నాయి. తెలుగులో విజయ్ దేవరకొండ నటించిన గీత గోవిందం అంటే చాలా ఇష్టం. తమిళంలో సూర్య నటించిన వారణం ఆయిరం (సూర్య సన్నాఫ్ కృష్ణన్ తెలుగు టైటిల్) చాలా బాగుంటుంది. హిందీలో ఆమిర్ ఖాన్ మూవీ జిందగీ నా మిలేగీ దోబారా కూడా ఇష్టం. హాలీవుడ్‌లో అయితే అబౌట్ టైమ్ ఇష్టం." అని గుకేశ్ పేర్కొన్నాడు. ప్రస్తుతం గుకేశ్ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే విజయ్ దేవరకొండ సినిమా గురించి గుకేశ్ మాట్లాడటంతో హీరో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాగా, చెన్నైకు చెందిన గుకేశ్, చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించి చెస్ ఛాంపియన్‌గా టైటిల్ అందుకున్నాడు. "'ప్రపంచ ఛాంపియన్‌షిప్ అంటే కేవలం చెస్ మాత్రమే కాదు. ఎంతో మానసిక, భావోద్వేగ ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో ప్యాడీ ఆప్టన్ (మెంటల్ కండీషనింగ్ కోచ్) పాఠాలు చాలా బాగా సాయపడ్డాయి. ఆ సూచనలు, అతనితో చర్చలు ఓ ప్లేయర్‌గా నా పురోగతికి బాటలు వేశాయి" అని రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

## వెస్టిండీస్ గడ్డపై సిరీస్ గెలిచిన బంగ్లాదేశ్

**క్రీడావిభాగం :** వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను బంగ్లాదేశ్ మరో మ్యాచ్ మిగిలుండగానే 20 తేడాతో కైవసం చేసుకుంది. భారతకాలమానం ప్రకారం బుధవారం ఉదయం జరిగిన రెండో టీ20లో బంగ్లాదేశ్ 27 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. బంగ్లా ఇన్నింగ్స్‌లో షమీమ్ హొస్సేన్ (17 బంతుల్లో 35 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. షమీమ్ మెరుపు ఇన్నింగ్స్ ఆడకపోయుంటే బంగ్లాదేశ్ ఈ మాత్రం స్కోరైనా చేయలేకపోయేది. మెహిది హసన్ మిరాజ్ (26), జాకిర్ అలీ (21), మెహిది హసన్ (11), సౌమ్య సర్కార్ (11) రెండంకెల స్కోర్లు చేశారు. విండీస్ బౌలర్లలో మోటీ 2, అకీల్ హొసేన్, రోస్టన్ ఛేజ్, అల్జారీ జోసఫ్, ఓబెద్ మెక్‌కాయ్ తలో వికెట్ పడగొట్టారు.

130 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన వెస్టిండీస్.. బంగ్లా బౌలర్లు మూకుమ్మడిగా రాణించడంతో 18.3 ఓవర్లలో 102 పరుగులకు ఆలౌటైంది. తస్కిన్ అహ్మద్ 3, మెహిది హసన్, తంజిమ్ హసన్ సకీబ్, రిషద్ హొసేన్ తలో 2, హసన్ మహమూద్ ఓ వికెట్ తీసి విండీస్‌ను దెబ్బకొట్టారు. బంగ్లా బౌలర్లు స్వల్ప లక్ష్యాన్ని విజయవంతంగా కాపాడుకుని ఔరా అనిపించారు.

విండీస్ ఇన్నింగ్స్‌లో రోస్టన్ ఛేజ్ (32), అకీల్ హొసేన్ (31), జాన్సన్ ఛార్లెస్ (14) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. బంగ్లాదేశ్‌కు వెస్టిండీస్‌పై ఆరేళ్ల తర్వాత తొలి సిరీస్ విజయం ఇది. బంగ్లాదేశ్ చివరిసారి 2018లో వెస్టిండీస్‌పై టీ20 సిరీస్ విక్టరీ సాధించింది. బంగ్లాదేశ్.. వెస్టిండీస్‌ను వారి సొంతగడ్డపై చిత్తు చేయడం విశేషం. ఇరు జట్ల మధ్య నామమాత్రపు మూడో టీ20 డిసెంబర్ 19న జరుగనుంది.




# ఆసీస్, భారత్ మూడో టెస్ట్ డ్రా

**బ్రిస్బేన్ :** ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టెస్ట్‌ను టీమిండియా డ్రా చేసుకుంది. టెయిలెండర్ల అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో ఫాలో ఆన్ తప్పించుకున్న టీమిండియా.. వరణుడి సాయంతో ఈ మ్యాచ్‌లో ఓటమిని తప్పించుకుంది. ఈ సిరీస్‌కు కీలకమైన ఈ మ్యాచ్ డ్రా కావడంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు ఎలా ఉంటాయనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో సౌతాఫ్రికా(63.33 శాతం) అగ్రస్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా(58.89 శాతం), భారత్(55.88 శాతం) రెండు మూడు స్థానాల్లో కొనసాగుతున్నాయి. గబ్బా టెస్ట్‌లో భారత ఓడి ఉంటే పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. డ్రాతో గట్టెక్కడంతో టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ అవకాశాలు సజీవంగా ఉన్నాయి. ఆస్ట్రేలియాతో నాలుగో టెస్ట్ టెస్ట్ మెల్‌బోర్న్ వేదికగా డిసెంబర్ 26 నుంచి ప్రారంభం కానుంది. ఐదో టెస్ట్ జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా జరగనుంది.




**3-1తో గెలిస్తేనే ఫైనల్ బెర్త్..**

ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్‌లకు రెండు భారత్ గెలిస్తే 31తో సిరీస్ కైవసం అవుతోంది. అప్పుడు ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుకుంటుంది.

### డబ్ల్యూటీసీలో ఇంకా ఛాన్స్ ఉందా?

**2-1తో గెలిస్తే..**

ఒకవేళ చివరి రెండు మ్యాచ్‌ల్లో ఒకటి డ్రా చేసుకొని 21తో సిరీస్ కైవసం చేసుకుంటే మాత్రం ఇతర సిరీస్ ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. ముఖ్యంగా శ్రీలంక వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్ ఫలితం భారత అవకాశాలను శాసిస్తోంది. ఈ సిరీస్‌ను శ్రీలంక 10తో గెలవడం లేదా 11తో సమం చేసుకుంటేనే భారత్‌కు డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ దక్కుతోంది.

**2-2తో సమం చేసుకుంటే..**

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని భారత్ 22తో సమం చేసుకుంటే అప్పుడు టీమిండియా పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. శ్రీలంక 20తో ఆసీస్‌ను క్లీన్ స్వీప్ చేయాల్సి ఉంటుంది. లేదంటే పాకిస్థాన్ 20తో సౌతాఫ్రికాను ఓడించాల్సి ఉంటుంది.

# అశ్విన్ రిటైర్మెంట్ వెనుక పలు కారణాలు

**విశ్వంభర, క్రీడావిభాగం :** టీమిండియా వెటరన్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన రిటైర్మెంట్ నిర్ణయంతో బిగ్ షాక్ ఇచ్చాడు. ఫామ్ లో ఉన్న ఈ ఆఫ్ స్పిన్నర్ సడన్ గా ఎందుకు అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడనే విషయం సస్పెన్స్ గానే ఉంది. బ్రిస్బేన్‌లో బుధవారం( డిసెంబర్ 18) బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో భాగంగా మూడో టెస్ట్ ముగిసిన తర్వాత అశ్విన్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత పక్కనే ఉన్న కోహ్లీని హత్తుకొని ఎమోషనల్ అయ్యాడు.

క్రికెట్ లో అశ్విన్ కు చాలా తెలివైనవాడని పేరుంది. అతన్ని క్రికెట్ లో సైంటిస్ట్ తో పోలుస్తారు. ఫామ్ లో ఉన్న అశ్విన్ గుడ్ బై చెప్పడానికి కారణం లేకపోలేదు. ప్రస్తుతం భారత క్రికెట్ యంగ్ ప్లేయర్లపై దృష్టి పెడుతుంది. సీనియర్లను పక్కన పెట్టే ఆలోచనలో ఉంది. పుజారా, రహానే దేశవాళీ క్రికెట్ లో పరుగుల వరద పారిస్తున్న వారిని సెలక్టర్లు పట్టించుకోవడం లేదు. యువ ఆటగాళ్లను ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో సీనియర్లకు చెక్ పెడుతున్నారు. ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న రోహిత్, కోహ్లీకి బీసీసీఐ షాక్ ఇచ్చినా ఆశ్చర్యం లేదు. ఈ విషయాన్ని అశ్విన్ ముందుగానే గ్రహించినట్టు ఉన్నాడు. తనను జట్టులో నుంచి సెలక్టర్లు తీసివేయకుండా ముందుగానే తప్పుకోవడం బెటర్ అని భావించి ఉన్నాడు. ప్రస్తుతం అశ్విన్ టెస్ట్ క్రికెట్ మాత్రమే ఆడుతున్నాడు. ఒకవేళ విదేశీ పర్యటన అయితే అతనికి జట్టులో స్థానం దక్కడం లేదు. స్వదేశంలో రెగ్యులర్ గా ఆడుతున్నా కుల్దీప్ యాదవ్, సుందర్, జడేజా, అక్షర్ పటేల్ లాంటి స్పిన్నర్లు అశ్విన్ కు గట్టి పోటీ ఇస్తున్నారు. ఒకవేళ అశ్విన్ ఏదైనా సిరీస్ లో విఫలమైతే అతన్ని టెస్ట్ జట్టులో వేటు తప్పదు.




అశ్విన్ ఇప్పటివరకు భారత్ తరపున 106 టెస్టుల్లో 200 ఇన్నింగ్స్ ల్లో బౌలింగ్ చేశాడు. 537 వికెట్లు తీసి భారత్ తరపున టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన రెండో ఆటగాడిగా నిలిచాడు. బ్యాటింగ్ లోనూ మెరిసి 3503 పరుగులు చేశాడు. ఇందులో ఆరు సెంచరీలు ఉన్నాయి. 116 వన్డేల్లో 156 వికెట్లు.. 65 టీ20ల్లో 72 వికెట్లు పడగొట్టాడు. అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించినా ఐపీఎల్ లో అశ్విన్ ఆడతాడు. అతను 2025 ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడనున్నాడు.

# రోహిత్ స్వార్థం లేని కెప్టెన్ : గవాస్కర్

**విశ్వంభర, క్రీడావిభాగం :** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు టైమ్ బాగున్నట్టు లేదు. కెప్టెన్ గా, బ్యాట్స్ మెన్ గా తన స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోతున్నాడు. సొంత గడ్డపై న్యూజిలాండ్ తో జరిగిన సిరీస్ లో టీమిండియా వైట్ వాష్ కు గురయింది. ఇప్పుడు ఆస్ట్రేలియాతో జరుగుతున్న సిరీస్ లో కూడా రోహిత్ విఫలమవుతున్నాడు. దీంతో, కెప్టెన్ గా రోహిత్ శర్మను తొలగించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియాతో చివరి రెండు టెస్టుల్లో పరుగులు రాబట్టేందుకు రోహిత్ శర్మ కచ్చితంగా ప్రయత్నం చేస్తాడని ఆయన చెప్పారు. ఒకవేళ మళ్లీ విఫలమయితే తనకు తానుగా కెప్టెన్సీ నుంచి రోహిత్ తప్పుకుంటాడని అన్నారు. స్వార్థం లేనటువంటి కెప్టెన్ రోహిత్ అని... జట్టుకు భారంగా ఉండాలని ఆయన కోరుకోడని చెప్పారు.



## బుమ్రా భాయ్.. నేను గూగుల్ చేశా

**- ఆసక్తికర కామెంట్స్ చేసిన సుందర్ పిచాయ్..**





**క్రీడావిభాగం :** ఆస్ట్రేలియా, భారత్ ల మధ్య గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో బంతితో అదరగొడుతున్న టీమ్ఇండియా పేసుగుర్రం జస్ప్రీత్ బుమ్రా .. అటు బ్యాట్‌తోనూ ఆకట్టుకుంటున్నాడు. అయితే తన బ్యాటింగ్ గురించి తెలుసుకోవాలంటే 'గూగుల్‌లో వెతకండి' అంటూ ఇటీవల అతడు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పందించారు. తాను గూగుల్ చేశానని అన్నారు. ఈసందర్భంగా భారత బౌలర్‌పై ప్రశంసలు కురిపించారు. అసలేం జరిగిందంటే..

మూడో టెస్టు మూడోరోజు ఆట ముగిసిన తర్వాత బుమ్రా విలేకరులతో మాట్లాడాడు. ఈసందర్భంగా గబ్బాలో బ్యాటింగ్ పరిస్థితుల గురించి ఓ రిపోర్టర్ అతడిని ప్రశ్నించారు. దీనికి ఈ సీనియర్ పేసర్ స్పందిస్తూ.. "మీరు నా బ్యాటింగ్ సామర్థ్యాన్ని ప్రశ్నిస్తున్నారు. టెస్టుల్లో ఒక ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసింది ఎవరో గూగుల్ చేసి చూడండి" అని బదులిచ్చాడు. 2022 బర్మింగ్‌హమ్ టెస్టులో ఇంగ్లాండ్‌పై బుమ్రా ఒకే ఓవర్లో 35 పరుగులు రాబట్టడం ప్రపంచ రికార్డు అన్న సంగతి తెలిసిందే. దీన్ని ఉద్దేశిస్తూనే బుమ్రా సరదాగా ఆ వ్యాఖ్యలు చేశాడు. దీంతో ఇవి నెట్టింట చక్కర్లు కొట్టాయి.

దీనిపై తాజాగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "నేను గూగుల్ చేశా..! అయినా కమిన్స్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టినవారికి బ్యాటింగ్ ఎలా చేయాలో చాలా బాగా తెలుసు" అని పిచాయ్ రాసుకొచ్చారు. అంతేకాదు.. మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆకాశ్‌దీప్‌తో కలిసి బుమ్రా భారత్‌కు ఫాలోఆన్ గండాన్ని తప్పించాడంటూ ప్రశంసలు కురిపించారు. అటు గూగుల్ ఇండియా కూడా బుమ్రా వీడియోను పోస్ట్ చేస్తూ.. 'జస్సీ భాయ్‌ని మాత్రమే మేం నమ్ముతాం' అని రాసుకొచ్చింది.

గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో అంచనాల్లేని పరిస్థితుల్లో భారత్ గొప్పగా పోరాడింది. తొలుత రాహుల్, జడేజా గట్టెక్కించగా.. చివర్లో ఆకాశ్‌దీప్, బుమ్రా అద్భుతంగా పోరాడారు. ఈ క్రమంలోనే కమిన్స్ బౌలింగ్‌లో హుక్ షాట్‌తో బుమ్రా కళ్లు చెదిరే సిక్సర్ బాదాడు. ఆకాశ్‌బుమ్రా నిలబడటంతో టీమ్ఇండియా ఫాలోఆన్‌ను తప్పించుకుని మ్యాచ్‌ను డ్రా చేసుకునే అవకాశాలను మెరుగుపరుచుకుంది.

# ఎలక్ట్రిక్ స్కూటర్ల దూకుడు

**బిజినెస్ :** ప్రపంచ వ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ఈ విభాగంలో ద్విచక్ర వాహనాలు, కార్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పెట్రోలు, డీజిల్ వెహికల్స్ కు ప్రత్యామ్నాయంగా ఇవి తెరపైకి వచ్చాయి. ప్రభుత్వ ప్రోత్సాహం, పర్యావరణహితం, తక్కువ నిర్వహణ తదితర కారణాలతో వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అయితే తన దేశంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విక్రయాలు బాగున్నప్పటికీ, కార్లు మాత్రం వెనుక బడ్డాయి.

వాహనాల అమ్మకాల పరంగా ప్రపంచంలో మూడోస్థానంలో మన దేశం ఉంది. అత్యధిక జనాభా, సుస్థిర రాజకీయ వ్యవస్థ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ప్రగతి, ప్రజల ఆదాయాలు మెరుగ్గా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ కార్లు వినియోగం విపరీతంగా పెరగాలి. కానీ అందుకు భిన్నంగా విక్రయాలు సాగుతున్నాయి. వీటి వినియోగంలో చైనాలో 30 శాతం, అమెరికాలో 12 శాతానికి పైగా ఉండే, మన దేశంలో మాత్రం ఏడు కంటే తక్కువగా ఉంది. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం క్రమంగా పెరుగుతోంది. అది కేవలం స్కూటర్లకు పరిమితమైంది. కార్ల వినియోగం అతి తక్కువగా ఉంది. భారతీయ మార్కెట్ లో టాటా మోటార్స్ ఆధిపత్యం చెలాయిస్తోంది. దాని వెనుక హ్యుందాయ్, మహీంద్రా, కియా, జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్స్ ఉన్నాయి. దేశంలో 2030 నాటికి ఈవీల శాతం 30కి పెరగాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇది కొంచె కష్టమే అయినప్పటికీ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని భావిస్తోంది. ఎలక్ట్రిక్ స్కూటర్లతో పోల్చితే కార్ల ధరలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఉండే మన దేశంలో వాటిని కొనుగోలు చేయడం కష్టం. దీంతో చాలామంది ద్విచక్ర వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం దేశంలో అత్యంత చౌకయిన ఎలక్ట్రిక్ కారు ఎంపీ కామెట్. దీని ధర రూ.7 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. ఇది కూడా పరిమిత పరిధి కలిగి, నగరాల్లో తిరగడానికి వీలుగా ఉండే కారు. ఆ తర్వాత టాటా టియాగో రూ.8 లక్షల నుంచి అందుబాటులో ఉంది. దీన్ని ఒక్కసారి చార్జింగ్ చేస్తే కేవలం 300 కిలోమీటర్ల రేంజ్ మాత్రమే వస్తుంది.

దేశంలోని వెయ్యి మందిలో కేవలం 26 మంది మాత్రమే కార్లను వినియోగిస్తున్నారు. మిగిలిన వారికి ద్విచక్ర వాహనాలు, ప్రభుత్వ రవాణా సాధనాలే శరణ్యం. ఇక ఎలక్ట్రిక్ కార్లన్నీ పట్టణ ప్రాంతాలకే పరిమితమయ్యాయి. మేజర్ పంచాయతీలలో పాటు గ్రామాల స్థాయికి పూర్తిస్థాయిలో చేరలేదనే చెప్పాలి.



ఎలక్ట్రిక్ వాహనాలకు బ్యాటరీ చాలా కీలకం. ఆధునిక టెక్నాలజీతో బ్యాటరీ సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో దాని ఖర్చులు తగ్గుతున్నాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఈవీల ధరలు తగ్గుముఖం పట్టాయి. అలాగే మారుతీ సుజుకీ తన మొట్టమొదటి ఎలక్ట్రిక్ వెహికల్ వీ విటారాను జనవరిలో జరిగే మొబిలిటీ ఎక్స్ పోలో విడుదల చేయడానికి సిద్ధమైంది. మహీంద్రా నుంచి బీఈ 6, ఎక్స్‌ఈవీ 9ఈ, హ్యుందాయ్ నుంచి క్రెటా ఈవీ కూడా మార్కెట్ లోకి రానున్నాయి. మరికొన్ని లగ్జరీ కార్ల బ్రాండ్ల నుంచి వాహనాలు విడుదల కానున్నాయని సమాచారం. అలాగే పబ్లిక్ చార్జింగ్ పాయింట్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. బ్యాటరీ టెక్ డెవలప్మెంట్ కూడా మెరుగుపడుతోంది. ఇదే జరిగితే ఎలక్ట్రిక్ కార్లు లాంగ్ డ్రైవ్ కు చాలా అనుకూలంగా ఉంటాయి. వాటిని వినియోగం పెరిగి, విక్రయాలు కూడా జోరందుకుంటాయి.

## హర్యానా స్టీలర్స్‌పై యూపీ యోధాస్ విజయం

**క్రీడావిభాగం :** ప్రోకబడ్డీ ప్రీమియర్ లీగ్ (పీకేఎల్) సీజన్ 11 తుది దశకు చేరుకుంది. ఒక్కో మ్యాచ్ ఫలితంతో ప్లే ఆఫ్స్ సమరం ఆసక్తిగా మారుతోంది. ఇప్పటికే హర్యానా స్టీలర్స్, దబాంగ్ ఢిల్లీ ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా.. మరో రెండు స్థానాల కోసం యూపీ యోధాస్, పట్నా పైరేట్స్, జైపూర్ పింక్ పాంథర్స్, యు ముంబా, తెలుగు టైటాన్స్ పోటీ పడుతున్నాయి. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ యోధాస్ 3124తో టేబుల్ టాపర్ హర్యానా స్టీలర్స్‌ను ఓడించి తమ ప్లే ఆఫ్స్ అవకాశాలను మెరుగుపురుచుకుంది. 20 మ్యాచ్‌ల్లో 11 విజయాలు, 3 టైలతో మూడో స్థానంలో నిలిచిన యూపీ యోధాస్.. ప్లే ఆఫ్స్‌కు మరో అడుగు దూరంలో నిలిచింది.

హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో యూపీ తరపున భవానీ రాజ్‌పుత్(11) సత్తాచాటాడు. ఫస్టాఫ్‌లో ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్లు తలపడ్డాయి. హర్యానాను ఆలౌట్ చేసిన యూపీ యోధాస్ 1513 తేడాతో ఆధిక్యం సాధించింది. సెకండాఫ్‌లో మరింత జోరు కనబర్చిన యూపీ యోధాస్.. మరోసారి హర్యానాను ఆలౌట్ చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. హర్యానా తరపున విశాల్, వినయ్ 6 పాయింట్స్‌తో రాణించారు.

యూపీ యోధాస్ విజయంతో తెలుగు టైటాన్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. యూపీ యోధాస్ విజయంతో తెలుగు టైటాన్స్ 6వ స్థానం నుంచి ఏడో స్థానానికి పడిపోయింది. తెలుగు టైటాన్స్ 20 మ్యాచ్‌ల్లో 11 విజయాలు సాధించింది. మరో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

ప్లే ఆఫ్స్ చేరాలంటే ఈ మూడింటికి మూడు గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు మ్యాచ్‌లు గెలిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. నేడు తెలుగు టైటాన్స్ పట్నా పైరేట్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉంటాయి.

## అదిరిపోయే ఫీచర్లతో మార్కెట్ లోకి పోకో ఎం7 ప్రో

**బిజినెస్ :** దేశంలో పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా స్మార్ట్ ఫోన్ అవసరం రోజురోజుకూ ఎక్కువవుతోంది. మనిషికి అత్యవసరమైన కనీస వస్తువుల జాబితాలో చేరిపోయింది. దీంతో స్మార్ట్ ఫోన్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పలు కంపెనీల నుంచి అనేక మోడళ్లు మార్కెట్ లో విడుదల అవుతున్నాయి. వీటిలో తక్కువ ధరకు, బెస్ట్ ఫీచర్లతో లభించే ఫోన్లలో పోకో ముందు వరుసలో ఉంటుంది. ఈ కంపెనీ మోడళ్లకు మన దేశంలో మంచి ఆదరణ లభిస్తోంది. పోకో ఎం7 ప్రో అనే 5జీ స్మార్ట్ ఫోన్ మార్కెట్ లోకి విడుదలైంది. దాని ప్రత్యేకతలు, ధర వివరాలు తెలుసుకుందాం. పోకో ఎం7 (5జీ) స్మార్ట్ ఫోన్ రూ.13,999 ధరతో అందుబాటులోకి వచ్చింది. ఈ సెగ్మెంట్ లో అత్యంత తక్కువ ధరకు లభిస్తున్న ఫోన్ ఇదే కావడం విశేషం. దీనిలో 6.67 అంగుళాల ఫుల్ హెచ్ డీ డిస్ ప్లే, మీడియా టెక్ డైమెన్సిటీ 7025 అల్ట్రా ఎస్వోసీ, 5110 ఎంఏహెచ్ బ్యాటరీ, డ్యూయల్ రేర్ కెమెరా సెటప్ తదితర ప్రత్యేకతలు ఉన్నాయి. రెండు రకాల వేరియంట్లలో కొత్త పోకో స్మార్ట్ ఫోన్ విడుదలైంది. 6 జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.13,999 అలాగే 8 జీబీ, 256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.15,999 పలుకుతోంది. మీడియాటెక్ డైమెన్సిటీ 7025 అల్ట్రా చిప్ సెట్ ప్రాసెసర్ కారణంగా ఫోన్ పనితీరు చాలా మెరుగ్గా ఉంటుంది. గేమింగ్ తో పాటు రోజు వారీ పనులు చేసుకోవడానికి వీలుంటుంది. 6.67 అంగుళాల ఫుల్ హెచ్ డీ అమోలెడ్ డిస్ ప్లే కారణంగా విజువల్ చాలా స్పష్టంగా కనిపిస్తుంది. స్మూత్ గా ఆపరేటింగ్ చేసుకోవచ్చు. అదనపు మన్నిక కోసం స్క్రీన్ గొరిల్లా గ్లాస్ ను ఏర్పాటు చేశారు. కెమెరా సెటప్ ను అద్భుతంగా అమర్చారు. 50 మెగా పిక్సల్ సోనీ ల్వైతియా ఎల్వైటీ 600 ప్రైమరీ సెన్సార్, 2 మెగా ఫిక్సల్ మాక్రో సెన్సార్, సెల్ఫీలు, వీడియోల కోసం 20 మెగా పిక్సల్ సెన్సార్ కెమెరాతో స్పష్టమైన చిత్రాలు, వీడియోలు తీసుకోవచ్చు. కొత్త స్మార్ట్ ఫోన్ లో హైపర్ ఓఎస్ సాఫ్ట్ వేర్ ను అప్ డేట్ చేశారు. ఇది ఆండ్రాయిడ్ 14 పై ఆధారపడి పనిచేస్తుంది. రెండేళ్ల పాటు ఆండ్రాయిడ్ ఓఎస్ అప్ డేట్లు, నాలుగేళ్ల పాటు సెక్యూరిటీ అప్ డేట్లు అందించనున్నారు. స్పష్టమైన ఆడియో కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

స్టైలిష్ డిజైన్, మంచి కెమెరా సెటప్ తో రూపొందించిన పోకో ఎం7 ప్రో ఫోన్ అమ్మకాలు డిసెంబర్ 20వ తేదీ మధ్యాహ్నం నుంచి ప్రారంభమవుతాయి. అత్యంత తక్కువ ధరకే అందుబాటులోకి వస్తున్న ఈ ఫోన్ ను మార్కెట్ మంచి ఆదరణ లభిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న రెడ్ మీ, లావా తదితర వాటికి పోకో ఎం7 ప్రో మంచి పోటీ ఇస్తుందని భావిస్తున్నారు.

## విద్యార్థులకు ఎయిర్ ఇండియా ఆఫర్




**బిజినెస్ :** ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా దేశంలోని ఇతర ప్రాంతాలతోపాటు, విదేశాలకు వెళ్లే విద్యార్థులకు అదిరిపోయే ఆఫర్ ప్రకటించింది. ఉన్నత చదువుల కోసం దేశంలో ఇతర ప్రాంతాలతోపాటు, ఇతర దేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థులకు విమాన ధరలో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. అదనంగా 10 కిలోల వరకు బ్యాగేజ్‌ను కూడా అనుమతిస్తున్నట్లు పేర్కొంది. దేశీయ ప్రయాణాలు చేయాలనుకునే విద్యార్థుల వయసు 12 ఏళ్ల వరకు ఉండాలి. అదే అంతర్జాతీయ ప్రయాణాలు చేసేవారు 1230 ఏళ్ల వయసు వరకు ఉండొచ్చు. అడ్మిషన్ పొందిన కాలేజీ లేదా యూనివర్సిటీ ప్రభుత్వ గుర్తింపు పొందిందై ఉండాలి. విద్యార్థులు కనీసం ఒక విద్యాసంవత్సరం ఫుల్ టైమ్ కోర్సులో చేరి ఉండాలి. ఈ ఆఫర్ వినియోగించుకోవాలనుకునే విద్యార్థులు ఎయిరిండియా అధికారిక వెబ్ సైట్, మొబైల్ యాప్, కస్టమర్ కాంటాక్ట్ సెంటర్, ఎయిర్‌పోర్ట్ టికెటింగ్ కార్యాలయాల ద్వారా టికెట్లను బుక్ చేసుకోవచ్చు. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, ఎయిరిండియా బ్యాంకు పార్టనర్లు జారీ చేసిన క్రెడిట్/డెబిట్ కార్డుల ద్వారా చెల్లింపులు చేస్తే అదనంగా ప్రయోజనాలు పొందవచ్చని కంపెనీ తెలిపింది. అధికారిక వెబ్ సైట్ నుంచి బుక్ చేసుకునే విద్యార్థులకు కన్వినియెన్స్ ఛార్జీల రూపంలో ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయబోమని కంపెనీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ నిపుణ్ అగర్వాల్ తెలిపారు. దానివల్ల దేశీయ విమానాల్లో ప్రయాణించే విద్యార్థులు రూ.399, అంతర్జాతీయ విమానాల్లో వెళ్లేవారు రూ.999 వరకు అదనంగా ఆదా చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



**బిజినెస్ :** దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు నష్టాలను మూటకట్టుకున్నాయి. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు వెలువడనున్న తరుణంలో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 502 పాయింట్ల నష్టంతో 80,182కి పడిపోయింది. నిఫ్టీ 137 పాయింట్లు కోల్పోయి 24,198కి దిగజారింది.

బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:

రిలయన్స్ (0.64%), సన్ ఫార్మా (0.63%), టీసీఎస్ (0.55%), టెక్ మహీంద్రా (0.50%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (0.40%).

టాప్ లూజర్స్:

టాటా మోటార్స్ (3.03%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (2.56%), ఎన్టీపీసీ (2.09%), జేఎస్ డబ్ల్యూ స్టీల్ (2.02%), అదానీ పోర్ట్స్ (1.79%).

# నాగన్న ట్రైలర్ విడుదల



చాందిని క్రియేషన్స్ బ్యానర్‌పై మహేష్ కుమార్ హీరోగా, చిత్రం శ్రీను ప్రధాన పాత్రలో నెక్కంటి నాగరాజు నిర్మిస్తున్న తాజా చిత్రం నాగన్న. ఈ చిత్రాన్ని సతీష్ కుమార్, మహేష్ కుమార్ ఇద్దరు దర్శకత్వం చేస్తున్నారు. వీరితో పాటు సింధు సిరి, చందన, రూప, జనర్ధాన్, స్వాతి ఘట్కర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రం నుంచి బుధవారం ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రం యూనిట్ మీడియా సమావేశం నిర్వహించారు. ఎలాంటి సినిమా బ్యాగ్రౌండ్ లేకుండా సినిమా తీసి, థియేటర్, ఓటీటీలలో విడుదల చేయడం అంటే ఎంత కష్టమో అందిరికి తెలిసిందే. ఈ విషయంలో డైరెక్టర్స్ సతీష్ కుమార్, మహేష్ కుమార్ ల కృషి అద్భుతం అని సమావేశానికి వచ్చిన అతిథులు కొనియాడారు. ఈ సమావేశంలో డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. ఈ సినిమాకు ప్రత్యేక్షంగా, పరోక్షంగా పనిచేసినా, హెల్ప్ చేసిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదిత్య మ్యూజిక్ లో పాటలు వచ్చేలా కృషి చేసిన నిరంజన్, మాధవ్ ఇద్దరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సినిమా ఇంత బాగా రావడానికి ప్రొడ్యూసర్ నెక్కంటి నాగరాజు ఇచ్చిన ప్రోత్సాహం ఎంతో ఉంది అని పేర్కొన్నారు. హీరోయిన్ సింధూ మాట్లాడుతూ.. తెలుగు అమ్మాయిగా పుట్టినందుకు సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగ జై కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఫ్రెండ్‌తో ఆడిషన్‌కు వెళ్లి సెలెక్ట్ అయినట్లు చెప్పారు. ఇక షూటింగ్ సమయంలో డైరెక్టర్, నిర్మాత చూపెట్టిన కేర్ మర్చిపోలేదన్నారు. షూటింగ్ అంతా చాలా కంఫర్టుగా జరిగిందని, తెలుగు అమ్మాయిలను సపోర్ట్ చేయండి అని పేర్కొన్నారు.

హీరో, డైరెక్టర్ మహేష్ మాట్లాడుతూ.. 12 సంవత్సరాలుగా ఇండస్ట్రీలో పనిచేస్తూ చాలా మందితో పరిచయం ఉందని, ఈ కథ పట్టుకొని, చాలా మంది హీరోల దగ్గరకు వెళ్లి కథ చెప్పాము, అలా నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. ఇక ప్రొడ్యూసర్ నాగరాజు అన్న నన్నే హీరోగా పెట్టి చేయన్నారు. దాంతో కథను చాలా తొందరగా ఫినిష్ చేయాలి అని చాలా ప్రణాళికతో సినిమా పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ సినిమా ఓటీటీలో వస్తుందని, సొంతంగా థియేటర్లో విడుదల చేస్తన్నట్లు చెప్పుకొచ్చారు. ఇక ట్రైలర్ విషయానికి వస్తే ఒక ఊరిలో ఉండే కొంత మంది కుర్రళ్లు ఒక నిధి కోసం పాటుపడుతారని, ఈ వేటలో వారికి నిధి దొరికిందా లేదా అనే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కినట్లు తెలుస్తుంది. యూట్యూబ్‌లో విడుదలైన ఈ ట్రైలర్‌పై మంచి ప్రశంసలు వస్తున్నాయి. ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు.

# ఏప్రిల్ 10న రానున్న 'జాక్- కొంచెం క్రాక్'



సిద్ధు జొన్నలగడ్డ ప్రస్తుతం మంచి ఫాంలో ఉన్నారు. డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ అంటూ యూత్, మాస్ ఆడియెన్స్‌లో క్రేజీ ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. ఈయన కథాయకుడిగా బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతోన్న తాజా చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్ లైన్. శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై సీనియర్ ప్రొడ్యూసర్ బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సిద్ధు జొన్నలగడ్డ సరసన బేబీ ఫేమ్ వైష్ణవి చైతన్య నటిస్తున్నారు. కీలక పాత్రలో ప్రకాష్ రాజ్, నరేష్, బ్రహ్మాజీ వంటి వారు కనిపించనున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ 80 శాతం పైగానే పూర్తయ్యింది. శరవేగంగా షూటింగ్ చేస్తున్న చిత్రయూనిట్ తాజాగా ఓ అప్డేట్ ఇచ్చింది. ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను మేకర్లు రిలీజ్ చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ మూవీని గ్రాండ్‌గా విడుదల చేయబోతోన్నారు. సమ్మర్ కానుకగా రాబోతోన్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే పూర్తి కానుంది. ఈ చిత్రంలో సిద్ధు పాత్ర అందరినీ ఆకట్టుకునేలా ఉండబోతోంది. పూర్తి వినోదాత్మకంగా రాబోతోన్న ఈచిత్రానికి అచ్చు రాజమణి సంగీతాన్ని అందిస్తున్నారు. త్వరలోనే సినిమా ప్రమోషన్స్‌లో యూనిట్ ప్రారంభించనుంది.




# శివ పార్వతులుగా చైతు- సాయి పల్లవి!

అక్కినేని యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అక్కినేని నాగ చైతన్య రీసెంట్ గానే పెళ్లి చేసుకొని కొత్త లైఫ్ స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. మరి ఈ సమయంలో తన భారీ చిత్రం "తండేల్" లో కూడా తాను బిజీగా ఉన్నాడు. యువ దర్శకుడు చందూ మొండేటి తెరకెక్కిస్తున్న ఈ సినిమా పట్ల మంచి అంచనాలు నెలకొనగా ఆల్రెడీ ఈ సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ సింగిల్ బుజ్జి తల్లి చార్ట్ బస్టర్ అయ్యింది. ఇక ఈ సాంగ్ తర్వాత అంతా శివ శక్తి అనే సాంగ్ కోసం మాట్లాడుకున్నారు. హీరోయిన్ సాయి పల్లవి, హీరో చైతు నడుమ సాగే ఈ సాంగ్ అదిరిపోయింది అని టాక్ ఆ మధ్య వచ్చింది. మరి ఫైనల్ గా ఈ సాంగ్ పై ఇపుడు క్లారిటీ ఇచ్చేసారు మేకర్స్. ఈ డిసెంబర్ 22న మొత్తం మూడు భాషల్లో రిలీజ్ చేస్తున్నట్టుగా సాయి పల్లవి, నాగ చైతన్యపై స్టన్నింగ్ పోస్టర్ తో ఇపుడు రివీల్ చేయగా క్రేజీగా వైరల్ అయ్యింది. చందు మొండేటి ఈసారి పక్కా బ్లాక్ బస్టర్ కొడతారని అక్కినేని అభిమానులే కాదు మూవీస్ లవర్స్ అంతా ఫిక్స్ అయ్యేలా తండేల్ పోస్టర్స్ కనిపిస్తున్నాయి.

ఇప్పటికే తండేల్ నుంచి నాగ చైతన్య-సాయి పల్లవిల బుజ్జి తల్లి సాంగ్ ఎంతగా సెన్సేషన్ క్రియేట్ చేసిందో చూసాం. తండేల్ లోని చైతు-సాయి పల్లవుల కెమిస్ట్రీ కి అందరూ పడిపోతున్నారు.

శివ-పార్వతులు వలె నాగ చైతన్య-సాయి పల్లవి ల ఫోజ్ అక్కినేని అభిమానులను బాగా ఇంప్రెస్ చెయ్యగా.. సాధారణ ప్రేక్షకులు తండేల్ పోస్టర్స్ తోనే హిట్ కొడుతున్నారు అంటూన్నారు. నిజంగా లవ్ స్టోరీ చిత్రం కన్నా ఎక్కువగా తండేల్ చిత్రంలో నాగ చైతన్య-సాయి పల్లవిల కెమిస్ట్రీ భలే వర్కౌట్ అయ్యింది. వాళ్ళ కెమిస్రి మాములుగా లేదు, బుజ్జి తల్లి కన్నా ఎక్కువగా శివ శక్తి సాంగ్ వైరల్ అవడం ఖాయం అనిపిస్తుంది.

# బచ్చల మల్లి ప్రీరిలీజ్ ఈవెంట్

హీరో అల్లరి నరేష్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి'. సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగాదేవి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అమృత అయ్యర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన బ్లాక్ బస్టర్స్ తర్వాత హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలై టీజర్, పాటలకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. బచ్చల మల్లి డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ ని నిర్వహించారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ సంయుక్త ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దర్శకులు మారుతి, త్రినాథ్ రావు నక్కిన, వశిష్ట, విజయ్ కనకమేడల, యదు వంశీ, కార్తిక్ వర్మ దండు, బలగం వేణు అతిథులు పాల్గొన్న ఈ ప్రీరిలీజ్ ఘనంగా నిర్వహించారు.

ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇది ఒక సక్సెస్ మీట్ లా అనిపిస్తుంది. ఈవెంట్‌కి వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సినిమా అంటే పాషన్‌తో ఇక్కడికి వచ్చారు. డీవోపీ రిచర్డ్ ఈ సినిమాతో హైదరాబాదులో సెటిల్ అయిపోతారు. చాలా అద్భుతమైన కెమెరామెన్. ఈ సినిమాకి ఆయన లాంటి కెమెరామెన్ రావడం మా అదృష్టం. ఈ చిత్రానికి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చిన విశాల్ చంద్రశేఖర్ గారికి ధన్యవాదాలు. ఈ సినిమా ఆల్బమ్ నా కెరియర్ లో గుర్తుండిపోతుంది. బిజీఎం కూడా వండర్ఫుల్ గా ఇచ్చారు. మా చోట ప్రసాద్ గారికి, బ్రహ్మ గారికి, డాన్స్ మాస్టర్ కొరియోగ్రాఫర్స్ అందరికీ పేరుపేరునా థాంక్యూ. సుబ్బు కథ చెప్పగానే నాకు చాలా నచ్చింది. నాకోసం తను వెయిట్ చేశాడు. అయితే ఈ వెయిటింగ్ పిరియడ్ ని కూడా చాలా అద్భుతంగా వాడుకున్నాడు. సినిమా కోసమే అహర్నిశలు కష్టపడ్డాడు. ఈ వేడుకకు వచ్చిన సంయుక్త, కిరణ్ కి థాంక్యూ. క సినిమా నాకు చాలా నచ్చింది. సంయుక్త గారికి ఆల్ ద వెరీ బెస్ట్. అమృత చాలా మంచి పెర్ఫార్మెన్స్ చేసింది. హనుమాన్ సక్సెస్ తో ఇయర్ ని స్టార్ట్ చేశారు. బచ్చల మల్లి సక్సెస్ తో ఎండ్ చేయాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో పనిచేసిన అందరికీ థాంక్యూ. నిర్మాత రాజేష్ గారితో జర్నీ కొనసాగాలని కోరుకుంటున్నాను. ఇది నాకు హోం బ్యానర్. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాని నిర్మించారు. అడిగిన ప్రతిదీ ఇచ్చారు. ఆయన చాలా పెద్ద ప్రొడ్యూసర్ కావాలని కోరుకుంటున్నాను. సుబ్బు ఏదైతే చెప్పాడో అది తీశాడు. అందరం చాలా సిన్సియర్ గా చేశాం. 24 క్రాఫ్ట్స్ కష్టపడి ఇష్టపడి చేశారు. డిసెంబర్ 20న మీ ముందుకు వస్తుంది. ఈ సినిమాని హిట్ చేస్తారా, బ్లాక్ బస్టర్ చేస్తారా, కల్ట్ చేస్తారా అనేది ఆడియన్స్ చేతిలో ఉంది. ఒక్కటి మాత్రం చెబుతున్నాను. ఈ క్రిస్మస్ మనదే' అన్నారు.

హీరోయిన్ సంయుక్త మాట్లాడుతూ.. ఈ సినిమాలో ప్రతి కంటెంట్ చాలా ప్రామిస్ గా ఉంది. సినిమా కూడా చాలా బ్యూటిఫుల్ గా ఉంటుందని నాకు అనిపిస్తుంది. అమృత హనుమాన్ చిత్రంతో మంచి విజయాన్ని అందుకుంది. బచ్చల మల్లితో అది కంటిన్యూ చేయాలని కోరుకుంటున్నాను. మనం సినిమాని ఒక ప్యాషన్ తో తీస్తే ఆడియన్స్ కూడా కనెక్ట్ అవుతారు. మంచి కంటెంట్ ఉంటే ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ సినిమాలో పనిచేసిన అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు.

డైరెక్టర్ సుబ్బు మంగాదేవి మాట్లాడుతూ...ఈ రోజు నేనిక్కడ ఉండటానికి కారణమైన సాయి దుర్గాతేజ్‌కి ఎప్పుడూ కృతజ్ఞతలు తెలియజేస్తూనే ఉంటా. నా జీవితంలో మరో ముఖ్యమైన వ్యక్తి మారుతి. అమ్మలేని బాధలో ఉన్న నన్ను దాన్నుంచి బయటకు తీసుకొచ్చింది ఆయనే. ఈ కథ చెప్పిన తర్వాత నేను ఏదైతే అనుకుంటున్నా అలానే తీస్తా అని చెప్పారు. ఆయన ఆరోజు ఏదైతే చెప్పారో అదే మాట మీద నిలబడ్డారు. సినిమాని ప్రేమించే ప్రొడ్యూసర్లు దొరకడం దర్శకులకు అదృష్టం. కావేరి పాత్రకు అమృత ఇయర్ న్యాయం చేశారు. రాజావారు దగ్గర్నుంచి కిరణ్ కష్టాన్ని నేను చూశాను. ఆ కష్టం 'క' సినిమాతో పే అఫ్ అయింది. ఆయన ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. బచ్చలమల్లి క్యారెక్టర్ ని కేవలం నరేష్ మాత్రమే చేయగలరు. అది డిసెంబర్ 20న విట్నెస్ చేయబోతున్నాం. ఒక మంచి సక్సెస్ కోసమే మా ఇద్దరం కలిసామని అనిపించింది. డిసెంబర్ 20 తేదీన ఆ సక్సెస్ ని మనం చూడబోతున్నాం' అన్నారు.



# OGలోకి క్రేజీ బ్యూటీ

తెలుగు చిత్ర పరిశ్రమలో కొందరు హీరోయిన్స్ మంచి ఫేమ్‌ని యిట్టె తెచ్చుకుంటున్నారు. అయితే ఈ హీరోయిన్స్‌లో ఒక నటిగా కాకుండా వారు చేసిన పాత్రలు గుర్తుండిపోవడం అనేది కొంచెం అరుదుగానే జరుగుతుంది. ఇపుడు ఉన్న యంగ్ హీరోయిన్స్ లో ఒక్క హీరోయిన్ మాత్రం కుర్రాళ్ల హృదయాలు కొల్లగొట్టి ఓ రేంజ్‌లో ఫేమ్ తెచ్చుకుంది. ఆమె ఎవరో కాదు కన్నడ నటి నేహా శెట్టి అని చెప్పాలి.

తన ఎంట్రీ టాలీవుడ్ లో సింపుల్ గానే ఇచ్చినప్పటికీ తన కెరీర్ లో బ్రేకింగ్ సినిమా మాత్రం "డీజే టిల్లు" అని చెప్పాలి. ఈ సినిమాలో హీరో సిద్ధూ జొన్నలగడ్డ చేసిన టిల్లు రోల్ కూడా టాలీవుడ్‌లో ఎంత క్లిక్ అయ్యిందో తన పాటుగా రాధికగా నేహా శెట్టి కూడా ఫేమస్ అయ్యిపోయింది. అక్కడి నుంచి తన హాట్ షో మాత్రమే కాకుండా నటిగా కూడా మిడ్ రేంజ్ సినిమాలు చేస్తుంది. Wకానీ ఇపుడు ఈ ముద్దుగుమ్మ తన కెరీర్ లో క్రేజీ ఆఫర్ ని కొట్టేసినట్టుగా సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది.

ఏకంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాలో ఛాన్స్ కొట్టేసినట్టుగా ఫిలింనగర్‌లో రూమర్స్ వినిపిస్తున్నాయి. కాగా ఆ సినిమా కూడా పవన్ కెరీర్‌లోనే భారీ అంచనాలు ఉన్న చిత్రం "ఓజి" అట. పవన్ కళ్యాణ్, సాహో ఫేం సుజీత్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంలో ఈ యంగ్ అండ్ హాట్ బ్యూటీ స్పెషల్ ఐటెం సాంగ్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. ఇపుడు నడుస్తున్న బ్యాంకాక్ షెడ్యూల్‌లోనే ఈమెపై అక్కడే ఈ సాంగ్ ని మేకర్స్ చేస్తున్నట్టుగా ఇపుడు తెలుస్తుంది.

అయితే పవన్ ఈ సినిమా షూటింగ్ లో లేరని తెలిసిందే. సో పవన్ తో ఈమెకి స్క్రీన్ స్పేస్ లేదనే చెప్పాలి. బహుశా ఈ సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్న బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీతో ఈ సాంగ్ ఉండి ఉండొచ్చు అని చెప్పాలి. ప్రస్తుతం అయితే ఈ హిట్ బ్యూటీ ప్రెజెన్స్ సినిమాలో ఉన్నట్టే తెలుస్తుంది.

మరి చూడాలి ఈమె కేవలం ఇమ్రాన్ తోనే ఉంటుందా అనేది. ఇక ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన యువ హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా నటిస్తుండగా ప్రముఖ నటులు శ్రేయ రెడ్డి, అర్జున్ దాస్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. డీవీవీ దానయ్య భారీ బడ్జెట్‌తో ఈ సినిమాని నిర్మిస్తుండగా ప్రస్తుతానికి పవన్ కళ్యాణ్ ఎప్పుడు షూటింగ్‌లో జాయిన్ అవుతారా అని మేకర్స్ చూస్తున్నారు. తన డేట్స్ ఇస్తే ఓజి కంప్లీట్ చేసేసి వచ్చే ఏడాది రిలీజ్‌కి తీసుకురానున్నారు.

# వీబీ ఎంటర్టైన్మెంట్స్ పదో వార్షికోత్సవం!



విష్ణు బొప్పన వీబీ ఎంటర్టైన్మెంట్స్ 2023-2024 సంవత్సరాలకు గాను, బుల్లి తెర అవార్డుని ప్రదానం చేసింది. ఈ సందర్భంగా హైద్రాబాద్‌లో ఘనంగా ఒక ఈవెంట్‌ని ఆర్గనైజ్ చేసి, సినీ రాజకీయ ప్రముఖుల సమక్షంలో అవార్డుల ప్రదానోత్సవం చేశారు. ఈ ఈవెంట్‌కి సమర్పకులు, వర్చ్యుసా లైఫ్ స్పేసెస్ కి సంబంధించిన వైగండ్ల వెంకటేశ్వర్లు, వీవీకే హోసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కి సంబంధించిన విజయ్ కుమార్, ఐశ్వర్య సిల్క్స్ లక్ష్మి, అడ్వాకేట్ నాగేశ్వర్ రావు పూజారి. ఈ ఈవెంట్ కి ముఖ్య అతిథులుగా దర్శకులు ఎస్‌వీ కృష్ణ రెడ్డి, నిర్మాత కేఅచ్చి రెడ్డి, నిర్మాత, అంబికా సంస్థల అధినేత అంబికా కృష్ణ. జేడీ లక్ష్మీనారాయణ, హీరో పూరి ఆకాష్, హీరోయిన్ అర్చన. ఈ ఈవెంట్ లో సీనియర్ నటి శ్రీలక్ష్మికి జీవన సాఫల్య పురస్కారం అందించారు. అంతే కాకుండా టీవీ ఆర్టిస్ట్స్ కి, సోషల్ మీడియా ఇన్ఫ్లుఎంసెర్స్ కి, యూట్యూబర్స్ కి కూడా అవార్డుని ప్రదానం చేశారు. అంతే కాకుండా, పది మంది పేద కళాకారులకి ఆర్థిక సాయం కూడా అందించారు. లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందుకున్న శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. "వీబీ ఎంటర్టైన్మెంట్స్ బుల్లితెర అవార్డు వారికి నా ధన్యవాదాలు. ఇన్నేళ్ళుగా సినిమాల్లో నటిస్తున్న నన్ను గుర్తించి నాకు ఈ అవార్డు ని అందించారు. మొదటగా నేను మా గురువు జంధ్యాలకి ధన్యవాదాలు చెప్పుకోవాలి. ఆ తర్వాత నేను పని చేసిన డైరెక్టర్స్ అందరికీ, నా మీద ఎప్పటికప్పుడు విశేష ప్రజాధారణ చూపిస్తున్న ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతలు." అన్నారు. కార్యక్రమంలో మానస, వేద, బిగ్ బాస్ ఫేమ్ బేబక్క, 30 యియర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్, దివ్య వాని, రీతూ చౌదరి, బులెట్ భాస్కర్, రామ సత్యనారాయణ, మా అసోషియేషన్ మెంబర్ మాణిక్యం, మాదాల రవి పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com